సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 165

సోమవారం 4-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'



పేదల ఇళ్లు లూటీ!

పేదల ఈడబ్ల్యూఎస్ గృహాలనూ వదలని చంద్రబాబు

రూ.8,000 కోట్ల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టు షాపూర్జీ పల్లోంజీకి.. తాత్కాలిక భవనాల తరహాలో ప్రజాధనం స్వాహాకు స్కెచ్

సెక్షన్లతో తిప్పికొడుతూ తాజాగా 153 సీ కింద ఐటీశాఖ నోటీసులు

10 లో



సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి

సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు సీఎం స్టాలిన్ కొడుకు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా వివాదాస్పదమయ్యాయి.

- వివరాలు 6లో



ఇంట్లోకి చొరబడి.. కత్తితో పొడిచి

ప్రేమించిన యువతి తనను దూరం పెట్టిందని, ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసిందని ఓ యువకుడు ఉన్మాదిగా మారాడు. ఆమెపై దాడి చేసేందుకు కత్తితో ఇంట్లోకి చొరపడ్డాడు.

- వివరాలు 2లో



2047 నాటికి 'అభివృద్ధి భారత్'

'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్'.. ప్రపంచానికి మార్గదర్శి

విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో అద్భుత ఫలితాలు సాధిస్తాం

పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

6 లో

26 సింగిల్ టిక్

మిగిలిన నియోజకవర్గాల్లో 2, 3 పేర్లు సిఫారసు

ఆశావహుల దరఖాస్తులను పరిశీలించి టిక్‌లు పెట్టిన పీఈసీ

26 స్థానాల్లో ఒకరి పేరుకే టిక్ పెట్టిన మెజారిటీ సభ్యులు!



- కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారులో కీలక ముందడుగు
- చాలా తక్కువ చోట్ల 4 పేర్లు టిక్
- పీఈసీ అభిప్రాయాలు సీల్డ్ కవర్‌లో నేడు స్క్రీనింగ్ కమిటీకి అందజేత.. ఉదయం 10 గంటలకు పీఈసీతో భేటీ కానున్న స్క్రీనింగ్ కమిటీ
- రేపు, ఎల్లుండి కూడా కొనసాగనున్న సమావేశాలు
- ఆ తర్వాత ఢిల్లీ కోర్టులోకి టికెట్ల ఖరారు వ్యవహారం

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖరారులో కీలక ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ పూర్తి చేసింది. ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గాంధీభవన్‌లో సమావేశమైన ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ), రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాల్లో అభ్యర్థిత్వం కోసం ఆశావహుల నుంచి అందిన దరఖాస్తులను పరిశీలించింది. నియోజకవర్గాల వారీగా వారి పేర్లను షార్ట్ లిస్ట్ చేసింది. ఈ మేరకు పీఈసీ సభ్యుల అభిప్రాయాలతో కూడిన సీల్డ్ కవర్లన్నిటినీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మరో సీల్డ్ కవర్‌లో పెట్టి సోమవారం స్క్రీనింగ్ కమిటీకి అందజేయనుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. 26 నియోజకవర్గాల్లో మెజారిటీ సభ్యులు ఒక్కటే పేరు సూచించారు. ఇక మిగిలిన నియోజకవర్గాలకు సంబంధించి కొన్ని చోట్ల 2, కొన్నిచోట్ల మూడు పేర్లకు సభ్యులు టిక్ పెట్టారు. చాలా తక్కువ స్థానాల్లో మాత్రమే 4 పేర్లు కూడా పీఈసీ సభ్యులు సిఫారసు చేసినట్టు తెలుస్తోంది.

ఒక్కొక్కరితో ముఖాముఖి

మురళీధరన్ నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీ సోమవారం గాంధీభవన్‌కు రానుంది. మురళీధరన్, సిద్ధిఖీ, జిగ్నేశ్ మేవానీలతో కూడిన కమిటీ ఉదయం 10 గంటల నుంచి పీఈసీ సభ్యులతో భేటీ కానుంది. అందరి సభ్యులతో విడివిడిగా మాట్లాడే విధంగా వారికి అపాయింట్‌మెంట్ ఇచ్చారు. మంగళవారం ఉదయం డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్సీలతో కూడా స్క్రీనింగ్ కమిటీ సమావేశం కానుంది. వారి అభిప్రాయాలను కూడా తెలుసుకున్న అనంతరం నివేదిక రూపొందించనుంది. ఈ నివేదికపై బుధవారం స్క్రీనింగ్ కమిటీ భేటీ కానుంది. ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శులు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు

మిగతా 3వ పేజీలో ▶



నిర్మల్ పట్టణంలో రోడ్డుపై వరద

పలు జిల్లాల్లో భారీ వర్షాలు

- రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం భారీ వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల వాగులు పొంగి ప్రవహించాయి. దాదాపు నెల రోజుల తర్వాత పడిన వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలు ఆరుతడి పంటలకు మేలు చేస్తాయని చెబుతున్నారు.

రెండ్రోజులు వర్షాలు!

బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

5 లో

క్లుప్తంగా...

నేడు వివిధ మార్గాల్లో పలు రైళ్ల రద్దు



సాక్షి, హైదరాబాద్: సాంకేతిక కారణాల దృష్ట్యా వివిధ మార్గాల్లో 20 దూరప్రాంతాల రైళ్లను, నగరంలోని వివిధ మార్గాల్లో నడిచే మరో 16 ఎంఎంటీఎస్ రైళ్లను ఈ నెల 4 నుంచి 10 వరకు రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కాజీపేట్–డోర్నకల్, విజయవాడ–డోర్నకల్, భద్రచాలం రోడ్–డోర్నకల్, కాజీపేట్–సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్ష– కాజీపేట్, సికింద్రాబాద్–వరంగల్, సిర్పూర్ టౌన్–భద్రాచలం, వరంగల్– హైదరాబాద్, కరీంనగర్–సిర్పూర్‌టౌన్, కరీంనగర్–నిజామాబాద్, కాజీపేట్–బల్లార్ష, తదితర మార్గాల్లో రైళ్ల రద్దు కానున్నట్లు పేర్కొన్నారు.
ఎంఎంటీఎస్‌లు రద్దు: ఈ నెల 4 నుంచి 10 వరకు లింగంపల్లి–నాంపల్లి, లింగంపల్లి–ఫలక్‌నుమా, ఉందానగర్–లింగంపల్లి, నాంపల్లి–లింగంపల్లి, తదితర మార్గాల్లో 16 సర్వీసులు రద్దు కానున్నట్లు వెల్లడించారు.

ఉద్యోగాల పేరిట వల

ఇంటర్వ్యూ పేరుతో వ్యక్తిగత వివరాల సేకరణ

సాక్షి, హైదరాబాద్: ఆకర్షణీయమైన వేతనాలు, కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాల పేరిట సైబర్ నేరగాళ్లు కొత్త మోసాలకు తెరతీస్తున్నారు. ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూల పేరిట వారి వద్ద నుంచి ఆధార్, పాన్ నంబర్, బ్యాంక్ ఖాతాలు, ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఇలా అన్ని వ్యక్తిగత వివరాలు సేకరించేందుకే ఈ ఆన్‌లైన్ ఇంటర్వ్యూల పేరిట వల వేస్తున్నట్లు సైబర్ క్రైం పోలీసులు హెచ్చరించారు. తమ అర్హత, అనుభవానికి మించిన వేతనాన్ని, పెద్దపెద్ద కంపెనీల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలు ఇస్తామని ప్రకటనలు ఇచ్చే వారిని, ఇంటర్వ్యూల పేరుతో ఆన్‌లైన్ వివరాలు పంపాలనే వారిని అనుమానించాలని వారు సూచిస్తున్నారు. ఫేక్ జాబ్ ఆఫర్లు, ఇంటర్వ్యూల పేరిట వివరాలు అడిగితే పంపవద్దని తెలిపారు. ఫేక్ జాబ్ మోసగాళ్ల చేతిలో ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు ఇవ్వాలని లేదా www. cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు 60 సీట్లు ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



నల్లగొండ టౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు 60 స్థానాల్లో టికెట్లు ఇవ్వాలని బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలోని బీసీ భవన్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు సామాజిక న్యాయం, జనాభా ప్రాతిపదికన టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న సరూర్‌నగర్ స్టేడియం ఆవరణలో ఐదులక్షల మందితో బీసీ సింహగర్జన సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. పార్టీలకతీతంగా బీసీలందరూ హాజరై సింహగర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. 60 శాతంగా ఉన్న బీసీలకు బీఆర్‌ఎస్ పార్టీ సముచిత స్థానం కల్పించలేదన్నారు. బీసీలను రాజకీయంగా అణిచివేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'రైతు ఆత్మహత్యల నివారణలో వైఫల్యం'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆత్మహత్యల నివారణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి విమర్శించారు. సెప్టెంబర్ 2న మెదక్, నిర్మల్ జిల్లాలకు చెందిన ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం దారుణమని ఆయన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. 'అబ్‌కీ బార్ కిసాన్‌సర్కార్'అంటున్న భారత రాష్ట్ర సమితి అధినేత, సీఎం కె.చంద్రశేఖరరావు స్వరాష్ట్రంలో రైతుల కష్టాలను మరచిపోవడం శోచనీయమని ఎద్దేవా చేశారు.

ఇదం జగత్



పర్మినెంట్‌గా అక్కడ బోర్డు పెట్టేశాం!!

తొలిరోజు స్పందన | అంతంతే

టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ షురూ

- అక్కడక్కడ సాంకేతిక సమస్యలు.. కొన్ని చోట్ల పనిచేయని సర్వర్
- అర్హులందరికీ అధికారుల నుంచి మెసేజ్‌లు
- గతంలో దరఖాస్తు చేసిన వారు వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని సూచన
- రేపటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ
- 10 వేల మందికి ప్రమోషన్లు..58 వేల మందికి బదిలీలు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఆదివారం మొదలైంది. తొలిరోజు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులకు పెద్దగా స్పందన కన్పించలేదు. అయితే ఈ ఏడాది జనవరిలో అవకాశం లభించని వారు, ఈసారి అవసరమైన సర్వీస్ ఉండటంతో దరఖాస్తు చేసుకునేందుకు ముందుకొచ్చారు. అక్కడక్కడ సర్వర్ సమస్య తలెత్తినట్టు ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 5 వరకూ ఉంటుంది. జనవరిలో దరఖాస్తు చేసుకున్న టీచర్లు వారి సర్వీస్ వివరాలు, ఇతర డేటాను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

అందరికీ మెసేజ్‌లు

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియపై ప్రతి ఉపాధ్యాయుడికి అధికారులు మెసేజ్‌లు పంపారు. 5వ తేదీ లోగా వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, జనవరిలో నమోదు చేసుకున్న వారు సమాచారం అప్‌డేట్ చేయాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తు ప్రతులను ఈ నెల 6, 7 తేదీల్లో డీఈవో కార్యాలయాల్లో సమర్పించాలని కోరారు. ఈ నెల 8, 9 తేదీల్లో దరఖాస్తుదారుల పూర్తి వివరాలను విద్యాశాఖ కార్యాలయం ఆన్‌లైన్‌లో అందరూ చూసే వెసులుబాటు కల్పిస్తున్నారు. దీనిపై అభ్యంతరాలుంటే 10, 11 తేదీల్లో అధికారులకు లిఖిత పూర్వకంగా, లేదా ఆన్‌లైన్‌లో తెలియజేయాల్సి ఉంటుంది. వీటి పరిశీలన అనంతరం 12, 13 తేదీల్లో సీనియారిటీ జాబితాను వెల్లడిస్తారు.



ముందు హెచ్‌ఎంల బదిలీ

ఈ నెల 15న ప్రధానోపాధ్యాయుల బదిలీలు చేపడతారు. బదిలీలతో ఖాళీ అయిన హెచ్‌ఎం పోస్టుల వివరాలను 16వ తేదీన వెల్లడిస్తారు. ఈ ఖాళీలను వెనువెంటనే స్కూల్ అసిస్టెంట్లతో 17 నుంచి 19వ తేదీ వరకూ భర్తీ చేస్తారు. దీంతో ఖాళీ అయ్యే స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 20, 21 తేదీల్లో వెల్లడిస్తారు. 23, 24న స్కూల్ అసిస్టెంట్ బదిలీలు చేపడతారు. 26 నుంచి స్కూల్ అసిస్టెంట్ ఖాళీల్లో ఎస్జీటీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు. ఆ తర్వాత ఎస్జీటీల బదిలీలు చేపడతారు. ఈ ప్రక్రియ మొత్తం అక్టోబర్ 3తో ముగుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 వేల మంది టీచర్లకు పదోన్నతులు లభించే అవకాశం ఉంది. బదిలీల కోసం 78 వేల మంది జనవరిలో దరఖాస్తు చేసుకున్నారు. కటాఫ్ డేట్‌ను ఫిబ్రవరి 1 నుంచి సెప్టెంబర్ 1కి మార్చడంతో మరో రెండు వేల మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే వీలుంది. మొత్తం మీద 58 వేల మంది బదిలీ అయ్యే అవకాశం ఉందని అంచనా.

వెంటాడుతున్న చిక్కుముళ్లు

జాబితాల రూపకల్పనలో డీఈవోలు ఇప్పటికీ సవాళ్లను ఎదుర్కొంటున్నారు. సీనియారిటీపై స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో హెచ్‌ఎం పోస్టులకు, ఎస్‌ఏల పదోన్నతికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. మల్టీ జోనల్ పోస్టులవ్వడంతో 14 జిల్లాల స్కూల్ అసిస్టెంట్లలో వివిధ సబ్జెక్టుల్లో ఒకే ర్యాంకింగ్ ఉన్న వారిని ఎలా ఎంపిక చేయాలనే సమస్యను డీఈవోలు ఎదుర్కొంటున్నారు. ప్రతి సబ్జెక్టులో, ప్రతి విభాగంలో ఒకే తరహాలో ఉన్నప్పుడు అనుసరించాల్సిన పద్ధతులపై ఉన్నతాధికారులు సరైన మార్గదర్శకత్వం ఇవ్వాలని కోరుతున్నారు. వికలాంగుల విషయంలోనూ కొన్ని అనుమానాలు అధికారులు లేవనెత్తుతున్నారు. 40 శాతం వైకల్యాన్ని పరిగణనలోనికి తీసుకోవాలని హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చింది. అయితే ఇప్పటికీ 70 శాతం నిబంధనే అమలు చేస్తున్నట్టు, కోర్టు ఆదేశాలు తమకు అందలేదని అధికారులు అంటున్నారు. ఈ కారణంగా బదిలీల ప్రక్రియపై కొందరు కోర్టుకు వెళ్లే వీలుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సాఫ్ట్‌వేర్‌పై ప్రత్యేక పరిశీలన

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎక్కడా సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోవడంతో పాటు, సర్వర్లను పరిశీలించాలని ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు కాకుండా, కొన్ని ఏజెన్సీలను ఇందులో భాగస్వాముల్ని చేశారు. జిల్లాల స్థాయిలో సరైన సమాచారం ఫీడ్ చేస్తే తప్ప సాఫ్ట్‌వేర్ పరంగా వచ్చే సమస్యలు అధిగమించే వీల్లేదని సాంకేతిక నిపుణులు అంటున్నారు.

జ్ఞాపకశక్తిలో భళా దేవాన్షి

- బాలమేధావికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- చిన్నారి వయసు ఏడాది 9 నెలలు



ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన చిన్నారి దేవాన్షి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): అద్భుత మేధస్సు.. అమోఘమైన జ్ఞాపకశక్తి ఆ చిన్నారి సొంతం. ఒక్కసారి చెబితే చాలు.. గుర్తించి దాని పేర్లను చెబుతుంది. ఏడాది 9 నెలల వయసున్న ఆ బాల మేధావి అసమాన ప్రతిభతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2023లో చోటు సంపాదించింది. వివరాలివి. రామచంద్రాపురం పట్టణంలోని కాకతీయ నగర్ ప్రాంతానికి చెందిన బండారి విజయేంద్ర, మౌనిక దంపతుల కుమార్తె దేవాన్షి.. వస్తువులను గుర్తించడం, అంకెలను ఒకటి నుండి పది వరకు చెప్పడం, ఐదు రకాల జంతువుల్లా అరవడంలో దిట్ట. దీంతో కుటుంబ సభ్యులు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారిని సంప్రదించారు. వారి సూచనల ప్రకారం కుమార్తె ప్రతిభపై చిత్రీకరించిన వీడియోలు, జనన ధ్రువీకరణ పత్రం, చిరునామా రుజువులను సమర్పించారు. ఆ వీడియోలో దేవాన్షి 15 బొమ్మలు, ఆరు శిశువు ఉత్పత్తులు, తొమ్మిది కూరగాయలు, ఐదు కార్టూన్ పాత్రలు, శరీరంలోని 11 భాగాల చిత్రాలను గుర్తించినట్టు చూపించారు. అదనంగా 6 రైమ్‌లు, 10 యాక్షన్ పదాలు, 1 నుంచి 10 వరకు సంఖ్యలను లెక్కించడం, ఐదు జంతువుల శబ్దాలను అనుసరించడం వంటివి రికార్డు చేశారు. వాటిని పరిశీలించిన నిర్వాహకులు ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో దేవాన్షికి చోటు కల్పించారు. కాగా చిన్నారి తండ్రి విజయేంద్ర జూరాల ప్రాజెక్టులో ఏఈఈగా పనిచేస్తున్నారు.

ఇంట్లోకి చొరబడి.. | కత్తితో పొడిచి

- ప్రేమించిన యువతి దూరంపెట్టిందని ఓ యువకుడి ఘాతుకం
- ఆమెపై దాడికి యత్నం.. అడ్డుకున్న తమ్ముడికి కత్తిపోటు
- చికిత్స పొందుతూ తమ్ముడు మృతి
- గాయాలతో బయటపడ్డ యువతి
- నిందితుడికి స్థానికుల దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత



పోలీసుల అదుపులో నిందితుడు శివకుమార్. అతడి నుంచి స్వాధీనం చేసుకున్న కత్తి

నాగోలు: ప్రేమించిన యువతి మాట్లాడటం మానేసిందని... తన ఫోన్ నంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టిందని ఓ యువకుడు ప్రేమోన్మాదిగా మారాడు. ఆమెపై కక్షపెంచుకొని దాడి చేసేందుకు కత్తితో ఇంట్లోకి చొరపడ్డాడు. అడ్డువచ్చిన ఆమె తమ్ముడిని తొలుత పొడవడంతో అతను తీవ్ర గాయాలపాలై మృతి చెందగా అతని సోదరి స్వల్ప గాయాలపాలైంది. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

టెన్త్ నుంచే ప్రేమలో...

ఎల్బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలానికి చెందిన సురేందర్‌గౌడ్, ఇందిరకు ఓ కూతురు, కొడుకులు పృథ్వీ (చింటూ) (23), రోహిత్ సంతానం. వారిలో యువతి, పృథ్వీ రెండేళ్ల క్రితం హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. పృథ్వీ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉండగా యువతి రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతోంది. షాద్‌నగర్ ప్రాంతంలోని షారుక్‌నగర్ మండలం నేర్లొ చెరువుకు చెందిన శివకుమార్ (26) యువతికి పదవ తరగతి నుంచి క్లాస్‌మెట్. ఇద్దరూ అప్పటి నుంచి ప్రేమలో ఉన్నారు. హోమియోపతి కోర్సు చదువుతున్న యువతిని తరుచూ కలిసేందుకు వీలుగా శివకుమార్ రామంతాపూర్‌లోనే నివాసం ఉంటూ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నాడు.



దాడిలో మృతిచెందిన పృథ్వీ (ఫైల్‌ఫొటో)

మనస్పర్థలతో దూరం పెట్టిన యువతి..

సదరు యువతి, శివకుమార్ మధ్య ఇటీవల చిన్నపాటి గొడవలు చోటుచేసుకోవడంతో ఆమె అతన్ని దూరంపెట్టింది. అతనితో మాట్లాడటం మానేసింది. అతని ఫోన్ నంబర్‌ను సైతం బ్లాక్ లిస్టులో పెట్టింది. ఈ విషయమై ఆమెతో మాట్లాడేందుకు శివకుమార్ ప్రయత్నిస్తున్నా కుదరలేదు. దీంతో కోపోద్రిక్తుడైన శివకుమార్ ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై యువతి రూమ్ వద్దకు కత్తితో వచ్చాడు. తనను మోసం చేశావంటూ కేకలు వేస్తూ లోపలకు చొరబడి యువతిపై కత్తితో దాడి చేసే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న పృథ్వీ శివకుమార్‌ను అడ్డుకొనే ప్రయత్నం చేయగా అతనిపై కత్తితో దాడి చేశాడు. కత్తిపోటు బలంగా దిగడంతో పృథ్వీకి తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో అతను ఇంటి నుంచి బయటకు కొంత దూరం నడుచుకుంటూ వచ్చి రోడ్డుపై పడిపోయాడు. మరోవైపు శివకుమార్ యువతిని గదిలో బంధించి లోపల నుంచి గడియ పెట్టాడు.

నిందితుడిని పట్టుకున్న మహిళలు...

గదిలోంచి పెద్దగా కేకలు వినపడటం, పృథ్వీ నెత్తురోడుతూ బయటకు వచ్చి పడిపోవడంతో ఇరుగుపొరుగు మహిళలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకొని కర్రలతో గది తలుపు పగలగొట్టి లోపలకు ప్రవేశించారు. శివకుమార్‌ను చితకబాది పోలీసులకు అప్పచెప్పారు. రోడ్డుపై పడిపోయిన పృథ్వీతోపాటు స్వల్పంగా గాయపడిన యువతిని స్థానికులు చికిత్స నిమిత్తం కామినేని హాస్పిటల్‌కు... అక్కడి నుంచి ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పృథ్వీ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడికి ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఏసీపీ జానకిరెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ దరల్లి రాజశేఖర్‌రెడ్డి, ఇతర నేతలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రైల్వే విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం | సహకరించట్లేదు

- అందుకే 700 కి.మీ. మేర రైల్వే లైన్ల పనులు నిలిచిపోయాయి
- వాటా చెల్లింపు, భూసేకరణలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరోపణ



సాక్షి, హైదరాబాద్/బన్సీలాల్‌పేట్: రైల్వే లైన్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని... తెలంగాణలో అత్యంత తక్కువగా రైల్వే లైన్లు ఉండటంతో ఇక్కడ భారీ ఎత్తునరైల్వే ప్రాజెక్టుల ఏర్పాటుకు చొరవ తీసుకుంటోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. కానీ గతేడాదిగా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, సహాయ నిరాకరణ వల్ల రాష్ట్రంలో దాదాపు 700 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ల పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లింపు, భూసేకరణలో బాధ్యతారాహిత్యంగా కేసీఆర్ సర్కారు వ్యవహరిస్తుండటం వల్లే ఈ పనులు నిలిచిపోయాయని ఆరోపించారు.

రాష్ట్రంలో రైల్వే వ్యవస్థ అభివృద్ధికి కేంద్రం పెద్దపీట..

తెలంగాణలో రైల్వే వ్యవస్థ అభివృద్ధికి 30 ప్రాజెక్టుల కోసం కేంద్రం రూ. 83,543 కోట్లు మంజూరు చేయడంతోపాటు 5,239 కిలోమీటర్ల మేర నూతన రైల్వే లైన్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో, ఏక కాలంలో రైల్వే ప్రాజెక్టులు చేపట్టడానికి కేంద్రం నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారని వివరించారు. దాదాపు 15 కొత్త రైల్వే లైన్ల ఏర్పాటు కోసం ఫైనల్ లొకేషన్ సర్వేకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన వివరించారు. దీంతోపాటు 8 లైన్ల డబ్లింగ్, 3 ట్రిప్లింగ్, 4 క్వాడ్రప్లింగ్ లైన్లకు రైల్వే శాఖ పచ్చజెండా ఊపిందని, ఈ మొత్తం ప్రాజెక్టులకు ఫైనల్ లొకేషన్ సర్వే కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. సర్వే పూర్తవగానే సవివర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. రాష్ట్రంలో 40 రైల్వేస్టేషన్ల ఆధునీకరణకు రైల్వే శాఖ ఆమోదముద్ర వేయగా అందులో 21 స్టేషన్ల ఆధునీకరణకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ 40 స్టేషన్ల ఆధునీకరణ, అభివృద్ధికి కేంద్రం రూ. 2,300 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. తెలంగాణలో 2014కు ముందు ఏడాదికి సగటున 17.4 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ల నిర్మాణం జరిగితే మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఏటా సగటున 55 కిలోమీటర్ల రైల్వే లైన్ల నిర్మాణం జరుగుతోందన్నారు.

ఆ అభిమానం మరువలేనిది

అమెరికాలోని ఎన్నారైల భేటీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్



సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పట్ల ప్రవాస భారతీయులు చూపుతున్న అభిమానానికి బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. మోదీపై చూపుతున్న అభిమానాన్ని ఓట్లరూపంలో కురిపించాలని కోరారు. అమెరికా పర్యటనలో ఉన్న సంజయ్ భారత కాలమానం ప్రకారం ఈ రోజు మధ్యాహ్నం అట్లాంటాలో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ''మీ అందరినీ కలవడం చాలా సంతోషంగా ఉంది. మోదీపై మీరు చూపుతున్న అభిమానం వెలకట్టలేనిది. మోదీ 9 ఏళ్ల పాలన అవినీతికి తావు లేకుండా కొనసాగుతోంది. అభివృద్ధిలో భారత్ ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలవాలంటే మళ్లీ మోదీ ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం ఉంది. అందుకోసం మీరంతా సమయం తీసుకుని ఎన్నికల సమయంలో భారత్ రండి. మోదీ తరఫున ప్రచారం చేయడంతోపాటు ఓట్లు వేయాలి'అని కోరారు. మోదీ పాలనలో భారత్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, స్వదేశంలో పెట్టుబడులు పెట్టాలని ఎన్నారైలను సంజయ్ కోరారు.

ఎమ్మెల్యే మైనంపల్లిపై సాయిప్రసాద్ ఫిర్యాదు

అల్వాల్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తనపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని అల్వాల్‌కు చెందిన బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయిప్రసాద్ డీజీపీతో పాటు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశారు. తన ప్రమేయం లేని విషయాల్లోనూ పోలీసులను వాడుకొని అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అట్రాసిటీ కేసులతోపాటు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వివరించారు. సాయిప్రసాద్ ఫిర్యాదుకు స్పందించిన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ డీజీపీకి లేఖ రాశారు. ఫిర్యాదుపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సాయిప్రసాద్ పలు యూట్యూబ్ చానళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో మైనంపల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

నేటి నుంచి జీ-20 వ్యవసాయ సదస్సు

సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: ఈ ఏడాది జీ–20 సమావేశాల్లో భాగంగా సోమ వారం హైదరాబాద్‌లో 'వాతావరణ ప్రతికూలతలను తట్టుకోగల వ్యవసాయం'అనే అంశంపై చర్చలు జరగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ 'ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఎడ్యుకేషన్', వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖలు సెప్టెంబర్ 4, 6 తేదీల మధ్య జరగనున్న ఈ చర్చలకు కేంద్రమంత్రి శోభా కరంద్లాజే హాజరు కానున్నారు. హైదరాబాద్ విమానాశ్రయం సమీపంలోని నోవాటెల్ హోటల్‌లో 100 మంది దేశ, విదేశీ ప్రతినిధులు వ్యవసాయ పరిశోధనలు, ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోగల వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం అంశాలపై చర్చలు జరపనున్నారు. జీ–20 సమావేశాల్లో భాగంగా మంగళవారం ప్రతినిధులు భారత వ్యవసాయ పరిశోధన సమాఖ్యకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్‌ను సందర్శించనున్నారు. విదేశీ ప్రతినిధులకు దేశ సంస్కృతిని పరిచయం చేసే ఉద్దేశంతో వారిని హైదరాబాద్‌లోని శిల్పారామానికి తీసుకెళ్లనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ప్రతినిధులందరూ ఐసీఏఆర్ క్రిడాలోని పరిశోధన క్షేత్రంలో పంటలను, వాటి నిర్వహణ పద్ధతులను పరిశీలించనున్నారు.

రాష్ట్ర వైద్య మండలి ఎన్నికలు షురూ

17 ఏళ్ల తరువాత నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యానికి సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకునే అధికారం ఉన్న తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి (టీఎస్ఎంసీ) ఎన్నికలను 17 ఏళ్ల తర్వాత తొలిసారిగా నిర్వహించనున్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ వేదికగా ఆదివారం ఈ ఎన్నికల మేనిఫెస్టోను హెచ్‌ఆర్‌డీఏ విడుదల చేసింది. అర్హత లేకుండా వైద్యం చేస్తున్న వారిని ప్రత్యేక కమిటీలు వేసి అరకడతామని ఈ మేనిఫెస్టోలో పేర్కొన్నారు. నూతన భవనం నిర్మించి, తెలంగాణ వైద్యులకు గౌరవం లభించేలా చూస్తామని, వైద్య విద్య ఫీజు నియంత్రణ దిశగా ప్రయత్నాలు చేస్తామని ప్రకటించారు.

48,405మంది డాక్టర్లకు ఓట్లు

ప్రస్తుతం 48,405 మంది తెలంగాణ డాక్టర్లు ఈ ఎన్నికల్లో ఓటు వేసే అర్హత కలిగి ఉన్నారు. ఈ ఎన్నికల్లో 13 మంది వైద్యులు వైద్య మండలికి ఎన్నిక కానుండగా, ఇందుకోసం వందకు పైగా అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అభ్యర్థులంతా తమ విధివిధానాలతో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకుంటున్నారు. కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా నిలబడగా, మరికొందరు ప్యానల్‌గా ఏర్పడి పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికలు పోస్టల్ బాలెట్ ద్వారా జరగనున్నాయి. వచ్చే నెల నుంచి బ్యాలెట్ పేపర్ల పంపిణీ జరగనుండగా, వాటి లెక్కింపు డిసెంబర్ 1న మొదలుకానుంది. కాగా మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో డా.మహేష్‌కుమార్, డా. ప్రతిభాలక్ష్మీ, డా. కుసుమరాజు రవికుమార్, డా.కిరణ్‌కుమార్ తోటావర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తున్న హెచ్‌ఆర్‌డీఏ సభ్యులు

వచ్చే ఏడాది 43% మిగులు విద్యుత్!

- మిగులు విద్యుత్ కొనకున్నా రాష్ట్ర ప్రజలపై స్థిర చార్జీల భారం
- రాష్ట్ర డిస్కంల దశాబ్ది ప్రణాళికలపై విద్యుత్ నిపుణుల అభ్యంతరాలు
- అడ్డగోలు ఒప్పందాలకు సమ్మతి తెలపవద్దని ఈఆర్సీకి సూచన
- డిస్కంల ప్రతిపాదనలపై 22న ఈఆర్సీ బహిరంగ విచారణ




సాక్షి, హైదరాబాద్: అవసరానికి మించి విద్యుత్ కొనుగోళ్ల కోసం రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు భారీ ఎత్తున చేసుకున్న దీర్ఘకాలిక ఒప్పందాలు... వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర ప్రజలకు గుదిబండగా మారబోతున్నాయని విద్యుత్‌రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో భారీ ఎత్తున మిగులు విద్యుత్ ఉండనుందని, దీంతో అవసరం లేని విద్యుత్‌కు పెద్ద మొత్తంలో స్థిర చార్జీలు (ఫిక్స్‌డ్ చార్జీలు) చెల్లించక తప్పదని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ముందు అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యుదుత్పత్తి కేంద్రాలను బ్యాకింగ్ డౌన్ చేసి ఉత్పత్తిని తగ్గించుకోవడం, పూర్తిగా నిలుపుదల చేయడం తప్పదని స్పష్టం చేశారు. 2024–25లో ఏకంగా 43.24 శాతం, 2025–26లో 41.97 శాతం, 2026–27లో 34.13 శాతం, 2027–28లో 26.29 శాతం, 2028–29లో 15.22 శాతం మిగులు విద్యుత్ ఉండనుందని సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎం.వేణుగోపాల్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. 2024–29, 2029–34 మధ్య కాలంలో రాష్ట్రంలో ఉండనున్న విద్యుత్ డిమాండ్ అంచనాలు, విద్యుత్ విక్రయాల అంచనాలు, ఆ మేరకు సరఫరా చేసేందుకు విద్యుత్ కొనుగోళ్ల ప్రణాళికలు, పెట్టుబడి ప్రణాళికలతో కూడిన తమ వనరులు, వ్యాపార ప్రణాళికలను ఇటీవల రాష్ట్ర డిస్కంలు ఈఆర్సీకి సమర్పించాయి. దీనిపై ఈఆర్సీ అన్ని వర్గాల నుంచి అభ్యంతరాలను ఆహ్వానించగా ఎం.వేణుగోపాల్‌రావు రాతపూర్వకంగా అభ్యంతరం తెలియజేశారు. కొత్త ఎత్తిపోతల పథకాల విద్యుత్ అవసరాలు ఏటేటా క్రమంగా పెరగనున్నందున మిగులు విద్యుత్ సమస్యే ఉండదంటూ డిస్కంలు సమర్థించుకోవడాన్ని కొట్టిపడేశారు. ఎత్తిపోతల పథకాలకు ఎంత విద్యుత్ అవసరమో డిస్కంలు ప్రతిపాదించలేదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు జరగకుండా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు అనుమతులు జారీ చేసే ముందు ఈఆర్సీ సమగ్ర పరిశీలన జరపాలని సూచించారు.

ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ధర ఎంత?

వ్యవసాయం మినహా అన్ని కేటగిరీల కనెక్షన్లకు 2025 నుంచి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించాలని కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలులో భాగంగా రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్డీఎస్ఎస్)లో చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్టు డిస్కంలు ఈఆర్సీకి తమ వనరుల ప్రణాళికలో వెల్లడించాయి. 2024–29 మధ్య కాలంలో ఎల్టీ మీటర్లకు ప్రీపెయిడ్ మీటర్లకు రూ. 348 కోట్లు, హెచ్‌టీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లకు రూ. 305 కోట్లు అవసరమని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) నివేదించింది. ఎల్టీ మీటర్లకు రూ.116 కోట్లు, హెచ్‌టీ మీటర్లకు రూ.10.94 కోట్లు అవసరమని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎన్పీడీసీఎల్) ప్రతిపాదించింది. ఈ మీటర్ల ధర ఎంత? ఏ విధంగా ఈ ధరలను ఖరారు చేశారో తెలపాలని వేణుగోపాల్‌రావు డిస్కంలను ప్రశ్నించారు. కాగా, ఈఆర్సీ గత శుక్రవారం నిర్వహించిన బహిరంగ విచారణకు సరైన సమాచారంతో డిస్కంలు రాకపోవడంతో పలువురు నిపుణులు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నెల 22న విచారణ నిర్వహించాలని ఈఆర్సీ నిర్ణయించింది. ఆలోగా పూర్తి వివరణలను సమర్పించాలని డిస్కంలను ఆదేశించింది.

పీవీ సత్యనారాయణకు స్వామినాథన్ అవార్డు ప్రదానం

ఏజీ వర్సిటీ: ఎంఎస్ స్వామినాథన్ అవార్డు 2021–2012 ఏడాదికి రాగోలులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ పీవీ సత్యనారాయణకు అందించారు. రిటైర్డ్ ఐసీఏఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్, నూజివీడ్ సీడ్స్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ ద్వైవార్షిక జాతీయ అవార్డు కింద రూ.2 లక్షల నగదుతోపాటు బంగారు పతకం అందజేశారు. హైబ్రిడ్ వరి వంగడాలను అభివృద్ధి చేయడంలో కృషికి గాను సత్యనారాయణను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్–ఐఐఆర్ఆర్‌లోని రిటైర్డ్ ఐసీఏఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకలతో పాటు ఈ అవార్డును కూడా అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డు ఇప్పటివరకు 8 మందికి ప్రకటిస్తే అందులో నలుగురు తెలుగురాష్ట్రాల వారే కావడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ డీజీ డీఏఆర్ఈ కార్యదర్శి హిమాన్షు పాఠక్, డీఏఆర్ఈ కార్యదర్శి ఆర్ఎస్ పరోడా, ఐసీఏఆర్ మాజీ డీడీజీ ఈఏ సిద్దిఖ్, నూజివీడ్స్ సీఎండీ ఎం.ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎంఎస్ స్వామినాథన్ అవార్డును అందుకుంటున్న సత్యనారాయణ

క్లుప్తంగా...

ఇండియా కూటమిని తట్టుకోలేకే బీజేపీ ముందస్తు వ్యూహం

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



సాక్షి, హైదరాబాద్‌: దేశంలో ఇండియా కూటమికి వస్తున్న ప్రజాదరణను ఎదుర్కొనే పరిస్థితి లేనందువల్లే బీజేపీ ముందస్తు ఎన్నికలకు సన్నద్ధమవుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. ఇండియా కూటమి ముంబైలో భేటీ అయిన ప్రభావంతోనే మోదీ సర్కార్‌ ప్రత్యేక పార్లమెంట్‌ సమావేశాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటి నర్సింహతో కలిసి హైదరాబాద్‌ మఖ్దూమ్‌భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడో ఫ్రంట్‌ పేరుతో బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు జాతీయ స్థాయిలో మరోసారి బీజేపీని గెలిపించేందుకు కుట్ర చేస్తున్నాయని ధ్వజమెత్తారు. లిక్కర్‌ కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేస్తారనే భయంతోనే బీజేపీకి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు లొంగిపోయారన్నారు. జమిలి ఎన్నికలకు నిర్వహణకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌ కోవింద్‌ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీని బోగస్‌ కమిటీగా కొట్టిపారేశారు. ఈ కమిటీలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఏది చెబితే కమిటీ సభ్యులు అదే చేస్తారని అలాంటి కమిటీకి అన్ని రాజకీయ పార్టీలూ సహాయ నిరాకరణ చేయాలని పిలుపునిచ్చారు. ఎంఐఎంపై సీబీఐ దాడులు నిర్వహిస్తే కోట్లాది రూపాయలు వెలుగులోకి వస్తాయన్నారు.

జమిలి ఎన్నికలు పాత విధానమే: చాడ



హుస్నాబాద్‌: జమిలి ఎన్నికల విధానం దేశంలో పాత విధానమేనని, దీనిపై ప్రధాని మోదీ కమిటీని వేస్తూ కొత్త విధానాన్ని తీసుకువస్తున్నామని చెప్పడం సరి కాదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలో 5 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయని, మరో 5 రాష్ట్రాలు అసెంబ్లీని రద్దు చేస్తే తప్ప దేశ వ్యాప్తంగా ఒకే సారి ఎన్నికలు జరగడం అసాధ్యమని చెప్పారు. ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే ఎన్నిక విధానాన్ని తీసుకువచ్చిన మోదీ పెట్రోల్, డీజిల్, గ్యాస్‌పై జీఎస్టీ ఎందుకు అమలు చేయడం లేదని చాడ ప్రశ్నించారు. మరోవైపు పొత్తుల విషయంలో కాంగ్రెస్‌ అధిష్టానం ఆహ్వానించి మాట్లాడిందన్నారు. కొత్తగూడెం, మునుగోడు, హుస్నాబాద్, వైరా, బెల్లంపల్లి సీట్లు కావాలని ప్రతిపాదించామని తెలిపారు. వీటిపై కాంగ్రెస్‌ ఒప్పందానికి వస్తే మంచిదని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా బలంగా ఉన్న 33 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెడతామని చెప్పారు.

సొమ్మొకడిది.. సోకొకడిది

జనవరి 17 వరకు నేనే ఎమ్మెల్యేగా ఉంటా: రాజయ్య



జఫర్‌గఢ్‌: ''నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధి పనులను తానే చేశానంటూ చెప్పుకోవడం విడ్డూరం..సొమ్మొకడిది..సోకొకడిది అన్నట్టుగా''ఉందని స్టేషన్‌ఘన్‌పూర్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ తాటికొండ రాజయ్య అన్నారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్‌ శివారు అల్యాబాద్‌లో సీడీఎఫ్‌ ద్వారా మంజూరైన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్‌ మున్సిపాలిటీ ఏర్పాటుకు ఎవరు అడ్డు పడ్డారో వారే ఇప్పుడు తెస్తానని మాట్లాడడం బాధాకరమని పేర్కొన్నారు. ఏది ఏమైనా నేనే జనవరి 17 వరకు ఎమ్మెల్యేగా ఉంటాను..అప్పటి వరకు ప్రొటోకాల్‌ ఉంటుంది.. ప్రభుత్వానికి సంబంధించిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాల్సి ఉందని చెప్పారు. ఎన్నికలు కూడా వాయిదా పడే అవకాశం ఉందని, అప్పటి వరకు మార్పులుచేర్పులూ ఉండొచ్చని పార్టీ అధినాయకులే చెబుతున్నారన్నారు.



తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌ఎస్‌ఆర్‌ పుష్ప కన్వెన్షన్‌ హాల్‌లో ఆదివారం బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల శ్రవణ్‌కుమార్‌ రెడ్డి కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం కేసీఆర్‌ - శామీర్‌పేట్‌



హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌ రావు

బడా, లోకల్‌ మిల్లింగ్‌ కంపెనీలు కొనేలా!

- ధాన్యం విక్రయ టెండర్‌ నిబంధనల్లో మార్పు
- లక్ష మెట్రిక్‌ టన్నుల లాట్ల కింద 25 ఎల్‌ఎంటీ విక్రయం
- కంపెనీ టర్నోవర్, ఈఎండీ విలువను తగ్గిస్తూ నిర్ణయం
- వేలం ప్రక్రియ ఈనెల 11 నుంచి 16వ తేదీకి వాయిదా



సాక్షి, హైదరాబాద్‌: గ్లోబల్‌ టెండర్ల ద్వారా రాష్ట్రంలోని రైస్‌ మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వేలం వేయాలని నిర్ణయించిన పౌరసరఫరాల శాఖ బిడ్డింగ్‌ నిబంధనల్లో పలు మార్పులు చేసింది. ఈ–వేలంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి బడా కంపెనీలతో పాటు రాష్ట్రంలోని మిల్లింగ్‌ కంపెనీలు పాల్గొనేలా సరళమైన విధానాలను టెండర్‌ నిబంధనల్లో చేర్చారు.

25 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం వేలానికి టెండర్‌

రాష్ట్రంలోని 2వేలకు పైగా రైస్‌మిల్లుల్లో నిల్వ ఉన్న సుమారు 70 ఎల్‌ఎంటీ ధాన్యం నుంచి తొలి విడతగా 25 లక్షల టన్నుల ధాన్యాన్ని వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి గత నెల 19వ తేదీన విధి విధానాలను ఖరారు చేసింది. ఈ మేరకు అంతర్జాతీయ స్థాయిలో టెండర్లను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్‌ కూడా జారీ చేసింది. ఆసక్తి గల సంస్థలు, వ్యాపారులు దరఖాస్తులు చేసుకోవడంతో ప్రి బిడ్డింగ్‌ సమావేశాలను సంస్థ నిర్వహించింది. ఈ సమావేశాల్లో ప్రభుత్వం విధించిన నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నిబంధనల ద్వారా స్థానిక వ్యాపారులు, మిల్లర్లకు అవకాశం దక్కదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే విడతలో 4లక్షల లేదా 5 లక్షల మెట్రిక్‌ టన్నుల లాట్‌లలో ధాన్యం వేలం వేయడం వల్ల బడా కంపెనీలే తప్ప రాష్ట్రంలోని మిల్లర్లు గాని, మిల్లర్ల సిండికేట్‌ గానీ కొనుగోలు చేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. దీంతో స్పందించిన ప్రభుత్వం నిబంధనల్లో పలు మార్పులు చేయాలని నిర్ణయించింది.

ప్రతీ లాట్‌ను ఒక లక్ష టన్నులుగా

మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యాన్ని తొలి విడత 25 లక్షల మెట్రిక్‌ టన్నుల మేరకు వేలం వేయాలని తొలుత నిర్ణయించగా... దాన్ని పూర్తిగా కేవలం 6 లాట్స్‌లో వేలం వేయాలని టెండర్‌ నోటిఫికేషన్‌లో పొందుపరిచారు.. ఇందులో ఐదు లాట్స్‌లో 4లక్షల టన్నుల చొప్పున ఉండగా ఒక లాట్‌లో ఐదు లక్షల టన్నుల ధాన్యం ఉంది. ప్రి బిడ్‌ మీటింగ్‌ అనంతరం ఇందులో మార్పులు చేశారు. ప్రతీ లాట్‌ను ఒక లక్ష టన్నులుగా నిర్ణయించారు. అంటే 25 లాట్స్‌లో ధాన్యం వేలం వేయనున్నారు. లక్ష టన్నుల కెపాసిటీ ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రతి కంపెనీ ఈ వేలంలో పాల్గొనేలా నిబంధనలు మార్చారు.

వార్షిక టర్నోవర్‌లోనూ భారీ మార్పులు

తొలుత ప్రకటించిన టెండర్‌ నిబంధనల ప్రకారం టెండర్లలో పాల్గొనే కంపెనీకి గడిచిన మూడేళ్లలో ప్రతిఏటా రూ.వెయ్యి కోట్ల వార్షిక టర్నోవర్‌తో పాటు రూ.100 కోట్ల నెట్‌వర్త్‌ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అయితే రూ. 1000 కోట్ల టర్నోవర్‌ ఉన్న బియ్యం కొనుగోలు కంపెనీలు దేశంలో అతి తక్కువగా ఉంటాయన్న వాదనల మేరకు ప్రి బిడ్డింగ్‌ సమావేశంలో ఈ నిబంధనలు కూడా మార్చారు. రూ. 1,000 కోట్ల టర్నోవర్‌ను రూ.100 కోట్లకు, నెట్‌వర్త్‌ విలువను రూ.100 కోట్ల నుంచి రూ. 20 కోట్లకు తగ్గించారు. ఇక వేలం తర్వాత ధాన్యం తీసుకెళ్లాల్సిన గడువును 30 రోజుల నుంచి 45 రోజులకు పెంచారు. నిబంధనల్లో మార్పులు చేయడంతో దరఖాస్తు, వేలం తేదీల్లోనూ మార్పులు చేశారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. దీంతో ఈ నెల 11న జరగాల్సిన వేలం ప్రక్రియను 16వ తేదీకి వాయిదా వేశారు. నిబంధనల్లో మార్పుతో స్థానిక వ్యాపారులు, మిల్లర్లు టెండర్లలో పాల్గొనేందుకు అవకాశం లభించనుంది. నిబంధనల సడలింపుతో ఎక్కువ మంది బిడ్డింగ్‌లో పాల్గొనే అవకాశం ఏర్పడింది.

జమిలి ఎన్నికలపై బీఆర్‌ఎస్‌ విధానమేంటి?

- వన్‌ నేషన్‌–వన్‌ ఎలక్షన్‌పై కేసీఆర్‌ వైఖరేంటి?
- పీసీసీ చీఫ్‌ రేవంత్‌ డిమాండ్‌

సాక్షి, హైదరాబాద్‌: జమిలి ఎన్నికల నిర్వహణపై తన విధానమేంటో బీఆర్‌ఎస్‌ స్పష్టం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. అప్పట్లో బీజేపీతో ఉన్న సంబంధాల దృష్ట్యా జమిలి ఎన్నికలకు తాము అనుకూలమని 2018లో సీఎం కేసీఆర్‌ కేంద్రానికి లేఖ రాశారని, ఇప్పుడు బీజేపీతో తమకు ఎలాంటి సంబంధం లేదంటున్న కేసీఆర్‌ తాజాగా తన పార్టీ వైఖరి ఏంటో వెల్లడించాలని కోరారు. ఆదివారం గాంధీభవన్‌లో రేవంత్‌ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, ఎన్డీఏ కూటమికి అవమానకర పరిస్థితి వస్తుందనే వన్‌ నేషన్‌–వన్‌ ఎలక్షన్‌ తెరమీదకు తెచ్చారని విమర్శించారు. ఈ విధానానికి ఇండియా కూటమి వ్యతిరేకమని, అందుకే కమిటీ నుంచి అధీర్‌ రంజన్‌ చౌదరి వైదొలిగారని చెప్పారు.

ఆ కమిటీ చైర్మన్‌గా మాజీ రాష్ట్రపతినా?

జమిలి ఎన్నికల బిల్లు పాస్‌ కావాలంటే పార్లమెంటులో 2/3 వంతుల మెజారిటీ కావాలని, ఈ విధానంతో రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి భంగం కలుగుతుందని రేవంత్‌ పేర్కొన్నారు. ఒక పార్టీ చేతిలో అధికారం పెట్టుకునేందుకే బీజేపీ ఈ కుట్రకు పాల్పడుతోందని, ఈ కుట్ర వెనుక అధ్యక్ష తరహా విధానాన్ని తీసుకు రావాలన్న ఆలోచన బీజేపీకి ఉందని ఆరోపించారు. అధ్యక్ష తరహా ఎన్నికలు జరిగితే దక్షిణ భారతదేశ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని, ఇంత జరుగుతున్నా కేసీఆర్‌ మౌనంగా ఉన్నారంటే ఆయన బీజేపీకి అనుకూలమని అనుకోవాలా అని ప్రశ్నించారు. దేశంలో అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి హోదాలో పనిచేసిన వ్యక్తిని జమిలి ఎన్నికల కమిటీకి చైర్మన్‌గా నియమించి ఆ పదవికే కళంకం తెచ్చారని విమర్శించారు.

బోయలకు కేసీఆర్‌ మోసం.. మేం న్యాయం చేస్తాం: రేవంత్‌

బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తానని చెప్పి సీఎం కేసీఆర్‌ మాట తప్పారని, అధికారంలోకి వచ్చి పదేళ్లవుతున్నా ఇచ్చిన మాటను ఆయన నిలబెట్టుకోలేకపోయారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వాల్మీకి బోయలు ఆదివారం గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలిశారు. తమను ఎస్టీల్లో చేర్చాలని, ఈ అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ వారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రేవంత్‌ మాట్లాడుతూ 2014లోనే బోయ వర్గానికి చెందిన భీముడిని ఎమ్మెల్సీ చేస్తానని చెప్పిన కేసీఆర్‌ ఆ మాట కూడా నిలబెట్టుకోలేదన్నారు. గద్వాల బంగళా రాజకీయాలకు స్వస్తి పలికేలా బోయలు కదలాలని, అవకాశం ఉంటే బోయలకు ఎమ్మెల్యే లేదంటే ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని హామీనిచ్చారు.

ఖానాపూర్, కొడంగల్‌ నుంచి చేరికలు

నియోజకవర్గం బొమ్రాస్‌పేట మండలానికి చెందిన పలువురు నేతలు, ఖానాపూర్‌ నియోజకవర్గం జన్నారం, కడెం, ఉట్నూరు, ఇంద్రవెల్లికి చెందిన పలువురు ఆదివారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. వీరికి గాంధీభవన్‌లో కండువాలు కప్పి రేవంత్‌ పార్టీలోకి ఆహ్వానించారు.



యూపీ స్పీకర్‌ సతీశ్‌ మహానాకు జ్ఞాపికను అందిస్తున్న స్పీకర్‌ పోచారం, శాసనమండలి చైర్మన్‌ గుత్తా

శాసనసభను సందర్శించిన యూపీ స్పీకర్‌

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ శాసనసభను ఉత్తరప్రదేశ్‌ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌ సతీశ్‌ మహానా ఆదివారం సందర్శించారు. అంతకుముందు ఆయనకు అసెంబ్లీ స్పీకర్‌ పోచారం శ్రీనివాసరెడ్డి, శాసనమండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. తెలంగాణ శాసనసభ నిర్వహణ, పనితీరు, ప్రజాసమస్యలపై అర్థవంతమైన చర్చల కోసం జరుగుతున్న కృషి గురించి సతీశ్‌ మహానాకు పోచారం వివరించారు. శాసనసభ సమావేశాల నిర్వహణ, పద్ధతులపై ఇరువురు స్పీకర్లు చర్చించారు. ఈ సందర్భంగా సతీష్‌ మహానాను పోచారం, గుత్తా శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. ఈ భేటీలో శాసనసభ కార్యదర్శి డాక్టర్‌ వి. నరసింహాచార్యులు కూడా పాల్గొన్నారు.

సింగరేణిలో గులాబీజెండా ఎగరాలి: కవిత



సాక్షి, హైదరాబాద్‌: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి పరిధిలో గులాబీ జెండా మాత్రమే ఎగరాలని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఆ ప్రాంతంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థులను గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సింగరేణి సంస్థకు చెందిన పాఠశాలల్లోని కాంట్రాక్టు టీచింగ్, నాన్‌ టీచింగ్‌ సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం ఆదివారం హైదరాబాద్‌లో కవితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కేంద్రం ప్రయత్నిస్తే ఆ ప్రమాదాన్ని కేసీఆర్‌ తప్పించారని చెప్పారు. ఆర్టీసీ సంస్థను కూడా ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల అంశం తీవ్రమైన సమస్యగా ఉండేదని, అప్పట్లో కేవలం 4,000 ఉద్యోగాలు మాత్రమే ఇస్తే, తెలంగాణ ఏర్పడిన తర్వాత 20 వేల ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. సింగరేణిలోని పాఠశాలల టీచింగ్, నాన్‌ టీచింగ్‌ ఉద్యోగుల సమస్యలను కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్‌ జనరల్‌ సెక్రెటరీ మిరియాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యెన్నం సస్పెన్షన్‌

సాక్షి, హైదరాబాద్‌: బీజేపీ మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. బీజేపీ వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడుతున్నందున సస్పెండ్‌ చేయాలని పార్టీ నిర్ణయించిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేటు తక్షణం అమల్లోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లోకి రండి

తుమ్మలకు భట్టి ఆహ్వానం



తుమ్మలను కలిసిన భట్టి

దమ్మపేట: కాంగ్రెస్‌ పార్టీలో చేరాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సాదరంగా ఆహ్వానించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండు గులపల్లిలోని తుమ్మల నివాసానికి ఆదివారం భట్టి విక్రమార్క వచ్చారు. కాసేపు తుమ్మల, భట్టి ఆంతరంగికంగా చర్చించుకున్నారు. అనంతరం భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడుతూ ప్రజాక్షేత్రంతో ఉంటూ విలువలతో కూడిన రాజకీయాలు చేసే నాయకులు చాలా అరుదని, అలాంటివారిలో తుమ్మల నాగేశ్వర్‌రావు ఒకరని అన్నారు. అందుకే ఆయనను ప్రత్యక్షంగా కలిసి పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చానని చెప్పారు. నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం పనిచేసే భట్టి, తాను ఒకే రకమైన మనస్తత్వం గలవారమని అన్నారు. 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో వెన్నంటి ఉన్న అనుచరులు, మిత్రులు, సహచరుల అభిప్రాయం మేరకు తుది నిర్ణయం వెల్లడిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు మట్టా దయానంద్, టీపీసీసీ సభ్యురాలు సున్నం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఓడినా కేసీఆర్‌ మంత్రి పదవి ఇచ్చారు

తుమ్మలను ఉద్దేశించి మంత్రి పువ్వాడ వ్యాఖ్య



ఖమ్మం మయూరిసెంటర్‌: ఖమ్మం నుంచి పోటీ చేసి తనపై ఓడిపోయిన వ్యక్తికి సీఎం కేసీఆర్‌ ఎమ్మెల్సీ, మంత్రి పదవి ఇచ్చారని, ఆ తర్వాత ఉప ఎన్నికల్లోనూ కష్టపడి గెలిపించారని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఉద్దేశించి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ వ్యాఖ్యానించారు. ఆ తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లో తాను తప్ప ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి బీఆర్‌ఎస్‌ అభ్యర్థులు ఎవరూ గెలవలేదని గుర్తు చేశారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. ఒకసారి ఖమ్మం, మరోసారి పాలేరు వైపు పోదామనే ఆలోచన తనది కాదని, తాను ఖమ్మం నుంచే పోటీ చేస్తానని, మరోసారి ఆశీర్వదించాలని కోరారు. తనతో పాటు ఖమ్మం ఎంపీగా, లోక్‌సభా పక్ష నాయకులుగా నామా నాగేశ్వరరావుకు, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కొండబాల కోటేశ్వరరావుకు, ఖమ్మం మేయర్‌గా పునుకొల్లు నీరజకు.. ఇలా ఒకే సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. తమకు ఎవరు మేలు చేశారో ఈ సామాజికవర్గం వారు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.

▶ మొదటి పేజీ తరువాయి

26 సింగిల్‌ టేక్‌

కూడా పాల్గొననున్నారు. ఈ భేటీలోనే స్క్రీనింగ్‌ కమిటీ 45 నుంచి 50 స్థానాల వరకు ఏకాభిప్రాయం తెస్తుందని, మిగిలిన చోట్ల 2 లేదా 3 పేర్లు సూచించి పూర్తి జాబితాను ఢిల్లీకి పంపుతుందని గాంధీభవన్‌ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) అన్ని స్థానాల్లో ఒక్కో పేరు ఖరారు చేసి సీడబ్ల్యూసీ ఆమోదంతో అధికారికంగా అభ్యర్థులను ప్రకటిస్తుందని వివరించాయి.

ఏకాభిప్రాయం వచ్చిన నియోజకవర్గాల వివరాలివీ..

కొడంగల్‌–రేవంత్‌రెడ్డి, మధిర–భట్టి విక్రమార్క, హుజూర్‌నగర్‌– ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నల్లగొండ–కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జగిత్యాల–టి.జీవన్‌రెడ్డి, మంథని–డి. శ్రీధర్‌బాబు, సంగారెడ్డి–టి.జగ్గారెడ్డి, ములుగు–డి. సీతక్క, భద్రాచలం–పొదెం వీరయ్య, ఆంథోల్‌– దామోదర రాజనర్సింహ, మంచిర్యాల–ప్రేంసాగర్‌ రావు, పరిగి–టి.రామ్మోహన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం–మల్‌రెడ్డి రంగారెడ్డి, కోదాడ–పద్మావతిరెడ్డి, వికారాబాద్‌– గడ్డం ప్రసాద్‌కుమార్, జహీరాబాద్‌– ఎ.చంద్రశేఖర్, బోధన్‌–సుదర్శన్‌రెడ్డి, నాంపల్లి–ఫిరోజ్‌ఖాన్, భూపాలపల్లి–గండ్ర సత్యనారాయణ, వరంగల్‌ (ఈస్ట్‌) –కొండా సురేఖ, నర్సంపేట – దొంతి మాధవరెడ్డి, ఆలంపూర్‌–సంపత్‌కుమార్, వేములవాడ–ఆది శ్రీనివాస్, హుజూరాబాద్‌– బల్మూరి వెంకట్, నిర్మల్‌ – కూచాడి శ్రీహరిరావు, చొప్పదండి – మేడిపల్లి సత్యం. ఇలావుండగా నాగార్జునసాగర్‌ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు మాజీ మంత్రి కె.జానారెడ్డి ఇద్దరు కుమారులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే వీరిలో ఒకరు లేదా జానారెడ్డి బరిలో దిగేందుకు పీఈసీ అనుమతించిందని సమాచారం. జానారెడ్డి తనయుల్లో ఒకరు పోటీలో ఉండాలనుకుంటే జైవీర్‌కు అవకాశం ఇవ్వొచ్చని తెలుస్తోంది.



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో జానారెడ్డి, పొన్నాల, వీహెచ్, మహేశ్‌కుమార్‌ గౌడ్, అజారుద్దీన్, ఉత్తమ్‌ తదితరులు

వనపర్తి లొల్లి

వనపర్తి నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి చిన్నారెడ్డికి టికెట్‌ ఇవ్వద్దంటూ ఆ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్‌ నేతలు, కార్యకర్తలు ఆదివారం గాంధీభవన్‌కు వచ్చారు. గాంధీభవన్‌ మెట్లపై నినాదాలు చేస్తూ పీఈసీ సమావేశానికి వచ్చిన సభ్యులను కలిసి చిన్నారెడ్డికి టికెట్‌ ఇవ్వద్దని కోరారు.

మా ఆప్షన్లు ఇచ్చాం: జగ్గారెడ్డి

సమావేశం అనంతరం సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ పీఈసీ భేటీలో అభ్యర్థుల ఎంపిక గురించిన దరఖాస్తులను పరిశీలించామని, ఆప్షన్స్‌ ఇచ్చామని చెప్పారు. సభ్యులందరూ మొత్తం 119 నియోజకవర్గాలకు సంబంధించిన తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా అందజేశారని, అయితే ఎవరు ఏ అభిప్రాయం ఇచ్చారన్నది బయటకు చెప్పలేమని, ఇది రహస్య సమావేశమని చెప్పారు.

బీసీలకు కేసీఆర్‌ కంటే ఎక్కువే ఇస్తాం: రేవంత్‌

పీఈసీ సమావేశానికి ముందు రేవంత్‌రెడ్డి విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బలమైన బీసీ నేతలందరికీ ఈసారి టికెట్లు ఇస్తామని చెప్పారు. సామాజిక న్యాయం విషయంలో కాంగ్రెస్‌ పార్టీతో ఎవరూ పోటీ పడలేరని, కేసీఆర్‌ కంటే ఎక్కువ సంఖ్యలోనే బీసీలకు కాంగ్రెస్‌ టికెట్లు ఇస్తుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు దిమ్మతిరిగే ఎత్తుగడ తమ దగ్గర ఉందని రేవంత్‌ వ్యాఖ్యానించారు.

తనకు మద్దతివ్వాలన్న పొన్నాల

పీఈసీ సమావేశం ప్రారంభం కాగానే పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని, సభ్యులందరూ మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు. జగ్గారెడ్డి మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన వ్యక్తి ఇలా అడిగే పరిస్థితి రావడం పార్టీకి మంచిది కాదని, ఆయనకు టికెట్‌ ఇవ్వాలని కోరారు. దీంతో రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని ఇదే అంశాన్ని లిఖితపూర్వకంగా ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది.





ఎవరి మనోభావాలూ గాయపరచకపోతే తత్వవేత్త ఉపయోగం ఏమిటి?
– డైయొజినీజ్

సాక్షి
సోమవారం, 4 సెప్టెంబర్ 2023

అభిమాన సంపన్నులు

విద్యావంతులైన వాళ్లు ఎవరైనా జీవితాంతం తమ గురువులను స్మరించుకుంటారు. మన దేశంలో గురుశిష్య పరంపర వేదకాలం నుంచి ఉంది. పాశ్చాత్య నాగరికతల్లో కూడా క్రీస్తుపూర్వం నుంచే గురుశిష్య పరంపర కొనసాగేది. విద్య నేర్పించే గురువులే లేకుంటే, ఈ ప్రపంచం ఇంకా అజ్ఞానాంధకార యుగంలోనే మిగిలి ఉండేదేమో! గురువులు లేని లోకాన్ని ఊహించుకోలేం. గురువులు ఊరకే పాఠాలను వల్లెవేయించడమే కాదు, భావితరాలను జ్ఞానసంపన్నులుగా తీర్చిదిద్దుతారు. పరోక్షంగా సమాజాన్ని మెరుగుపరుస్తారు. బడిలో చేరిన పిల్లల మీద తల్లిదండ్రుల కంటే గురువుల ప్రభావమే ఎక్కువగా ఉంటుంది. పిల్లల్లో గురువుల మీద అమితమైన గురి ఉంటుంది. 'ఎలా ఆలోచించాలో తెలిసిన వాళ్లకు అధ్యాపకుల అవసరం లేదు' అని మహాత్మాగాంధీ అన్నారు. అయితే, అమాయకపు బాల్యావస్థలో ఆలోచనను పదునెక్కించే గురువులు అత్యవసరం.

జీవితాన్ని ప్రభావితం చేసే మానవ సంబంధాల్లో గురుశిష్య సంబంధం ప్రత్యేకమైనది. లోకంలో ఎందరో ఉత్తమ గురువులు, వారు తీర్చిదిద్దిన ఉత్తమ శిష్యులు ఉన్నారు. వారందరూ గతించిపోయినా, వారి చరిత్రను జనాలు చర్వితచర్వణంగా ఇప్పటికీ చెప్పుకుంటూనే ఉంటారు. మన పురాణాల్లోనూ గురుశిష్యుల కథలు కొల్లలుగా కనిపిస్తాయి. పురాణాల్లో దేవతలకు బృహస్పతి, రాక్షసులకు శుక్రాచార్యుడు గురువులుగా వాసికెక్కారు. అవతార పురుషులైన రామలక్ష్మణులకు విశ్వామిత్రుడు, బలరామకృష్ణులకు సాందీపని మహర్షి గురువులుగా ఉండేవారు. పురాణ గురువుల్లో మిగిలినవారిదంతా ఒక ఎత్తు అయితే, ప్రహ్లాదుడికి పాఠాలు చెప్పిన చండామార్కుల వారిది మరో ఎత్తు. దండోపాయాన్ని సాధనంగా ఎంచుకున్న తొలిగురువు బహుశా ఆయనే! చండామార్క వారసులైన గురువులు అక్కడక్కడా తారసపడుతుంటారు.

మనుషుల్లో ఉండే వైవిధ్య వైరుధ్యాలు గురుశిష్యుల్లోనూ కనిపిస్తాయి. గురువులందరూ ఉత్తములేనని, శిష్యులందరూ ఆణిముత్యాలేనని చెప్పలేం. గురువుల్లో ఔదార్యమూ, ఉదాత్తతలతో పాటే స్వార్థ సంకుచిత లక్షణాలూ కనిపిస్తాయి. గురువులు కూడా మానవ మాత్రులే! ఏకలవ్యుడి బొటన వేలును గురుదక్షిణగా కోరిన ద్రోణుడు మనకు తెలుసు. గురువుకే పంగనామాలు పెట్టిన ఆషాఢభూతి కూడా మనకు తెలుసు. గురజాడవారి 'కన్యాశుల్కం'లోని గిరీశం ఆషాఢభూతికి ఏమీ తీసిపోయే రకం కాదు. కాకుంటే, అతగాడు గురుత్వం వెలగబెట్టాడు. గిరీశం శిష్యరికంలో వెంకటేశానికి చుట్ట కాల్చడం పట్టుబడిందే గాని, చదువు ఒంటబట్టలేదు.

అయితే, మన దేశంలో వివిధ రంగాల్లో రాణించిన గురువులు, గురువులకు గర్వకారణంగా నిలిచిన శిష్యులు ఎందరో ఉన్నారు. సాహితీరంగంలో తమదైన ముద్రవేసిన గురుశిష్యులు కొందరు ఇప్పటికీ ప్రస్తావనల్లోకి వస్తుంటారు. అటువంటి గురుశిష్యుల్లో మొదటగా చెప్పుకోవలసిన వారు – తిరుపతి వేంకట కవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, ఆయన శిష్యుడు విశ్వనాథ సత్యనారాయణ. వారిద్దరూ అరుదైన గురుశిష్యులు. పాండితీ ప్రాభవంలోను, కవన శైలిలోనూ ఇద్దరూ ఇద్దరే! చెళ్లపిళ్లవారి గురించి విశ్వనాథ ఒక చమత్కార పద్యం చెప్పారు. అది: 'అల నన్నయకు లేదు తిక్కనకు లేదా భోగ మస్మాదృశుం డలఘుస్వాదు... బ్రాహ్మీమయమూర్తి శిష్యుడైనా డన్నట్టి దావ్యోమపే శలచాంద్రీ మృదుకీర్తి చెళ్లపిళవంశస్వామి కున్నట్లుగన్'. నన్నయకు, తిక్కనకు తన వంటి శిష్యులెవరూ లేరని, తన గురువైన చెళ్లపిళ్ల వారికే ఆ వైభోగం, కీర్తి దక్కాయని సగర్వంగా చెప్పుకున్నారు విశ్వనాథ. అధ్యాపక వృత్తిలో కొనసాగిన విశ్వనాథకు ఎందరో ప్రత్యక్ష శిష్యులే కాకుండా, మరెందరో పరోక్ష శిష్యులూ ఉన్నారు.

విశ్వనాథను శ్రీశ్రీ 'కవికుల గురువు'గా ప్రస్తుతించడమే కాదు, 'తెలుగువాళ్ల గోల్డు నిబ్బు'గా అభివర్ణించారు. ఒకానొక సందర్భంలో 'నా వంటి కవి మరో వెయ్యేళ్ల వరకు పుట్టడు' అని విశ్వనాథ అన్నారు. దీనికి ప్రతిస్పందనగా శ్రీశ్రీ 'నిజమే! వారు పుట్టి వెయ్యేళ్లయింది' అని వ్యాఖ్యానించడం ఒక వైచిత్రి. తొలినాళ్లలో శ్రీశ్రీపై విశ్వనాథ ప్రభావం ఉండేది. తర్వాతికాలంలో అబ్బూరి రామకృష్ణారావు శ్రీశ్రీపై ఎనలేని ప్రభావం చూపారు. అబ్బూరి వద్ద శ్రీశ్రీ నేరుగా తరగతిలో పాఠాలు నేర్చుకోకపోయినా, వారిద్దరిదీ గురుశిష్య సంబంధమే! సాహితీ లోకంలో మెరికల్లాంటి శిష్యులను తయారుచేసిన మరో గురువు పుట్టపర్తి నారాయణాచార్యులు. రాచమల్లు రామచంద్రారెడ్డి, నరాల రామారెడ్డి వంటి ఉద్దండులు ఆయన శిష్యులే! ఇక భద్రిరాజు కృష్ణమూర్తి భాషాశాస్త్ర ఆచార్యులుగా సుప్రసిద్ధులు. బూదరాజు రాధాకృష్ణ, చేకూరి రామారావు, తూమాటి దొణప్ప వంటి శిష్యులను ఆయన తీర్చిదిద్దారు.

ఎందరో గురువులు ఉన్నా, శిష్యుల మనసుల్లో చెరగని ముద్రవేసే వారు కొందరే ఉంటారు. అలాంటి వారే ఉత్తమ గురువులుగా చరిత్రలో గుర్తుండిపోతారు. మన దేశానికి రెండో రాష్ట్రపతిగా పనిచేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యాపకుడిగా ఎందరో శిష్యులను తయారు చేశారు. ఆయన మైసూరు విశ్వవిద్యాలయం నుంచి కలకత్తా విశ్వవిద్యాలయానికి వెళ్లేటప్పుడు ఆయనను గుర్రపు బండిలో కూర్చోబెట్టి శిష్యులే స్వయంగా బండిని లాక్కుంటూ వెళ్లి మరీ మైసూరు రైల్వే స్టేషన్‌లో సాగనంపారు. అదీ రాధాకృష్ణన్ ఘనత! రేపు రాధాకృష్ణన్ పుట్టినరోజు. మనకు ఉపాధ్యాయ దినోత్సవం. గురువుల ఘనతకు శిష్యుల అభిమానమే గీటురాయి! జీతంరాళ్ల కంటే శిష్యుల అభిమాన ధనమే అసలైన సిరిసంపదలుగా తలచే గురువులు ఉంటారు. అలాంటి వాళ్లే ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తారు.

దేశానికి తగిలిన చెంప దెబ్బ

కామెంట్



కరణ్ థాపర్

మొదటి ఘటన ఉత్తర ప్రదేశ్‌లో జరిగింది. హోమ్ వర్క్ చేయలేదన్న కారణంతో ఏడేళ్ల ముస్లిం బాలుడిని మిగతా పిల్లలు ఒక్కొక్కరుగా వచ్చి చెంప దెబ్బ కొట్టాలని తృప్తి త్యాగి అనే ఉపాధ్యాయురాలు ఆదేశించారు. రెండో ఘటన జమ్మూ–కశ్మీర్‌లో చోటు చేసుకుంది. పదేళ్ల బాలుడు బ్లాక్ బోర్డు పైన 'జై శ్రీరామ్' అని రాసినందుకు, ఫరూఖ్ అహ్మద్ అనే టీచర్ పిల్లలంతా చూస్తుండగా ఆ బాలుడిని క్లాసు బయటికి ఈడ్చుకెళ్లి దారుణంగా కొట్టాడు. ఇక్కడ బాధితులు పసివాళ్లు. శారీరకంగానే కాదు, మానసికంగా కూడా వారికి లోతైన గాయాలయ్యాయి. దారుణాతి దారుణం ఏంటంటే... వారు ముస్లిములో, హిందువులో అయిన కారణంగా అలా జరగడం! అది ఏకంగా భారతదేశం పైనే జరిగిన దాడి!

మాట వినని పిల్లలు చెంపదెబ్బ తింటారని తెలియని తరం నుండేమీ నేను రాలేదు. కానీ నాన్న ఎప్పుడూ నాపై చెయ్యి ఎత్తలేదు. ఆయన ఆర్మీ ఆఫీసర్ అయినప్పటికీ నన్ను గారం చేసేవారు. సున్నితమైన మనసు గల తండ్రిగా ఆయన నా పట్ల వ్యవహరించేవారు. అమ్మ మాత్రం నన్ను క్రమశిక్షణలో ఉంచేవారు. అమ్మ చేతి దెబ్బలు ఒకటీ రెండు తిన్నట్లు కూడా నాకు గుర్తు. నిస్సందేహంగా నేను ఆ దెబ్బలకు యోగ్యమైనవాడినే! నిజానికి, ఆ విధమైన దండన ఆ కాలంలో సమర్థనీయతను కలిగి ఉందన్న సంగతి కూడా నాకు తెలియందేమీ కాదు.

అయితే గత వారం రెండు వేర్వేరు పాఠశాలల్లో, ఇద్దరు వేర్వేరు వర్గాలకు చెందిన పిల్లలపై 'ఇతర' వర్గం నుంచి జరిగింది ఇందుకు భిన్నమైనది. వారు చెంపదెబ్బలు తినలేదు. దెబ్బలు తిన్నారు. ఇది మొదటిది. ఇక రెండవది... వారిని మందలించడానికి గానీ, సరిదిద్దడానికి గానీ కొట్టలేదు. అవి వారిని అవమానించడానికీ, ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడానికీ కొట్టినవి. మూడవది, వారు వేరే మతానికి చెందిన వారైనందువల్ల జరిగినవి. వెల్లువెత్తిన మత విద్వేషం అది. ఇదేమీ పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టడం కోసం జరిగినది కాదు. నిజం చెప్పాలంటే... ఆ ధోరణి గర్హనీయమైనది, నీచమైనది, అసహ్యకరమైనది.

మొదటి ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని ఖుబ్బాపూర్‌లో జరిగింది. హోమ్ వర్క్ చేయలేదన్న కారణంతో ఏడేళ్ల ముస్లిం బాలుడిని మిగతా పిల్లలు ఒక్కొక్కరుగా వచ్చి చెంపదెబ్బ కొట్టాలని తృప్తి త్యాగి అనే ఉపాధ్యాయురాలు ఆదేశించారు. ఆమె ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కూడా! ఆ బాలుడిని అలా కొట్టిస్తున్న సమయంలో ఆ టీచరు... 'మహమ్మదీయ పిల్లలు' అంటూ అవహేళనగా, అవమానకరంగా మాట్లాడుతూ, ''ఇంకా గట్టిగా కొట్టండి'' అని సాటి పిల్లల్ని ప్రోత్సహించడం మరో మాటకు తావులేకుండా వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది.

రెండో ఘటన, జమ్మూ–కశ్మీర్‌లోని బనీలో చోటు చేసుకుంది. అక్కడ పదేళ్ల బాలుడు బ్లాక్ బోర్డు పైన 'జై శ్రీరామ్' అని రాశాడు.



అది చూసిన ఫరూఖ్ అహ్మద్ అనే టీచర్ ''పిల్లలంతా చూస్తుండగా ఆ బాలుడిని క్లాసు బయటికి ఈడ్చుకెళ్లి దారుణంగా కొట్టాడు. అక్కడి నుంచి ఆ బాలుడిని ప్రిన్సిపాల్ గది లోకి లాక్కెళ్లి అక్కడ మళ్లీ ఆ టీచరు, ప్రిన్సిపాల్ కలిసి, గదికి తాళం వేసి మరీ ఆ చిన్నారిని కొట్టారు. ఇంకోసారి అలా రాస్తే చంపేస్తామని హెచ్చరించారు'' అని ఎఫ్.ఐ.ఆర్.లోని వివరాలను బట్టి తెలుస్తోంది.

ఈ రెండు ఘటనలు కూడా అత్యంత భయానకమైనవి. రెండో ఘటన గురించి కొద్దిగా మాత్రమే మనకు తెలుసు. మొదటి ఘటన తాలూకు వీడియో విస్తృతంగా చక్కర్లు కొడుతూ ఉంది. ఆ వీడియోను తొలగించాలని ప్రభుత్వం ఆదేశించే లోపే సోషల్ మీడియాలో లక్షల మంది వీక్షించారు. ఏడేళ్ల ముస్లిం బాలుడిని కొట్టినందుకు వచ్చే ప్రతిస్పందన ఎలా ఉంటుందో మనకు బాగా తెలుసు. ఇక్కడే మరొక ఆందోళన కూడా కలుగుతోంది నాకు.

బాలుడి తండ్రి న్యాయం కోసం డిమాండ్ చేసే స్థితిలో లేక పోగా... రాజీపడమని, ఇంకా చెప్పాలంటే ఆ టీచర్‌ను క్షమించి, జరిగిన దానిని మరచిపొమ్మని ఆయనపై ఒత్తిడి పెరుగుతోంది. అలా ఒత్తిడి తెస్తున్నవారిలో రైతుల పోరాట యోధుడు నరేశ్ టికైత్ కూడా ఉన్నారు. బాలుడి తండ్రిని రాజీ పడమని చెబుతూ, ఎందుకంటే, ''ఆ టీచర్ చెడు ఉద్దేశంతో అలా చేయలేదు'' అంటున్నారు. ''కనీసం ఆమె క్షమాపణైనా చెప్పాలి కదా'' అని అడిగినప్పుడు, ''క్షమాపణ అనేది పెద్ద మాట. కానీ ఆమె పశ్చాత్తాపం వ్యక్తం చేశారు'' అని రాకేశ్ టికైత్ అన్నారు.

ఖుబ్బాపూర్ పరిసర ప్రాంతాల గ్రామ పెద్దల ప్రతిస్పందన అయితే మరింత నిరుత్సాహకరంగా ఉంది. పూరా గ్రామానికి చెందిన నరేంద్ర త్యాగి ఆ ఏడేళ్ల పిల్లవాడి తండ్రితో, ''ఇక ఈ నాటకాన్ని ఆపండి. గ్రామంలోకి మీడియా అడుగు పెట్టడం మాకు ఇష్టం లేదు. మీరు వెంటనే పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఎఫ్.ఐ.ఆర్. వద్దని చెప్పండి. వెనక్కు తీసుకోండి. లేకుంటే మీరే దాని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది'' అన్నారు.

చివరికి పోలీసులు కూడా కనీసంలో కనీసమైనా చేయలేదు. వారెంటు లేకుండా అరెస్టు చేయడానికీ, కోర్టు అనుమతి లేకుండా విచారణ చేపట్టడానికీ వీల్లేని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ''తృప్తి త్యాగికి ద్వేషపూరిత ఉద్దేశాలు లేవు'' అని ముజఫర్‌నగర్ పోలీసులు పేర్కొన్నారు. ఇక స్థానిక బీజేపీ ఎంపీ సంజీవ్ బాల్‌యాన్ ''ఇదొక చిన్న విషయం'' అనేశారంటే ప్రభుత్వ స్పందన ఎలా ఉందో మీరు ఊహించవచ్చు. ఎన్నికలు మరో ఏడు నెలల్లో ఉన్నాయి కనుక క్షమించి, ఇక ఆ విషయాన్ని మర్చిపోవాలని అది కోరుతోంది.

కానీ మీరు, నేను అలా క్షమించి, మర్చిపోకూడదని నేను అంటాను. లేదా మొత్తంగా మనం. ఇక్కడ బాధితులు పసివాళ్లు. శారీరకంగానే కాదు, మానసికంగా కూడా వారికి లోతైన గాయాలు అయ్యాయి. అవి నయం అవడానికి ఎంతో సమయం, ఎంతగానో ప్రేమ అవసరం అవుతాయి. వారికి జరిగిన దారుణాతి దారుణం... వారు ముస్లిములో, హిందువులో అయిన కారణంగా జరిగింది. అది ఏకంగా భారతదేశం పైనే జరిగిన దాడి!

చివరిగా ఒక మాట. ఇవి 'అచ్ఛే దిన్'(మంచి రోజులు) కాదు. ఇది 'అమృత్ కాల్'కు పిలుపు కాదు. ఇది నరకానికి ప్రవేశ ద్వారం కావచ్చు. అందుకనే ఈ టీచర్లకు గుణపాఠం నేర్పాలి. ప్రభుత్వం దగ్గర నుంచి కనీసంగా మనం ఆశించగలిగింది ఇదే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తరుణోపాయం



సగం చైనాను కలుపుకొని భారత్ ఒక కొత్త మ్యాపును గీయడానికి ఇదే సమయం. అప్పుడైతే చర్చలకు మంచి స్టార్టింగ్ పాయింట్ ఉంటుంది.

– వినోద్ ఖోస్లా, వ్యాపారవేత్త

హంతకులు



ఫ్రెంచ్–పాశ్చాత్య దోపిడీని నిరోధించిన ప్రతీ ఒక్క ఆఫ్రికన్ నాయకుడినీ చంపేశారు. థామస్ శంకర, సిల్వానస్ ఒలంపియో, ప్యాట్రిస్ లుముంబా లాంటి వాళ్లందరినీ చంపేశారు.

– అడేమోలా, పాన్–ఆఫ్రికనిస్ట్

ఏమైంది స్వీడన్‌కు?



స్వీడన్ నియంత్రణలో లేదు. ఒక్క రాత్రిలో నాలుగు బాంబుదాడులు జరిగాయి. గోథెన్‌బర్గ్‌లో రెండు పేలుళ్లు, స్టాక్‌హోమ్‌లో ఒకటి, నిషోపింగ్‌లో ఒకటి. ఇప్పుడు స్వీడన్ 'నో–గో జోన్లు' (సురక్షితం కాని ప్రాంతాలు) మొత్తం 61 ఉన్నాయి. అయినా మీడియా ఈ సంక్షోభం మీద మాట్లాడటం లేదు.

– పీటర్ ఇమాన్యుయల్‌సేన్, స్వీడిష్ జర్నలిస్ట్

తప్పు మీదే!



ఒకవేళ మీ మతాన్ని విమర్శించేవారి మీద హింసాత్మక చర్యలకు పాల్పడమనో, హింస సమర్థనీయమనో మీ మతం చెబుతున్నదంటే– ముందు మీ మతమే తప్పుగా ఉన్నదని అర్థం చేసుకోండి.

– అలీ మాలిక్, హేతువాది

అభిమానం



కోల్‌కతాలో నాకు తప్పనిసరిగా, 'మీరు సుజీత్ సర్కారా?' అన్న ప్రశ్న అభిమానుల నుంచి ఎదురవుతుంటుంది. నేను కాదంటాను. 'అదేంటి, 'పీకూ' తీసింది మీరే కదా?' అంటారు వాళ్ళు. అవును, నేనేనని (అబద్ధం) చెబుతాను. (పీకూ దర్శకుడు సుజీత్ సర్కార్.)

– సుజయ్ ఘోష్, 'కహానీ' దర్శకుడు

ఇంకానా?



ఒకబ్బాయితో పెద్దలు కుదిర్చిన పెళ్లిని నా కజిన్ తిరస్కరించింది. కారణం– అతడు మొదటి సంతానంగా కొడుకును కోరుకుంటున్నానని చెప్పడమే. చిత్రమేమిటంటే – అతను ఢిల్లీలో పెరిగాడు, గురుగావ్‌లోని ఒక బహుళ జాతి సంస్థలో పని చేస్తాడు. ఇది నమ్మలేని నిజం.

– రిచా సింగ్, స్ట్రాటెజీ కన్సల్టెంట్

అవీ బియ్యమంటే...



బంగ్లాదేశ్ బియ్యం అత్యున్నత నాణ్యమైనవి. నేను ఢాకా నుంచి ఎప్పుడూ 10–12 కిలోలు తెచ్చుకుంటాను. వాటిని నీటిలో ఉడికించినప్పుడు ఖీర్/పాయసం వాసనొస్తాయి. అలాగే తినబుద్ధవుతుంది. బంగ్లాదేశీ బియ్యం లాంటివి ఇండియాలో లేనే లేవు. బాస్మతి కూడా వెనకెక్కడో ఉంటుంది.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, సీనియర్ ఫెలో

మన కాలపు మహాకవి

సందర్భం




వారాల ఆనంద్

బెంగాల్‌లో ఒక టాగోర్‌లా, కర్ణాటకలో ఒక ఏ.కే. రామానుజన్‌లా, మలయాళంలో ఫణిక్కర్‌లా తనదయిన ఒక ప్రత్యేకమయిన స్వరంతో ప్రకృతితో మమేకమై గొప్ప కవిత్వం రాసిన మనకాలపు మహాకవి జయంత్ మహాపాత్ర. ఆయన కవిత్వం నిండా ఒడిశా ప్రజల ప్రాచీన సంస్కృతి, వర్తమాన చరిత్ర అన్నీ పరుచుకుని ఉంటాయి. అలాగని ఆయన్ని స్థానిక కవిగా భావిస్తే తప్పే అవుతుంది. ఆయన కవిత్వం ప్రపంచ ద్వారాల్ని ఒడుపుగా తెరుస్తుంది. ఒడియా, ఆంగ్ల భాషల్లో విస్తృతంగా రాసి విశ్వవిఖ్యాతి గాంచిన జయంత్ మహాపాత్ర ఆగస్ట్ 27 ఆదివారం కటక్ లోని ఒక ఆసుపత్రిలో మరణించారు.

1928 అక్టోబర్ 2న కటక్‌లో జన్మించిన జయంత్ మహాపాత్ర దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. చిన్నప్పటినుండీ ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్న ఆయన భౌతిక శాస్త్రంలో పీజీ చేసి ఒడిశాలోని పలు కాలేజీల్లో ముప్ఫయి ఆరేళ్ళ పాటు భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పని చేశారు. చాలా మంది కవుల కంటే భిన్నంగా జయంత్ మహాపాత్ర తన 38వ ఏట కవిత్వం రాయడం మొదలు పెట్టారు. ఆయన ఇంగ్లీష్, ఒడియా రెండు భాషల్లో విరివిగా రాశారు. భారతీయ ఆంగ్ల కవిగా ప్రపంచవ్యాప్తంగా పేరు గడించారు. ఆయన మొట్టమొదటి పుస్తకం 'క్లోజ్ ది స్కై, టెన్ బై టెన్' 1970లో అచ్చయింది. తాను నివసించిన ఒడిశా ప్రాంత చరిత్ర సంస్కృతి ఆయన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. మహాపాత్ర ఇంగ్లీషు కవిత్వంలో ధ్వనించే లయ మిగతా బయటి దేశాల ఇంగ్లీష్ భాషా కవుల కంటే భిన్నంగా ఉంటుంది. దానికి కారణం ఆయనపై ఉన్న ఒడిశాలోని మౌఖిక సాహిత్యం, జానపద గీతాల ప్రభావం అనే చెప్పాలి.

మహాపాత్ర కవితా సంకలనం 'ఎ రెయిన్ ఆఫ్ లైఫ్' కవితలన్నీ బ్రిటన్‌లోని 'క్రిటికల్ క్వార్టర్లీ', 'టి.ఎల్.ఎస్.' లాంటి వాటిల్లోనూ, 'చికాగో రివ్యూ' లాంటి పత్రికల్లోనూ అచ్చయ్యాయి. అంతేకాదు అమెరికా, ఆస్ట్రేలియాలలోని సాహిత్య పత్రికల్లో కూడా వచ్చాయి. దాంతో ఆ పుస్తకానికి 'జాకోబ్ గ్లాట్ స్టైన్' అవార్డు వెతుక్కుంటూ వచ్చింది. ఆయన 30కి పైగా కవితా సంకలనాలు వెలువరించారు. అందులో అధికంగా ఇంగ్లీష్‌లోనూ, మిగతావి ఒరియాలోనూ రాశారు.

మహాపాత్ర ప్రధానంగా కవిత్వం రాసినప్పటికీ వచనం కూడా రాశారు. 'డోర్ ఆఫ్ పేపర్స్' కథా సంకలనం, అనేక వ్యాసాలూ, తన జ్ఞాపకాలూ రాశారు. ఆయన అనేక ఒడియా కవితల్ని ఇంగ్లీషులోకి అనువదించారు. అనువాదకుడిగా కూడా ఆయనకు గొప్ప గౌరవముంది. ఆయన కవితా సంకలనం 'రిలేషన్ షిప్స్'కి 1981లో సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. మొట్టమొదటి భారతీయ ఆంగ్ల కవిగా ఆ అవార్డును అందుకున్నారు. 'సార్క్ లిటరరీ అవార్డు', 'టాటా లిటరేచర్ జీవన సాఫల్య పురస్కారం' అందుకున్నారు. ఇంకా 2009లో పద్మశ్రీ పురస్కారం, ఉత్కళ్ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, సాహిత్య అకాడెమీ ఫెలోషిప్ కూడా అందుకున్నారు. ఫెల్లోషిప్‌ను అందుకున్న మొట్టమొదటి భారతీయ ఆంగ్ల కవి కూడా జయంత్ మహాపాత్రే!



జయంత్ మహాపాత్ర

'కవి తనకు తాను వేసుకునే అనేక ప్రశ్నలకు, తాను రాసే కవిత్వం సమాధానాలు చెబుతుంది' అంటాడు జయంత్ మహాపాత్ర. అందుకే ఆయన కవిత్వం ఆయనకు తన అంతర్, బహిర్ సంఘర్షణలకు వేదికగా నిల్చింది. కవిత్వం వర్తమాన కాలపు సంక్షోభాన్నీ, దుఃఖాన్నీ ప్రతిబింబించాలంటాడు.

''నేను ఒడిశాలో పుట్టాను, ఇక్కడే బతికాను, బతుకుతున్నాను, ఇక్కడి చరిత్ర నాది, కోణార్క్ నాది, కోణార్క్ వైశాల్యం నాది, వైభవం నాది, దాని ఒంటరితనం నాది... అంతే కాదు ఇక్కడి ఆకలి, ఇక్కడి కరువు కాటకాలు నావి. ఎవరయినా వాటిని దాటి నా నుంచి మరే రచనల్ని ఆశిస్తారు! నేను అదే రాశాను. రాస్తున్నాను. చెట్టు మీద మామిడి ఎట్లా పండి పోతుందో నేనూ అట్లే మరణం వైపు పరిపక్వం చెందుతున్నాను'' అన్నారు జయంత్ మహాపాత్ర. ఆయనలేని లోటు భారతీయ ఆంగ్ల కవిత్వానికే కాదు... మొత్తంగా కవిత్వ ప్రపంచానికే పూడ్చలేనిది.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత
మొబైల్: 94405 01281

(ఆగస్ట్ 27న జయంత్ మహాపాత్ర తుదిశ్వాస విడిచారు)

వెలుగు నీడల సయ్యాట

విశ్లేషణ



జిల్లా గోవర్ధన్

రాష్ట్రపతిగా, కేంద్ర మంత్రిగా, కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత స్థానం కలిగిన వ్యక్తిగా ప్రణబ్ ముఖర్జీ ఒక వెలుగు వెలిగారు. కానీ ఆయన జీవితంలో ఎన్నో నీలి నీడలూ ఉన్నాయి. ఉత్థాన, పతనాల కెరటాలు ఎన్ని వచ్చినా ఆయన తన స్వభావాన్ని వీడక అన్నింటినీ సమాన దృష్టితో స్వీకరించారు.

1973 ఫిబ్రవరిలో ప్రధాని ఇందిరా గాంధీ కేంద్ర క్యాబినెట్‌లో అనూహ్యంగా ప్రణబ్ ముఖర్జీ చోటు సంపాదించారు. ఫైనల్ లిస్టును చూసిన ఇందిర సన్నిహితుడైన జ్యోతిష్కుడు మంత్రివర్గ సభ్యుల సంఖ్యను మార్చాలని సూచించడంతో ప్రణబ్ పేరును అప్పటికప్పుడు చేర్చడం జరిగింది. ఆ తర్వాత ఆయన వెనుతిరిగి చూడలేదు.

అది 1984 అక్టోబర్ 31 ఉదయం. కలకత్తాలో రాజీవ్ గాంధీతో కలిసి ఎన్నికల ప్రచార సభ నిర్వహిస్తుండగా ఇందిరాగాంధీ హత్య వార్త తెలిసి హుటాహుటిన రాజీవ్‌తో సహా ఢిల్లీ చేరుకున్నారు ప్రణబ్. రాజీవ్ గాంధీని ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయించడానికి చర్చలు జరుగుతున్నాయి. ఒక సిక్కు రాష్ట్రపతి... ఇందిరాజీ కొడుకును ప్రధానిగా (అప్పటి పరిస్థితుల దరిమిలా) ఒప్పుకోకపోవచ్చనీ, అంచేత రాష్ట్రపతి ఢిల్లీలో లేనప్పుడే ఉపరాష్ట్రపతి ఆర్. వెంకట్రామన్ ద్వారా ప్రమాణ స్వీకారం జరిపించాలనీ రాజీవ్ సన్నిహితుల ఆలోచన. ఉత్తర యెమన్‌లో పర్యటిస్తున్న రాష్ట్రపతి జైల్ సింగ్ అప్పటికే తిరుగు ప్రయాణంలో ఉన్నారు. రాష్ట్రపతిని కాదని, ఉపరాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయటం రాజ్యాంగ బద్ధం కాదనీ, రాజకీయం దృష్ట్యా తప్పుడు సంకేతాలు వెళతాయని సీనియర్ నేతగా ప్రణబ్ ముఖర్జీ తన అనుభవంతో రాజీవ్‌కు సలహా ఇచ్చారు. ఈ సలహానే రాజీవ్ పాటించటం విశేషం. జైల్ సింగ్ ఢిల్లీ చేరుకోగానే ఆయన, రాజీవ్ గాంధీతో అదే రాత్రి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం (సాఫీగానే) జరిపించారు.

అయితే ప్రణబ్ ముఖర్జీ సలహాను రాజీవ్ సన్నిహితులు ఆయనకు మరో తీరుగా వక్రీకరించారు. రాజీవ్‌ని కాదని, ప్రణబ్ ముఖర్జీ తనే ప్రధాని పీఠం అధిరోహించాలనే ప్రయత్నంలో రాష్ట్రపతితో సీక్రెట్ చర్చలు జరుపుతున్నారని రాజీవ్ గాంధీ చెవిలో ఊదారు. రాజీవ్ ముందూ వెనక ఆలోచించక ప్రణబ్ పట్ల దురభిప్రాయం పెంచుకున్నారు. చినికి చినికి ఇది గాలివానగా మారి, ఈ సీనియర్ నేతను క్యాబినెట్ నుండి తర్వాత వర్కింగ్ కమిటీలో నుండి తప్పించి, చివరకు కాంగ్రెస్ పార్టీ నుండే వెలివేశారు.

ఎనిమిదవ లోక్‌సభ (1984) ఎన్నికల్లో, సానుభూతి ప్రభంజనంతో కాంగ్రెస్ 404 సీట్లు గెలిచి విజయఢంకా మోగించింది. రాజీవ్ గాంధీని కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డ్ ప్రణబ్ అధ్యక్షతన లోక్‌సభ లీడర్‌గా ఎన్నుకుంది; ఇక అదే రోజు సాయంత్రం రాష్ట్రపతి భవనంలో ప్రధానితో పాటు మంత్రి వర్గ ప్రమాణ స్వీకారం. సాయంత్రం పీవీ నరసింహారావు ఫోన్ చేసి ప్రణబ్ పేరును ప్రమాణ స్వీకారం చేసేవారి జాబితా నుంచి తొలగించబడిందని చెప్పారు.



ఆ తర్వాత ప్రణబ్ ముఖర్జీ రాజకీయ కెరీర్‌లో కొంత కాలం విషాదమే రాజ్యమేలింది. 1986 జనవరిలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నుండి స్థానం కోల్పోయి, 1986 ఏప్రిల్‌లో పార్టీ నుండి కూడా బహిష్కృతులయ్యారు.

అయితే పీవీ 1991 జూన్ 21న ప్రధాని అయిన మూడు రోజులకే ప్రణబ్‌ను ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ ఛైర్మన్ (క్యాబినెట్ మంత్రి హోదా)గా నియమించారు. పీవీ అండదండలతోనే ప్రణబ్, పార్టీ అధినేత్రి సోనియా కోటరీలో చేరి, ఆ తర్వాత రెండు దశాబ్దాలు కేంద్ర మంత్రివర్గంలో వాణిజ్య, విదేశాంగ, రక్షణ, ఆర్థిక శాఖ పదవులు చేపట్టారు. పార్టీ వ్యవహారాల్లోనూ, పార్లమెంటులోనూ కాంగ్రెస్ ఫైర్ ఫైటర్‌గా తనదైన ముద్ర వేశారు. ఆ పిదప 2012 జూలై 25 నాడు రాష్ట్రపతి పదవిని సైతం అలంకరించారు.


వ్యాసకర్త మాజీ పీఎఫ్ కమిషనర్ । 98190 96949

(ప్రణబ్ స్వీయ చరిత్ర 'ది టర్బులెంట్ ఇయర్స్' ఆధారంగా)

నమ్మకం ముఖ్యం

భగవంతుడి అనుగ్రహం పొందడానికి గురుకటాక్షం అవసరం. గురువు భక్తుడిని భగవంతుడి దగ్గరకు చేర్చగలడు. గురువుపై శిష్యులకు నమ్మకం ఉండాలి. అలా లేకపోతే ఫలితం ఉండదు. ఓ ఆశ్రమంలో గురువుగారు సిద్ధి పొందే సమయం ఆసన్నమవ్వడంతో శిష్యులు అంత్యదశలో ఏదన్నా మంత్రోపదేశం చేస్తారేమోననే ఆశతో నిరంతరం ఆయన దగ్గరే ఉంటున్నారు.

బయటి ఊళ్ళో ఉన్న ఓ శిష్యుడికి తన గురువు గారు సిద్ధి పొందబోతున్నారన్న విషయం తెలిసి



ఆశ్రమానికి బయలుదేరాడు. అతనొచ్చే దారిలో నది పొంగి ప్రవహిస్తున్నా ఏ మాత్రం భయపడకుండా గురువును చేరాలనే లక్ష్యంతో ఆయన చెప్పిన ఓ మంత్రాన్ని జపిస్తూ ప్రవాహంలో దిగాడు. అలవోకగా నదిని దాటి గురువును చేరి నమస్కరించాడు. గురువు ఆశీర్వదించారు. అయితే అక్కడే ఉన్న శిష్యులు 'మేము రోజుల తరబడి మీ చుట్టూ ఉన్నాం. ఏదన్నా మంత్రోపదేశం చేస్తారని చూస్తున్నాం. కానీ మాకేమీ చెప్పలేదు. కానీ ఇదిగో వేరే ప్రాంతం నుంచి వచ్చిన అతనికి నీటి మీద నడిచే శక్తినిచ్చారు. అటువంటి మంత్రశక్తిని మాకు బోధించలేదు కదా' అన్నారు.

అందుకు గురువుగారు చిన్న నవ్వు నవ్వి, ''ఒరేయ్! నేను అందరికీ ఒకే విధంగానే బోధించాను. ఎవరికీ తక్కువ చేయలేదు. నేను ఇప్పటికే చేసిన మంత్రోపదేశం మీద అతనికున్న నమ్మకంతోనే నదీ ప్రవాహాన్ని తట్టుకుని ఇక్కడికి వచ్చాడు. కానీ మీకిప్పటికీ నేను చెప్పిన ఉపదేశాల మీద గానీ నా మీద కానీ పరిపూర్ణమైన నమ్మకం లేదు. అందుకే ఇంకా ఏదన్నా చెప్తానా అని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా మీకు నా బోధనల మీద నమ్మకం కలగాలని ఆ దేవుడికి ప్రార్థిస్తున్నాను'' అన్నారు. శిష్యులు తమ తప్పును గ్రహించి క్షమాపణలు కోరారు. వారికీ మునుపటి మంత్రోపదేశం సిద్ధించింది. గురువు గారి మాట మీద ఎప్పుడూ పూర్తి నమ్మకం ఉండాలి. లేకుంటే ఫలితం ఉండదనడానికి ఇదొక నిదర్శనం.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.పంచమి రా.9.55 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** అశ్వని ప.3.19 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ఉ.11.26 నుండి 12.58 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.23 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.20 నుండి 9.55 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.11.

క్లుప్తంగా...

నేడు వల్మిడి ఆలయ ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవానికి ముస్తాబైన వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

జనగామ: జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రారంభోత్సవం సోమవారం(నేడు) జరగనుంది. కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరుకావాల్సి ఉండగా అనివార్య కారణాలతో పర్యటన రద్దయింది. రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలకు రాష్ట్రమంత్రులు హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్ హాజరుకానున్నారు. ఉదయం 10.48 గంటలకు నిర్వహించే యంత్ర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాల్లో చినజీయర్ స్వామి పాల్గొననున్నారు. అనంతరం పాలకుర్తిలోని సోమనాథ మెమోరియల్ హాల్, సోమనాథ కళాక్షేత్రం, టూరిజం హరిత హోటల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తారు. దేవాలయంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు.

కేటీపీపీలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం రెండవ దశ 600 మెగావాట్ల థర్మల్ ప్లాంటులో ఆదివారం సాయంత్రం విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ప్రధాన ప్లాంటులోని బాయిలర్ ట్యూబ్ లీకేజీ కావడంతో ఉత్పత్తి ఆగిపోయింది. కేటీపీపీ ఇంజనీర్లు, ఉద్యోగులు మరమ్మతు పనులు చేపట్టారు. రెండురోజుల్లో తిరిగి విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తండ్రి మృతి.. ఆగిన కూతురి పెళ్లి



రాములు

శంకరపట్నం(మానకొండూర్): కాసేపట్లో కూతురు పెళ్లి.. వివాహ తంతుకు అంతా సిద్ధమవుతుండగా.. ఆమె తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం అంబాల్‌పూర్ గ్రామంలో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన ఎర్రల రాములు(48) కేశవపట్నంలో ట్రాక్టర్ మెకానిక్. అతనికి భార్య మంజుల, కూతుళ్లు లావణ్య, కోమల, వీణ ఉన్నారు. పెద్దకూతురు లావణ్య వివాహం జమ్మికుంట మండలం శాయంపేటకు చెందిన సతీశ్‌తో మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10.41 గంటలకు జరగాల్సి ఉంది. బంధువులంతా పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యారు. వేకువజామున రాములుకు ఛాతీలో నొప్పి రావడంతో హుటాహుటిన కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. తండ్రి మృతితో లావణ్య వివాహం ఆగిపోయింది.

‘గీతా’ సంకల్పం

ప్రతి ఇంట్లో భగవద్గీత ఉండాలన్నదే ఆశయం

ఐదేళ్లుగా **4,618** మందికి ఉచితంగా పంపిణీ



నిర్మలా సీతారామన్‌కు భగవద్గీత ఇస్తున్న జ్ఞానేందర్ గుప్తా

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సంకల్పం ఉంటే..సాధించలేనిదంటూ ఏదీ ఉండదు. ఎన్ని అవాంతరాలు..ఎన్ని అడ్డంకులు ఎదురైనా సరే ముందుకు సాగి అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారు. ప్రతి ఇంటా భగవద్గీత ఉండాలన్నదే లక్ష్యంగా నిజామాబాద్‌కు చెందిన జ్ఞానేందర్‌గుప్తా సంకల్పించారు. ఐదేళ్లుగా ఉచితంగా భగవద్గీత గ్రంథాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇప్పటివరకు 4,618 భగవద్గీత గ్రంథాలను అందజేశారు. తన తుదిశ్వాస ఉన్నంతవరకు భగవద్గీత గ్రంథాలు పంచుతూనే ఉంటానని జ్ఞానేందర్‌గుప్తా చెబుతున్నారు. పదకొండేళ్లుగా తన తండ్రి మంచాల శంకరయ్య గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీం, హైకోర్టుల న్యాయమూర్తులు, వైద్యులు, వ్యాపారులు మొదలు... సాధారణ వ్యక్తులు వరకు భగవద్గీత చేరేలా నిత్యం పరితపిస్తూనే ఉన్నాడు. భగవద్గీతతోపాటు రామకోటి పుస్తకాలు కూడా పంచుతున్నారు. పదుల సంఖ్యలో రామాయణం, మహాభారతం, భాగవతం పుస్తకాలు పంపిణీ చేశారు.

4 భాషల్లో

‘గీతా జయంతి’పేరిట ప్రపంచంలో పుట్టినరోజు జరుపుకునే ఒకే ఒక్క గ్రంథం ‘భగవద్గీత’. ఈ గ్రంథానికి ఉన్న గుర్తింపు ప్రపంచంలో ఏ గ్రంథానికీ లేదు. ప్రపంచవ్యాప్తంగా ఎందరో మహానుభావులు, అత్యున్నతస్థాయి వ్యక్తులు భగవద్గీత నుంచి స్ఫూర్తి పొందినవారే. జ్ఞానేందర్‌గుప్తా గోరఖ్‌పూర్‌లోని గీతాప్రెస్ నుంచి ఆర్డర్‌పై భగవద్గీత గ్రంథాలు తెప్పిస్తున్నారు. ఈ గ్రంథం 880 పేజీల్లో 18 అధ్యాయాలు, 745 శ్లోకాలతో సవివరంగా ఉంది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మరాఠీ భాషల్లో ముద్రించిన గ్రంథాలను పంపిణీ చేస్తున్నారు. గీతాసారం అన్ని భాషల్లో ఉన్న వారికి అర్థమయ్యేలా చేర్చాలన్న సంకల్పంతో ఇలా చేస్తున్నారు. ఇటీవల దక్షిణకొరియా ఒకరు అడగ్గా కొరియర్‌లో భగవద్గీత పంపాడు, యూఎస్‌కు అయితే రెగ్యులర్‌గా ఆయనే కొరియర్ ద్వారా చేరవేస్తున్నారు.

మరికొన్ని సేవా కార్యక్రమాల్లో...

నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, హైదరాబాద్, సికింద్రాబాద్, సిరిసిల్ల, వేములవాడ, సొంతూరైన సిరిసిల్ల జిల్లా కనగర్తిలలో స్వర్గ రథాలు సేవలు అందుబాటులో ఉన్నాయి. రెండునెలల్లో కాశీలోనూ స్వర్గరథం ఏర్పాటు చేస్తానని చెప్పారు. నిజామాబాద్‌లో మృతదేహాలను పెట్టేందుకు 8 ఏళ్ల నుంచి 10 ఫ్రీజర్‌లు ఉచితంగా అందుబాటులో ఉంచారు.

అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తులకు ‘అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి, సిద్దిపేట ట్రస్ట్ ఆధ్వర్యంలో 2011 ప్రతి ఏటా 60 రోజులు అన్నదానం, ఇతర సేవలు అందజేస్తున్నారు.

ఎండాకాలంలో పిచ్చుకలు, పక్షులు నీటికోసం అలమటిస్తాయి. వాటి దాహార్తి తీర్చేందుకు రెండేళ్లలో 2,500 పైగా ‘బర్డ్ ఫీడర్ బాక్సులు’ ఉచితంగా అందజేశారు.

అన్న నిర్లక్ష్యంతోనే అమ్మ మరణం

- నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం
- అన్నపై చెల్లెలు ఫిర్యాదు

బాన్సువాడ రూరల్: బైక్‌ను అతివేగంగా నడిపి తల్లి మరణానికి కారణమయ్యాడని సొంత అన్నపైనే ఓ చెల్లెలు ఫిర్యాదు చేసింది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన బర్మల నర్సవ్వ(55)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు కాశీరాం ఉన్నారు. కాశీరాం ఆదివారం తల్లి నర్సవ్వతోపాటు భార్యను బైక్‌పై కూర్చోబెట్టుకొని పైడిమల్ గ్రామానికి బయలుదేరాడు. ఇబ్రహీంపేట్ శివారులో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ క్రమంలో నర్సవ్వ తల, ముక్కుకు తీవ్ర గాయాలయ్యాయి. బాన్సువాడలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సవ్వను నిజామాబాద్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మహ్మద్‌నగర్‌లో నివసించే నర్సవ్వ కూతురు గుండ్ల సుజాత ఈ విషయమై బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన అన్న అతివేగంగా, అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని, తల్లి మృతికి కారణమైన సోదరుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరింది. కేసు నమోదు చేసుకున్నామని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

వానరాల వీరంగం.. తీవ్రగాయాలతో గృహిణి మృతి



సాబీరాబేగం

మహబూబాబాద్ రూరల్: వానరాల మూక చేష్టలతో తీవ్రంగా గాయపడిన ఓ గృహిణి మృతి చెందింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ అర్జున్‌రెడ్డి ఆస్పత్రి సమీపంలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల కథనమిది. స్థానికంగా నివసించే ఎండీ గౌస్ భార్య సాబీరా బేగం (55) ఎప్పట్లాగే ఉదయం నిద్రలేచి ఇంటి ముందు వాకిలి ఊడుస్తోంది. ఈ క్రమంలో ఆమె ఇంటిపై సిమెంటు దిమ్మెకు కట్టిన విద్యుత్ తీగను కోతుల గుంపు ఊపడంతో.. ఆ దిమ్మె ఒక్కసారిగా ఊడిపోయింది. అదే సమయంలో వాకిలి ఊడ్చి ఇంట్లోకి వెళ్లడానికి కదులుతున్న సాబీరాబేగంపై దిమ్మె పడిపోయింది. దీంతో ఆమె తలకు లోపలి భాగంలో తీవ్రగాయమై.. కాలు విరిగింది. రక్తస్రావంతో కుప్పకూలిన బాధితురాలిని స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు.

క్రైమ్ కథనాలే స్ఫూర్తి!

- వాటిని చూసే నకిలీ ఐఆర్ఎస్ అధికారి అవతారం
- వెలుగులోకి ‘ఫిల్మ్ ఫైనాన్షియర్’ మరిన్ని బాగోతాలు
- కుదిరితే పైరవీలు.. లేదంటే బెదిరింపులు
- 2009లోనే కటకటాల్లోకి.. ఇప్పటి వరకు 26కేసులు



వెంకట రత్నా రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మాదాపూర్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తూ తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు (టీఎస్–నాబ్) చిక్కిన ‘ఫిల్మ్ ఫైనాన్షియర్’కారుమూరి వెంకట రత్నారెడ్డికి సంబంధించి మరో వ్యవహారం బయటపడింది. క్రైమ్ కథనాలే స్ఫూర్తిగా నకిలీ ఐఆర్ఎస్ అధికారం ఎత్తాడని పోలీసులు గుర్తించారు. రేవ్ పార్టీ కేసులో ఇతడిని కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించామని అధికారులు తెలిపారు. ఆ తర్వాతే నిందితులు ఎందరనే అంశంపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

వెన్నెముక విరగడంతో కథ అడ్డం...

గుంటూరు నగరానికి చెందిన కె.వెంకట రత్నా రెడ్డి అలియాస్ రత్నారెడ్డి అలియాస్ కేవీఆర్ రెడ్డి బీఎస్సీ పూర్తి చేశాడు. ఆపై కొన్ని కంప్యూటర్ కోర్సులు కూడా చేసి బిల్డింగ్ ఎలివేషన్స్ డిజైనర్‌గా స్థిరపడ్డాడు. 2007లో ఓ బిల్డింగ్ వర్క్ చేస్తుండగా... ప్రమాదవశాత్తు జారి పడటంతో వెన్నుముకకు తీవ్ర గాయమైంది. ఈ గాయంతో చాలా కాలం పాటు మంచం పట్టిన రత్నారెడ్డి అప్పట్లో వార్తా పత్రికలు, చానళ్లలో వచ్చే క్రైమ్ కథనాలను ఆసక్తిగా చూసేవాడు. ఈ నేపథ్యంలోనే అనేక మంది ప్రభుత్వ అధికారులుగా చెప్పుకుంటూ అమాయకులను మోసం చేసి భారీగా దండుకుంటున్న వైనంపై వెలువడిన కథనాలు ఇతన్ని ఆకర్షించాయి. ఆ స్ఫూర్తితోనే తానూ అదే రకంగా మోసాలు చేసి తేలిగ్గా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు.

కేవీఆర్ రెడ్డిగా అవతారం...

అనుకున్నదే తడవుగా మోసాలు ప్రారంభించేందుకు అవసరమైన సరంజామా సిద్ధం చేసుకున్నాడు. కేవీఆర్ రెడ్డి పేరుతో ఐఆర్ఎస్ అధికారిగా పేర్కొంటూ ఓ బోగస్ గుర్తింపుకార్డు తయారు చేశాడు. ఇదే పేరు, హోదాలతో కొన్ని విజిటింగ్ కార్డులు సైతం రూపొందించుకున్నాడు. తనకు తానే హైదరాబాద్‌లో ఉన్న సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌లోని కమిషనర్స్ ఫర్ డిపార్ట్‌మెంట్ ఎక్వయిరీస్‌లో సూపరెంటెండెంట్‌గా హోదా క్రియేట్ చేసుకున్నాడు. నగరంలోని కృష్ణనగర్ ప్రాంతానికి చెందిన నర్సింహ నుంచి రూ.6 వేలు వెచ్చించి ఓ బొమ్మ పిస్తోలు కొనుగోలు చేశాడు. గుంటూరులోని ఓ షోరూమ్‌లో ఫైనాన్స్‌పై కారు కొన్నాడు. దానిపై ప్రభుత్వ చిహ్నం ఏర్పాటు చేయడంతో పాటు నెంబర్ ప్లేట్లపై గవర్నమెంట్ వెహికిల్ అని రాయించడం ద్వారా ఉన్నతాధికారిగా ‘కలర్’ ఇచ్చాడు. వీటి సాయంతో తాను ఐఆర్ఎస్ ఆఫీసర్ అని నమ్మిస్తూ ప్రభుత్వంలో మంచి పలుకుబడి ఉందని, అనేక ప్రాజెక్టులు ఇప్పిస్తానని మోసాలకు తెరలేపాడు.

వరుస పెట్టి నేరాలు...

తాను ఐఆర్ఎస్ అధికారినంటూ నగరానికి చెందిన పి.వెంకటరామ్ అలియాస్ భీష్మాజీతో పరిచయం చేసుకున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ‘గవర్నమెంట్ హాస్పిటల్స్ ఆన్ లైన్’ అనే ప్రాజెక్టు ఇప్పిస్తానని, దీని విలువ రూ.5 కోట్లకుపైగా ఉంటుందని నమ్మబలికి ఆయన నుంచి రూ.11 లక్షలు వసూలు చేశాడు. వరంగల్‌కు చెందిన బాల్‌కిషోర్‌రెడ్డికి, ఆయన సంబంధీకులతో ఉన్న సివిల్ వివాదాన్ని సెటిల్ చేయడానికి రూ.4 లక్షలు తీసుకున్నాడు. ఓ ఆర్థిక వివాదంతో కూకట్‌పల్లికి చెందిన గోపి అనే వ్యక్తిని బెదిరించాడు. తాను సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ అధికారినంటూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పైరవీలు చేయడం ప్రారంభించాడు.

ఉత్తమ టీచర్లకు సన్మానం

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 116 మందికి అవార్డులు

నల్లగొండ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పుడమి సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలోని ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 116 మంది ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రాచీన కవుల వారసులు డా. కావూరి శ్రీనివాస్‌శర్మ, కంచర్ల శ్రీనివాస్‌రావు, గిడుగు వెంకట నాగేశ్వర్‌రావు, మున్నెల్లి శివశంకరయ్య హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లో 116 మందికి పుడమి సాహితీ వేదిక అవార్డులు అందిస్తూ వస్తోందని.. వారికి భవిష్యత్తులో తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

స్వామీ.. మాకీ తిప్పలు ఏమీ..?



యాదాద్రి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు తిప్పలు తప్పడం లేదు. అత్యంత అద్భుతంగా క్షేత్రాన్ని నిర్మించినప్పటికీ.. సరైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొనడానికి ఓ వృద్ధురాలు ఆలయానికి వచ్చింది. కానీ సరిపడా వీల్‌చైర్లు లేక నడవడానికి ఇబ్బంది పడింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు అక్కడి పోలీస్ సిబ్బంది సహాయంతో పడమటి మహారాజగోపురం నుంచి నిత్య కల్యాణ మండపం వరకు మోసుకువెళ్లారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్ యాదాద్రి భువనగిరి

‘జమిలి’పై అధ్యయనానికి మాజీ రాష్ట్రపతితో కమిటీనా?: వినోద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: జమిలి ఎన్నికలపై అధ్యయనానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో కమిటీ వేయడం పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కమిటీలో ఉన్న వారంతా ఉత్తర భారతదేశానికి చెందిన వారేనని, దక్షిణాది నుంచి ఒక్కరూ కూడా లేరని ఆదివారం ప్రకటనలో మండిపడ్డారు. అయిదు రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు పెట్టి ప్రధాని మోదీ దేశాన్ని గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టారని ఎద్దేవా చేశారు. 2018లోనే జమిలి ఎన్నికలపై తమ అభిప్రాయం చెప్పామని గుర్తు చేశారు. జమిలి ఎన్నికలు మంచిదే కానీ..దానికన్నా ముందు చర్చ జరగాలని లా కమిషన్‌కు స్పష్టం చేసినట్లు తెలిపారు. జమిలి ఎన్నికలపై ఇప్పటికే నివేదిక సిద్ధమైపోయి ఉంటుందని, ఇప్పుడు వేసిన కమిటీ నామ్ కే వాస్తే కమిటీయేనని విమర్శించారు. జమిలి ఎన్నికలకు ఐదు రాజ్యాంగ సవరణలు అవసరం ఉన్నా ముందుకు వెళుతున్నారు కానీ... విభజన చట్టంలో ఉన్న అంశాలను మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దళితులపై మితిమీరిన దాడులు



కొప్పు బాషా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో దళితులపై దాడులు మితిమీరిపోతున్నాయని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం మందమర్రిలో ఇద్దరు దళిత యువకులపై అత్యంత పాశవికంగా దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పొలంలో ఆవులు మేసిన ఘటనలో ఒకరు, మండీలో మేకలు జాడ తప్పిన ఘటనలో మరో యువకుడిపై జంతువుల మాదిరి తాడుతో కట్టేసి కొట్టడాన్ని తప్పుబట్టారు. దళితుల కోసం ఎంతో చేస్తున్నామంటూ ప్రగల్భాలు పలికే స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ మందమర్రి ఘటనలపై తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

పలు జిల్లాల్లో భారీ వర్షాలు

- దాదాపు నెలరోజుల తర్వాత కురిసిన వాన
- పొంగిన వాగులు.. కడెం ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తివేత
- తరోడా బ్రిడ్జి కింద వాగు మధ్యలో చిక్కుకున్న ఇద్దరు కూలీలు
- గజ ఈతగాళ్ల సాయంతో సురక్షితంగా బయటకు



కాగజ్‌నగర్-దహెగాం మధ్య తెగిన అందెవెల్లి వాగు తాత్కాలిక వంతెన

సాక్షి, నెట్‌వర్క్: రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం భారీ వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల వాగులు పొంగి ప్రవహించాయి. ఇటీవలి కాలంలో ఈ స్థాయి వర్షాలు పడటం ఇదే మొదటిసారి. కాగా వేడి వాతావరణంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు తాజా వర్షాలు కాస్త ఉపశమనాన్ని ఇచ్చాయి. దాదాపు నెల రోజుల తర్వాత పడిన వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలు ఆరుతడి పంటలకు మేలు చేస్తాయని చెబుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం సాయంత్రం వరకు మోస్తరు వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లాలో 38.4 మిల్లీ మీటర్లు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 18.9 మిల్లీమీటర్లు, ఆదిలాబాద్ జిల్లాలో 10.1 మిల్లీమీటర్లు చొప్పున సగటు వర్షపాతం నమోదయ్యింది. అధికారులు కుమురంభీం ప్రాజెక్టు ఐదో గేటు ఎత్తారు. కడెం ప్రాజెక్టుకు 41,245 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో మూడు వరద గేట్లను ఎత్తి 36,079 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

ఒక్కసారిగా వరద పెరిగి..

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం తరోడా–బి గ్రామ సమీపంలోని 353 బి జాతీయ రహదారిపై ఆరు నెలల క్రితం బ్రిడ్జి కుంగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో బ్రిడ్జి కింద వాగుపై కొద్ది రోజులుగా తాత్కాలిక వంతెన పనులు కొనసాగుతున్నాయి. ఆదివారం కూలీలు పనులు చేస్తుండగా సాయంత్రం ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. దీంతో ఆదిలాబాద్‌కు చెందిన ఎనుగందుల రాజలింగు, ధోని సంతోష్ వాగు మధ్యలో చిక్కుకుపోయారు. అయితే సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గజ ఈతగాళ్ల సాయంతో వారిని బయటకు తెచ్చారు.



తాళ్ల సాయంతో కూలీలను రక్షిస్తున్న దృశ్యం

పిడుగుపాటుకు గురై యువకుడి మృతి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కూడా భారీ వర్షం కురిసింది. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో అత్యధికంగా 112 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కాగా సిరిసిల్లలో క్రికెట్ ఆడేందుకు వెళ్లిన పడిగె సతీశ్ (32) పిడుగుపాటుకు గురై మరణించాడు. మరోవైపు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామ శివారులోని చెరువు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం డిస్క్ ఫిల్టర్ పిడుగు పడటంతో దెబ్బతింది. తోకలపల్లి గ్రామానికి శనివారం రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం ఉదయం లైన్ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, ఏఎల్‌ఎంలు వెంకటేశ్, పరమేశ్‌లు చెరువులో ఈత కొట్టుకుంటూ వెళ్లి డిస్క్ ఫిల్టర్‌ను మార్చి విద్యుత్‌ను పునరుద్ధరించారు.



చెరువు మధ్యలో విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న జూనియర్ లైన్‌మెన్

రెండ్రోజులు వర్షాలు!

ఈశాన్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

సాక్షి, హైదరాబాద్: ఈశాన్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఆదివారం కూడా కొనసాగింది. ఇది సముద్రమట్టం నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో వాయవ్య బంగాళాఖాతం, పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ అల్పపీడన ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించింది. రాష్ట్రంలోని ఉత్తర ప్రాంత జిల్లాల్లోని కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అంచనావేసింది.

క్లుప్తంగా...

ఆదిత్య-ఎల్1 మొదటి కక్ష్య పెంపు విజయవంతం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శనివారం మధ్యాహ్నం సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ప్రయోగించిన ఆదిత్య -ఎల్1 ఉపగ్రహానికి మొదటిసారి కక్ష్య దూరాన్ని విజయవంతంగా పెంపొందించింది. బెంగళూరులోని మిషన్ ఆపరేటర్ కాంప్లెక్స్ (ఎంఓఎక్స్), ఇస్రో టెలీమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్(ఇస్ట్రాక్), బైలాలులో ఉన్న ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ (ఐడీఎస్ఎన్) లాంటి భూనియంత్రిత కేంద్రాల నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ఉపగ్రహంలోని అపోజీ ఇంధనాన్ని మండించి కక్ష్య దూరాన్ని విజయవంతంగా పెంచారు. శనివారం ప్రయోగం చేసినపుడు భూమికి దగ్గరగా 235 కిలోమీటర్లు, దూరంగా 19,500 కిలోమీటర్లు ఎత్తులో భూ మధ్యంతర కక్ష్యలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మొదటి విడత కక్ష్య దూరం పెంపుదలలో భూమికి దగ్గరగా 235 కిలోమీటర్ల నుంచి 245 కిలోమీటర్లకు పెంచారు. భూమికి దూరంగా ఉన్న 19,500 కిలోమీటర్ల దూరాన్ని 22,459 కిలోమీటర్లకు పెంచారు. అంటే ప్రస్తుతం 245''22459 కిలోమీటర్లు దీర్ఘ వృత్తాకార కక్ష్యలో భూమి చుట్టూరా పరిభ్రమిస్తూ ఉంది. రాబోయే 15 రోజుల్లో మరో నాలుగుసార్లు కక్ష్య దూరాన్ని పెంచుతూ ఈనెల 18న భూ మధ్యంతర కక్ష్య నుంచి సూర్యుని వైపునకు మళ్లిస్తారు. అక్కడి నుంచి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లాంగ్రేజియన్ బిందువు 1 వద్దకు చేర్చడానికి 125 రోజులు సమయం తీసుకుంటుందని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు.

ఆస్పత్రిలో చేరిన సోనియా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. జ్వరం బారిన పడిన సోనియాను శనివారం సాయంత్రం సర్ గంగారాం హాస్పిటల్‌లో చేర్చారు. ఆమె పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. 'సోనియా స్వల్ప జ్వరంతో బాధపడుతున్నారు. అయితే, ఆమె పరిస్థితి నిలకడగానే ఉంది. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యుల బృందం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది' అని సీనియర్ వైద్యుడొకరు పీటీఐకి చెప్పారు.

ఆదిమ ఖండంలో... నియంత పాలనలు

సైనిక తిరుగుబాట్లతో ఆఫ్రికా ఖండం అతలాకుతలం అవుతోంది. కొన్నేళ్లుగా ఇక దేశం తర్వాత ఒక దేశంలో ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోసి సైనిక నియంతలు అధికారం చేజిక్కించుకుంటున్నారు. బుర్కినా ఫాసో మొదలుకుని తాజాగా గబాన్ దాకా ఈ జాబితా నానాటికీ పెరుగుతూనే పోతోంది. ఆ సైనిక కుట్రల పట్ల ఆయా దేశాల్లో పెద్దగా వ్యతిరేకత కూడా వ్యక్తం కాకపోవడం విశేషం. పైగా యువ ఆఫ్రికన్లు ఈ పరిణామాన్ని రెండు చేతులా స్వాగతిస్తుండటం విస్మయకర వాస్తవం...



ఆఫ్రికా దేశాల్లో సైనిక తిరుగుబాట్లు.. సైనిక పాలనకే జై కొడుతున్న యువత

- పశ్చిమ ఆఫ్రికాలోని నైగర్‌లో సైనిక తిరుగుబాటు జరిగి నెలన్నర కూడా కాలేదు. అప్పుడే ఆదిమ ఖండంలో మరో కుట్ర. మధ్య ఆఫ్రికా దేశం గాబాన్‌లో గత ఆదివారమే ఎన్నికలు జరిగాయి. బుధవారం ఉదయమే ఫలితాలు వెలువడ్డాయి. 2009 నుంచీ దేశాన్ని పాలిస్తూ వస్తున్న అధ్యక్షుడు అలీ బొంగో ఒండింబా మరోసారి తన అధికారాన్ని నిలుపుకున్నారు. ఆయన పార్టీ ఘన విజయం సాధించినట్టు టీవీల్లో అధికారిక ప్రకటన వెలువడింది. దాంతో ఆయన అభిమానులు పండుగ చేసుకున్నారు. కానీ నిమిషాల్లోనే పరిస్థితి పూర్తిగా తిరగబడింది. ఈసారి సైనికాధికారులు టీవీ తెరపైకి వచ్చారు. బొంగోను అదుపులోకి తీసుకుని ఆయన అధికారిక నివాసంలోనే ఖైదు చేసినట్టు, పాలనా పగ్గాలు తమ చేతుల్లోకి తీసుకుంటున్నట్టు ప్రకటించారు. అలా మరో ఆఫ్రికా ఖండంలో ప్రజాస్వామ్యం మరోసారి పరిహాసానికి గురైంది. మరో దేశం సైనిక కుట్రను చవిచూసింది.

వరుస సైనిక కుట్రలు

ఆఫ్రికాలో, ముఖ్యంగా పశ్చిమ, సెంట్రల్ ఆఫ్రికాలో కొన్నేళ్లుగా సైనిక కుట్రలు పరిపాటిగా మారాయి.

- గత జూలై 26న నైగర్ అధ్యక్షుడు మొహమ్మద్ బజౌమ్‌ను ఆయన సొంత ప్రెసిడెన్షియల్ బాడీ గార్డులే నిర్బంధంలోకి తీసుకున్నారు.
- 2022 జనవరిలో బుర్కినా ఫాసో అధ్యక్షుడు రోచ్ మార్క్ క్రిస్టియన్ కబోరేనుఆ దేశ సైన్యాధ్యక్షుడే బందీని చేసి అధికారం చేజిక్కించుకున్నాడు. అయితే 8 నెలల్లోనే కింది స్థాయి సైనికాధికారులు అతన్ని కూడా జైలుపాలు చేసి అధికారాన్ని పంచుకున్నారు!
- 2012 సెప్టెంబర్‌లో గినియాలో అధ్యక్షుడు ఆల్ఫా కొండేను ప్రత్యేక సైనిక బృందాలు ఖైదు చేసి పాలనా పగ్గాలను తమ చేతుల్లోకి తీసుకున్నాయి.
- 2021 మేలో మాలిలో కల్నల్ అసిమి గొయిటా కూడా సైనిక కుట్రకు పాల్పడ్డాడు. అంతకుముందు కూడా ఇలా ప్రభుత్వాన్ని పడదోసిన చరిత్ర అతనిది.
- 2021 ఏప్రిల్లో చాద్ రిపబ్లిక్‌లో కూడా అధ్యక్షుడు ఇద్రిస్ డెబీ ఇట్నో మృతి కారణంగా అనిశ్చితి ఏర్పడటంతో సైన్యం జోక్యం చేసుకుంది. అయితే, ఆయన కుమారుడే అధికార పగ్గాలు చేపట్టేలా చక్రం తిప్పి రంగం నుంచి తప్పుకుంది. పాలనపై తమ ఆధిపత్యాన్ని మాత్రం నిర్నిరోధంగా కొనసాగిస్తూనే ఉంది!

ఆఫ్రికాలోనే ఎందుకిలా?

కేవలం గత మూడేళ్లలో ఆఫ్రికాలో కనీసం 5 దేశాల్లో సైనిక కుట్రలు జరిగాయి. ఇందుకు పలు కారణాలు కనిపిస్తాయి కూడా...

- సంప్రదాయ పాలక వర్గపు మితిమీరిన అవినీతి, ఆశ్రిత పక్షపాతం తదితర పోకడలతో ఆఫ్రికా యువత తీవ్రంగా విసి గిపోయింది.
- అదే సమయంలో ఇటు జనాదరణలోనూ, అటు ఆర్థికంగా కూడా ఆయా ప్రభుత్వాలు బలహీనపడుతూ వచ్చాయి. ఈ పరిస్థితిని సైనిక పెద్దలు అవకాశంగా మలచుకున్నారు
- ప్రజల్లో, ముఖ్యంగా పట్టణ ప్రాంత యువతలో అధికార పార్టీల పట్ల ఉన్న ఏహ్య భావాన్ని తమకు అనుకూలంగా మలుచుకున్నారు.

...అందుకే ఆఫ్రికా యువతలో అసంతృప్తి!

ఆఫ్రికా యువతలో ప్రజాస్వామిక ప్రభుత్వాల పట్ల నెలకొన్న తీవ్ర అసంతృప్తికి కారణాలు లేకపోలేదు...

- ఉపాధి అవకాశాల లేమి
- పెచ్చరిల్లిన అవినీతి
- అధిక వర్గాల్లోనూ వారి మితిమీరిన ఆశ్రిత పక్షపాతం
- ఈ దేశాల్లో చాలావరకు మాజీ ఫ్రెంచి వలస రాజ్యాలే. దాంతో వాటిపై ఇప్పటికీ చాలా విషయాల్లో ఫ్రాన్స్ ప్రభావం కొనసాగుతోంది. ఇది కూడా యువతకు మింగుడు పడడం లేదు.
- ఎలాగైనా అధికారాన్ని నిలుపుకోవడానికి పాలక పార్టీలు చేస్తున్న అక్రమాలతో జనం మరింతగా విసిగిపోయారు.

దశాబ్దాలుగా బొంగోల రాజ్యమే!

గాబన్‌పై బొంగో కుటుంబం ఒకరకంగా అర్ధ శతాబ్దానికి పైగా గుత్తాధిపత్యం చెలాయించిందనే చెప్పాలి.

- అలీ బొంగో 14 ఏళ్లుగా అధ్యక్షునిగా కొనసాగుతున్నారు! ఇది ఆయనకు మూడో టర్మ్. 2018లోనే స్ట్రోక్‌కు గురైనా అధికారాన్ని మాత్రం వీడలేదు.
- అయితే దేశాన్ని ఆధునీకరణ బాట పట్టించేందుకు ఆయన ప్రయత్నాలు చేయకపోలేదు. కానీ జనం ఆకాంక్షలను నెరవేర్చేందుకు అవి సరిపోలేదు.
- అలీ తండ్రి ఒమర్ బొంగో అయితే ఏకంగా 40 ఏళ్లకు పైగా నియంతలా దేశాన్ని పాలించారు! 2009లో ఆయన మరణానంతరం జరిగిన ఎన్నికల్లో అలీ తనను తాను విజేతగా ప్రకటించుకున్నారు. కానీ నిజానికి విపక్ష నేత ఆంద్రే ఎంబా ఒబామే నెగ్గారని చెబుతారు.

\- నేషనల్ డెస్క్, సాక్షి

అతని ఆటోనే ఓ మినీ గార్డెన్

చెన్నైలో ఆటో డ్రైవర్ సృజన

అవడానికి అది ఓ చిన్న ఆటో మాత్రమే. కానీ అందులో ఏకంగా ఒక మినీ గార్డెన్‌నే సృష్టించాడతను. చెన్నైకి చెందిన కుబేందిరన్ అనే ఆటో డ్రైవర్ మది నుంచి పుట్టుకొచ్చిన ఈ సృజనాత్మక ఆలోచన నెటిజన్ల మది దోచుకుంటోంది. ఇంటర్నెట్ నిండా అతనిపై ప్రశంసల వర్షం కురుస్తోంది...

కుబేందిరన్. చెన్నైలోని దాదాపు లక్ష మంది ఆటో డ్రైవర్లలో ఒకడు. కానీ పర్యావరణం మీది ప్రేమ అతన్ని మిగతా వారికంటే ఎంతో ప్రత్యేకంగా నిలిపింది. దేశమంతటా అతని పేరు మారుమోగేలా చేసింది. రకరకాల మీనియేచర్ మొక్కలు తదితరాలతో ఆటోను కదిలే తోటగా తీర్చిదిద్దాడు. ముందు, వెనక సీట్ల మధ్య, వెనక వైపు, సీలింగ్ మీద మాత్రమే గాక సీలింగ్ లోపలి వైపు కూడా పచ్చని మొక్కలతో నింపి ఆకట్టుకుంటున్నాడు. ఆ ఆహ్లాదాన్ని అనుభవిస్తూ ప్రయాణికులు మైమరచిపోతున్నారు. అందుకే ఇప్పుడు కుబేందిరన్ ఆటోను చెన్నైవాసులు ప్రయాణించే పార్కుగా అభివర్ణిస్తూ మురిసిపోతున్నారు. అందులో ప్రయాణించిన వాళ్లు 'గ్రీన్ ఆటో', 'మూవింగ్ పార్క్', ఇంకా రకరకాలుగా ప్రశంసిస్తున్నారు. ఇంత చక్కని ఆలోచన చేసినందుకు అతన్ని ఎంతగానో మెచ్చుకుంటున్నారు కూడా.

మరెన్నో విశేషాలు: ఇది మాత్రమే కాదు, ఆటో ఎక్కే వారు చదువుకోవడం కోసం ఎన్నెన్నో స్ఫూర్తిదాయక పుస్తకాలు కూడా అందుబాటులో ఉంచాడు కుబేందిరన్. అంతేగాక వారికి స్వచ్ఛమైన చల్లని మంచినీరు కూడా ఇస్తాడు. వీటికి తోడు చక్కని సూక్తులు, నినాదాలతో కూడిన బ్యానర్లు కూడా ఆటో నిండా కనువిందు చేస్తుంటాయి. వాటిని తరచూ మారుస్తూ మరింత ఆకట్టుకుంటాడతను. రోడ్డు భద్రత గురించి కూడా అందరికీ వీలైనంత వరకూ అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నాడు. తనవంతు సామాజిక బాధ్యతను పరిపూర్ణంగా నెరవేరుస్తూ శెభాష్ అనిపించుకుంటున్నాడు.

\- నేషనల్ డెస్క్, సాక్షి

ఆటోపై రూఫ్ గార్డెన్

కొన్నాళ్ల క్రితం ఢిల్లీకి చెందిన మహేంద్ర కుమార్ అనే ఆటో డ్రైవర్ కూడా ఇలాగే తన ఆటో రూఫ్ టాప్ మీద గార్డెన్ పెంచి వార్తల్లో నిలిచాడు. ఈ గార్డెన్ 2020 నుంచీ అందరినీ అలరిస్తోంది. కుమార్‌తో పాటు అతని ఆటో ఎక్కేవాళ్లు కూడా మండే ఢిల్లీ ఎండల్లో కూడా చక్కని చల్లదనం అనుభవిస్తూ ప్రయాణిస్తూ ఉంటారు. అతన్నీ, అతని ఆటో రూఫ్ టాప్‌నూ అంతా ఎప్పుడు చూసినా ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ ఉంటారు!





రామ్‌నాథ్ కోవింద్‌తో న్యాయ శాఖ ఉన్నతాధికారుల భేటీ

న్యూఢిల్లీ: దేశంలో జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి, నివేదిక ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ చీఫ్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం న్యాయ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. కమిటీ ఎజెండాపై చర్చించారు. న్యాయ శాఖ కార్యదర్శి నితిన్ చంద్ర, శాసన కార్యదర్శి రీటా వశిష్ట తదితరులు కోవింద్‌ను కలిశారు. జమిలి ఎన్నికల విషయంలో అధ్యయనం చేయాల్సిన అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. చట్టపరమైన విషయాలపై చర్చించుకున్నారు. ఉన్నత స్థాయి కమిటీకి నితిన్ చంద్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'పై అధ్యయనం కోసం 8 మంది సభ్యులతో హైలెవెల్ కమిటీని నియమిస్తూ కేంద్రం శనివారం ఉత్తర్వు జారీ చేసిన సంగతి తెలిసిందే. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలను సైతం ఒకేసారి నిర్వహించాలనికేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

2047 నాటికి అభివృద్ధి భారత్

- 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్'.. ప్రపంచానికి మార్గదర్శి
- విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో అద్భుత ఫలితాలు సాధిస్తాం
- దేశంలో అవినీతి, కులతత్వం, మతతత్వానికి స్థానంలేదు.
- 'పీటీఐ' ఇంటర్వ్యూలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటన



న్యూఢిల్లీ: ప్రపంచ అభివృద్ధి 'జీడీపీ కేంద్రిత విధానం' నుంచి 'మానవ కేంద్రిత విధానం' వైపు మారాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. మన 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' మోడల్ ప్రపంచ సంక్షేమానికి ఒక మార్గదర్శిగా మారుతోందని స్పష్టం చేశారు. జీడీపీ పరిమాణంతో సంబంధం లేకుండా ప్రపంచంలో ప్రతి దేశానికీ ప్రాముఖ్యం ఉందని పేర్కొన్నారు. జీ20 శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ప్రధాని మోదీ తాజాగా వార్తా సంస్థ 'పీటీఐ'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఒక కొత్త ప్రపంచ క్రమం(వరల్డ్ ఆర్డర్) ఏర్పడిందని, కోవిడ్–19 తర్వాత మరో ప్రపంచ క్రమాన్ని చూస్తున్నామని చెప్పారు. మానవ కేంద్రిత అభివృద్ధి దిశగా ప్రపంచం పయనిస్తోందని, ఈ విషయంలో భారత్ ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని తెలిపారు. జీ20కి సారథ్యం వహిస్తున్న భారత్ ప్రపంచ దేశాల్లో విశ్వాసం అనే విత్తనాలు నాటిందని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే..

పేదరికంపై విజయం తథ్యం

''చాలా ఏళ్ల క్రితం భారత్‌ను 100 కోట్లకుపైగా ఆకలితో అలమటించే ఖాళీ కడుపులున్న దేశంగా భావించేవారు. కానీ, ఇప్పుడు 100 కోట్లకుపైగా ఆకాంక్షలతో కూడిన హృదయాలు, రెండు కోట్లకుపైగా నైపుణ్యం కలిగిన చేతులు, కోట్లాది యువత ఉన్నదేశంగా భారత్‌ను చూస్తున్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది. ఈ కాలమంతా ఒక మంచి అవకాశమే. గొప్ప అభివృద్ధికి పునాదులు వేసే అవకాశం ఈనాటి భారతీయులకు వచ్చింది. మనం సాధించే ప్రగతి రాబోయే వెయ్యేళ్లు గుర్తుండిపోతుంది. పేదరికంపై జరుగుతున్న యుద్ధంలో పేద ప్రజలు కచ్చితంగా విజయం సాధిస్తారు. విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించబోతున్నాం. దేశంలో అవినీతి, కులతత్వం, మతతత్వానికి ఎంతమాత్రం స్థానంలేదు. జీ20 కార్యక్రమాలను దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నిర్వహించడంలో వింతేమీ లేదే. అది సహజమే. భారత్ చాలా విశాలమైన, వైవిధ్యం కలిగిన దేశం. మన సొంత భూభాగంలో ఎక్కడైనా సదస్సులు నిర్వహించుకునే స్వేచ్ఛ మాకుంది. వాతావరణ మార్పులపై పోరాడే విషయంలో కేవలం ఒకే విధానం సరిపోదు. నిర్మాణాత్మక చర్యలుండాలి. వాతావరణ లక్ష్యాలను సాధించే విషయంలో ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోం. ఉగ్రవాద సంస్థలు టెక్నాలజీని విచ్చలవిడిగా వాడుకుంటున్నాయి. కార్యకలాపాల కోసం డార్క్ నెట్, మెటావెర్స్, క్రిప్టోకరెన్సీ వేదికలను ఉపయోగించుకుంటున్నాయి. సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాలి.

ప్రపంచ సమస్యలకు భారత్ పరిష్కారం

భారత్‌లో అమలవుతున్న మానవ కేంద్రిత అభివృద్ధి మోడల్‌ను ప్రపంచ దేశాలు గుర్తించి, అనుసరిస్తున్నాయి. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగుతున్నాం. మన దేశాన్ని గతంలో కేవలం ఒక పెద్ద మార్కెట్‌గానే పరిగణించేవారు. ఇప్పుడు ప్రపంచ దేశాల ఎదుర్కొంటున్న సమస్యలకు భారత్ పరిష్కార మార్గాలు చూపిస్తోంది. అప్పుల భారం అనేది అభివృద్ధి చెందుతున్న దేశాలకు పెద్ద ముప్పుగా మారుతోంది. ఉచిత పథకాలు అనేవి సరైన ఆలోచన కాదు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తేనే అభివృద్ధి వేగవంతమవుతుంది. ప్రపంచ పరిణామాలు మారిపోతున్నాయి. దానికి అనుగుణంగా ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఐక్యరాజ్యసమితిలో అన్ని దేశాల గొంతుకలకు ప్రాతినిధ్యం దక్కాలి. జీ20లో ఆఫ్రికన్ యూనియన్‌కు పూర్తిస్థాయి సభ్యత్వం కల్పించాలి. అందుకు మేము మద్దతు ఇస్తాం. అన్ని గొంతుకలను గుర్తించకుండా, ప్రాతినిధ్యం కల్పించకుండా.. ప్రపంచ భవిష్యత్తు కోసం చేపట్టే ఏ ప్రణాళిక కూడా సఫలం కాదు'' అని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

5న ఇండియా ఎంపీలతో ఖర్గే భేటీ

న్యూఢిల్లీ: రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఈ నెల 5న ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఢిల్లీ రాజాజీమార్గ్‌లోని ఖర్గే నివాసంలో ఈ భేటీ జరగనుంది. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రతిపక్షాలు అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో చర్చించే అవకాశముందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల ఎజెండాను కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు వెల్లడి చేయలేదు. కాగా, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆదివారం ఖర్గేను ఆయన నివాసంలో కలుసుకున్నారు. పార్టీ సంస్థాగత వ్యవహారాలతోపాటు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వారు చర్చించినట్లు సమాచారం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని దీటుగా ఎదుర్కొనే లక్ష్యంతో కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఇండియా పేరుతో కూటమిగా ఏర్పాటైన విషయం తెలిసిందే.

సమాఖ్య వ్యవస్థపై దాడి

'ఒకే దేశం–ఒకే ఎన్నిక'పై రాహుల్



న్యూఢిల్లీ: 'ఒక దేశం–ఒకే ఎన్నిక' ఆలోచనను దేశ సమాఖ్య వ్యవస్థ మీదా, దాని రాష్ట్రాలన్నింటి మీదా వికృత దాడిగా కాంగ్రెస్ సీనియర్ నేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ అభివర్ణించారు. 'ఇండియా అంటే భారత్, రాష్ట్రాల సమాఖ్య' అంటూ ఆదివారం ఎక్స్‌లో ఆయన వ్యాఖ్యానించారు. జమిలి ఎన్నికలపై సిఫార్సుల కోసం మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ సారథ్యంలో ఎనిమిది మంది సభ్యులతో కేంద్రం శనివారం కమిటీ వేయడం తెలిసిందే. కమిటీ సభ్యత్వాన్ని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌదరి అప్పటికప్పుడే నిరాకరించారు కూడా.

'జమిలి'తో సామాన్యులకు లాభమేంటి?



చండీగఢ్: 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' ప్రతిపాదనను తాము వ్యతిరేకిస్తున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. జమిలి ఎన్నికల వల్ల సామాన్య ప్రజలకు ఉపయోగం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం హరియాణాలోని భివానీలో ఎన్నికల ప్రచార సభలో కేజ్రీవాల్ ప్రసంగించారు. ఏదో ఒక రోజు బీజేపీని ఆమ్ ఆద్మీ పార్టీ దేశం నుంచి తుడిచిపెట్టేస్తుందని అన్నారు. ఒకే దేశం–ఒకే ఎన్నిక అవసరం లేదని, ఒకే దేశం–ఒకే విద్య కావాలని ఆకాంక్షించారు. ధనవంతులకు, పేదలకు ఒకేరకరమైన విద్య అందించాలన్నారు. ఒకే దేశం–100 ఎన్నికలు, ఒకే దేశం–1,000 ఎన్నికలు అయినా సామాన్య ప్రజలకు పెద్దగా తేడా ఏమీ ఉండదని స్పష్టం చేశారు. జమిలి ఎన్నికలు అవసరం లేదని తేల్చిచెప్పారు. ఉచిత పథకాలు అంటూ కొందరు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పేదలకు నాణ్యమైన విద్య, నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించడం నేరమా? పాపమా? అని ప్రశ్నించారు. హరియాణాలో బీజేపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని కేజ్రీవాల్ మండిపడ్డారు.

వలార్మతి గళం మూగబోయింది..



చెన్నై: దేశంలో 140 కోట్ల జనాభా ఉన్నా..కొందరి గొంతు మాత్రమే ప్రజల మనస్సుల్లో ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అలాంటి గుర్తుండిపోయే గొంతుక మేడమ్ వలార్మతిది. మన ఇస్రో ప్రయోగించిన పదుల సంఖ్యలో రాకెట్లకు కౌంట్‌డౌన్ చెప్పింది ఈమెనే. 1959లో తమిళనాడులోని అరియలూర్‌లో జన్మించిన వలార్మతి 1984లో ఇస్రోలో సైంటిస్ట్‌గా చేరారు. ఇస్రో ప్రయోగించిన రాకెట్‌లకు లాంఛింగ్ కౌంట్‌డౌన్ ఆమే చెప్పేవారు. ఇలా ఈమె విలక్షణమైన కంఠం దేశప్రజలకు సుపరిచితం. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరిట ఏర్పాటు చేసిన పురస్కారాన్ని మొదటిసారిగా 2015లో ఈమె అందుకున్నారు. చివరిసారిగా చంద్రయాన్–3 మిషన్ రాకెట్‌కు వలార్మతినే కౌంట్‌డౌన్ చెప్పడం విశేషం. ఇస్రో నుంచి రిటైరైన ఈమె శనివారం సాయంత్రం గుండెపోటుకు గురై చెన్నైలోని ఆస్పత్రిలో కన్నుమూశారు.

సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి

- సమానత్వానికి, సామాజిక న్యాయానికి అది వ్యతిరేకం
- తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు
- తీవ్రంగా మండిపడ్డ బీజేపీ



చెన్నై: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు సీఎం స్టాలిన్ కొడుకు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా వివాదాస్పదమయ్యాయి. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు మండిపడుతున్నారు. సనాతన ధర్మాన్ని ఆయన కరోనా వైరస్, మలేరియా, డెంగీ జ్వరం, దోమలతో పోల్చారు. ఇలాంటి వాటిని వ్యతిరేకించడం కాదు, నాశనం చేయాలన్నారు. శనివారం చెన్నైలో తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో ఉదయనిధి మాట్లాడారు. 'సనాతన్ అనేది సంస్కృత పదం. సనాతన్ అంటే ఏమిటి? ఇది శాశ్వతమైంది. అంటే మార్చేందుకు వీల్లేనిది. ఎవరూ ప్రశ్నించలేనిది. మతం, కులం ఆధారంగా ఇది ప్రజలను విడదీస్తుంది' అని ఉదయనిధి అన్నారు. 'సనాతన ధర్మం కారణంగా భర్త కోల్పోయిన మహిళలు నిప్పుల్లోకి నెట్టివేయబడ్డారు(గతంలో సతీసహగమనం). వితంతువులకు శిరోముండనం చేయించారు. తెల్ల చీరలు ధరింపజేశారు. బాల్య వివాహాలూ జరిగాయి. ద్రవిడ విధానంలో అటువంటి వాటిని లేకుండా చేశాం .వారికి ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నాం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన విశ్వకర్మ యోజన పథకం, 1953లో రాజగోపాలాచారి తీసుకువచ్చిన కులాధారిత విద్యా పథకం వంటిదే. డీఎంకే దీనిని గట్టిగా వ్యతిరేకిస్తుంది. వెనుకబడిన, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు నోచుకోరాదనే నీట్ వంటి వాటిని కేంద్రం తీసుకువచ్చింది. దీనిని మేం వ్యతిరేకిస్తున్నాం 'అని ఉదయనిధి చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సనాతనం ఓడాలి, ద్రావిడం గెలవాలి అని ఉదయనిధి అన్నారు. 'అన్ని కులాల వారు ఆలయాల్లో అర్చకత్వానికి అర్హులేనంటూ కరుణానిధి చట్టం తెచ్చారు. మన సీఎం స్టాలిన్ అర్చకత్వంలో శిక్షణ పొందిన వారిని ఆలయాల్లో పూజారులుగా నియమించారు. ఇదే ద్రవిడియన్ మోడల్' అని ఆయన చెప్పారు.

అది విద్వేష ప్రసంగం: బీజేపీ


సనాతన ధర్మాన్ని ఆచరించే 80% మందిని సామూహికంగా చంపేయాలంటూ ఉదయనిధి వ్యాఖ్యానించడం విద్వేష ప్రసంగమేనని బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ అన్నారు. మిత్ర పక్షం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఒకవైపు ప్రేమ దుకాణం తెరుద్దామని పిలుపునిస్తుండగా డీఎంకే వారసుడు సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటున్నారన్నారు. సామూహికహననం వ్యాఖ్యలపై కాంగ్రెస్ మౌనం మద్దతు నివ్వడమే అవుతుంది. పేరుకుతగ్గట్లే ఇండియా కూటమికి అధికారమిస్తే వేలాది సంవత్సరాల భారత సంస్కృతిని ధ్వంసం చేస్తుంది' అని పేర్కొన్నారు.

నేనలా అనలేదు: ఉదయనిధి

తన వ్యాఖ్యలపై చెలరేగిన విమర్శలపై ఉదయనిధి 'ఎక్స్'లో స్పందించారు. 'సనాతన ధర్మాన్ని నిర్మూలించడమంటే మానవత్వాన్ని, సమానత్వాన్ని సాధించడమే. సనాతన ధర్మం కారణంగా అణచివేతకు, నిర్లక్ష్యానికి గురైన వారి తరఫున మాట్లాడాను. నేను మాట్లాడిన ప్రతి మాటకు కట్టుబడి ఉన్నాను. సనాతన ధర్మాన్ని ఆచరించే వారిని సామూహికంగా హతమార్చాలని మాత్రం నేను అనలేదు. సమాజంపై సనాతన ధర్మం ఎటువంటి చెడు ప్రభావం చూపిందనే విషయంలో అంబేడ్కర్, పెరియార్ వంటి వారు అధ్యయనం చేసి రాసిన పుస్తకాల్లో ఏముందో చూపిస్తాను. ఎటువంటి సవాళ్లయినా ఎదుర్కోవడానికి నేను సిద్ధం'అని పేర్కొన్నారు.

ఓట్ల కోసమే సనాతన ధర్మాన్ని అవమానిస్తున్నారు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా



దుంగార్‌పూర్(రాజస్తాన్): సామాజిక న్యాయానికి, సమానత్వానికి సనాతన ధర్మం వ్యతిరేకమంటూ డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతూ ఈ విధమైన ఆరోపణలకు దిగుతున్నాయని మండిపడ్డారు. లష్కరే తోయిబా కంటే హిందుత్వ సంస్థలే మరింత ప్రమాదకరమంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ గతంలో చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. ఇలాంటివి వీరికి కొత్తకాదు, ఓట్ల కోసం ఎంతకైనా తెగిస్తారని పేర్కొన్నారు.

జీ20 నేతలకు మెనూ సిద్ధం

స్ట్రీట్ ఫుడ్, తృణధాన్యాల వంటకాలకు ప్రాధాన్యం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 9, 10వ తేదీల్లో జరిగే జీ20 శిఖరాగ్ర సదస్సుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సహా పలువురు ప్రపంచ దేశాల నేతలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఎన్నో పోషకాలతో నోరూరించే భారతీయ తృణధాన్యాల వంటకాల రుచిని వీరికి చూపించనున్నారు. భారత్ మంటపంలో జరుగుతున్న శిఖరాగ్రం ఏర్పాట్లను జీ20 స్పెషల్ సెక్రటరీ ముక్తేశ్ పర్దేశి ఆదివారం పీటీఐకి వివరించారు. 'మన దేశ స్ట్రీట్ ఫుడ్, ప్రాంతీయ, స్థానిక వంటకాలను వారికి సరికొత్త రీతిలో పరిచయం చేయనున్నాం. ఢిల్లీలోని చాందినీ చౌక్ తదితర ప్రాంతాల్లోని స్ట్రీట్ ఫుడ్‌కు ఎంతో పేరుంది. ఇక్కడ ఏర్పాటు చేయనున్న మీడియా సెంటర్‌లో భారతీయ స్ట్రీట్ ఫుడ్ రుచిని ఆస్వాదించొచ్చు'అని పర్దేశి వివరించారు. ప్రపంచదేశాల నేతల సతీమణుల కోసం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. 'నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్‌లో షాపింగ్ అనుభవంతో కూడిన భారతీయ ప్రసిద్ధ హస్తకళ వారసత్వంపై లైవ్ షోలు ఏర్పాటుచేశాం. నేతలు, ప్రతినిధులకిచ్చే బహుమతుల ఎంపికలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం'అని చెప్పారు. 'ప్రపంచ నాయకులకిచ్చే బహుమతులు గౌరవభావాన్ని పెంచేలా, వారి మనస్సును ఆకట్టుకునేలా ఉండాలని ప్రధాని చెప్పారు. ఆ మేరకు తివాచీలు, హస్తకళల వస్తువులు, పెయింటింగ్‌ల వంటి వాటితో జాగ్రత్తగా తయారు చేసిన జాబితాను అందజేశాం'అని తెలిపారు. శిఖరాగ్రానికి వివిధ దేశాల నుంచి 10 వేల మందికి పైగా తరలిరానున్నారని పర్దేశి చెప్పారు. 'శిఖరాగ్రంలో చివరి సెషన్‌లో జీ20 తదుపరి అధ్యక్ష హోదాలో బ్రెజిల్ లాంఛనప్రాయంగా బాధ్యతలను చేపడుతుంది. నవంబర్ 30వ తేదీన ప్రధాని బ్రెజిల్‌కు వెళ్లి బాధ్యతలను అప్పగించే అవకాశం లేకపోవడంతో ఈ మేరకు నిర్ణయించారు'అని పర్దేశి చెప్పారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



అనుక్షణం..అప్రమత్తం..
వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. -8లో



లారీకి ముందు కారులో పైలెటింగ్
నిఘాను తప్పించుకోవడానికి గంజాయి తరలిస్తున్న లారీకి ముందు కారులో ముఠా సభ్యులు అడ్వాన్స్ పైలెటింగ్ చేస్తున్నట్లు గుర్తించామని ఎస్పీ డి.సునీతారెడ్డి వెల్లడించారు. -8లో

..ఉసురు తగలడం ఖాయం



కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మహిళాభ్యుదయమే ధ్యేయంగా పనిచేస్తుండగా, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఉందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. -8లో

న్యూస్‌రీల్

సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాలను నమ్మొద్దు



బంజారాహిల్స్: సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారాలను నమ్మవద్దని... వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. ఈ నెలలో వచ్చే వినాయక చవితి పర్వదినం, మిలాద్ ఉన్ నబీ పండగ ఊరేగింపు ఉన్న నేపథ్యంలో ఆదివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నగరానికి చెందిన 500 మంది పీస్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పండగలు, ఊరేగింపులు నిర్వహించుకోవాలని ఇందుకు పీస్ కమిటీలు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. పీస్ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉంటే శాంతి భద్రతలు పరిఢవిల్లుతాయన్నారు. నగర శాంతి భద్రతలు, ప్రతిష్ఠలను దృష్టిలో పెట్టుకొని పీస్ కమిటీ సభ్యులు నిరంతరం సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పీస్ కమిటీ చైర్మన్, అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, అదనపు కమిషనర్ విశ్వ ప్రసాద్, కృష్ణశర్మ, తదితరులు పాల్గొన్నారు.

గొడవ పడొద్దన్నందుకు..

భర్త పళ్లు రాలగొట్టిన భార్య

అమీర్‌పేట: తన తల్లితో గొడవ పడొద్దని భార్యను మందలించడంతో భర్త పళ్లు విరగ్గొట్టిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసే దీపక్‌కుమార్ భార్య నీల దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి బాపూనగర్‌లో ఉంటున్నారు. దీపక్ తల్లి రాణీబాయి వీరితో పాటే ఉంటోంది. నీల తరచూ అత్తతో గొడవ పడుతుండేది. ఈ క్రమంలో ఆదివారం మరోసారి గొడవ జరిగింది. గొడవ పడకుండా తన తల్లిని మంచిగా చూసుకోవాలని భార్యను దీపక్ మందలించాడు. దీంతో నీల ఆగ్రహంతో ఊగిపోతూ దీపక్ ముఖంపై పిడిగుద్దుల వర్షం కురిపించడంతో అతడి రెండు పళ్లు విరిగిపోయాయి. దీపక్ ఫిర్యాదు మేరకు నీలపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



నగరాన వాన



అత్తాపూర్‌లో..


నగరంలో వర్షం దంచి కొట్టింది. ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. రోడ్లపై వరదనీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అత్యధికంగా బోరబండలో 8.8, మూసాపేటలో 7.7, జూబ్లీహిల్స్‌లో 7.4 గచ్చిబౌలిలో 6.2, మాదాపూర్‌లో 6.0, బంజారాహిల్స్‌లో 5.4, షేక్‌పేట్‌లో 5.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. యూసుఫ్‌గూడ, ఖాజాగూడ, బాలనగర్, వెంకటేశ్వర కాలనీ, వివేకానందకాలనీ, మారేడుపల్లి, రాజేంద్రనగర్, సికింద్రాబాద్, ఫిల్మ్‌నగర్, బన్సీలాల్ పేట, ఆసిఫ్‌నగర్, శ్రీనగర్ ప్రాంతాల్లో 4 నుంచి 5 మేర సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. ఆదివారం ఉదయం 10 గంటల వరకు ముసురు వాన పడింది.
– సాక్షి, సిటీబ్యూరో



గచ్చిబౌలిలో..

భద్రతపై బాధ్యతగా..

- గ్రేటర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు పోలీసుల కసరత్తు
- క్షేత్ర స్థాయిలో పోలింగ్ బూత్‌ల పరిశీలన
- ఆయా ప్రాంతాల్లోని కెమెరాల పనితీరుపై విశ్లేషణ
- పాత నేరస్తులు, రౌడీల కార్యకలాపాలపై ఆరా
- గత ఎన్నికల్లో కేసులు నమోదైనవారిపై ఫోకస్
- బైండోవర్లు, ఆయుధాలు సరెండర్ చేసేలా కార్యాచరణ



సాక్షి, సిటీబ్యూరో: రోజురోజుకూ అసెంబ్లీ ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. దీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్న అధికారులను ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు బదిలీ చేసిన పోలీసు శాఖ.. క్రమంగా క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగుతోంది. గత ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్ల ప్రాంతాలను, సీసీ కెమెరాల పని తీరును పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం మూడు కమిషనరేట్ల ఉన్నతాధికారులు వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. గత ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో చోటుచేసుకున్న సంఘటనలు, కేసుల వివరాలను విశ్లేషిస్తున్నారు. వీటి ఆధారంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి వ్యూహంతో ముందుకెళ్లాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా వివిధ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థుల వివరాలను తెలుసుకుంటున్నారు. మరోవైపు పాత నేరస్తులు, రౌడీలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని స్థానిక పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రెండు రకాల విధులు..

నామినేషన్ల మొదలు, ఓట్ల లెక్కింపు వరకు పూర్తి స్థాయి భద్రతను కల్పించాల్సిన బాధ్యత పోలీసు శాఖదే. ఒకవైపు శాంతి భద్రతల విధులు నిర్వర్తిస్తూనే, మరోవైపు ఎన్నికల బందోబస్తుకు సంబంధించిన కార్యాచరణ రూపొందిస్తున్నారు. దీంతో ఇప్పటి నుంచే పోలీసులపై పని ఒత్తిడి మొదలైంది. గత ఎన్నికల నిర్వహణ జాబితా ఆధారంగా పోలీసు స్టేషన్ల వారీగా అన్ని కమిషనరేట్ల పరిధిలో ఎన్ని పోలింగ్ బూత్‌లు ఉన్నాయి? వాటిలో ఎన్ని సమస్యాత్మకమైనవి? వంటి వివరాలను విశ్లేషిస్తున్నారు. సమస్యాత్మక స్టేషన్లలో ఎన్నికలకు ఇబ్బంది కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. పోలింగ్ స్టేషన్లలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు.

బైండోవర్లు, సరెండర్లు..

గత ఎన్నికలలో పోలీసు విధులకు ఆటంకం కలిగించిన, కేసులు నమోదైన వారి వివరాలను స్టేషన్ల వారీగా పోలీసులు సేకరిస్తున్నారు. ఈసారి ఎన్నికలలో ఎలాంటి ఇబ్బందులు కలగజేయకుండా ముందుగానే వీరందరినీ బైండోవర్ చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లను స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. దీంతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలపై నమోదైన కేసుల వివరాలను ఎన్నికల కమిషన్ ముందు ఉంచేలా ప్రణాళికలు చేస్తున్నారు. దీంతో పాటు పోలీసు స్టేషన్ల పరిధిలో ఆయుధాలు లైసెన్స్ కలిగి ఉన్న వారిపై పోలీసులు నిఘా పెట్టారు. వారిని స్టేషన్లకు పిలిపించి మాట్లాడుతున్నారు. ఎన్నికలు ముగిసే వరకూ ఆయుధాలను స్టేషన్‌లో సరెండర్ చేసేలా త్వరలోనే ఆదేశాలు జారీ చేయనున్నారు. త్వరలోనే ఆయుధాలు కలిగిన వారితో సమావేశం నిర్వహించి, రాతపూర్వక నోటీసులు జారీ చేయనున్నారు.

బీఆర్ఎస్ టికెట్ ఎవరికో?
- గోషామహల్‌లో పోటాపోటీ
- వివిధ వర్గాల డిమాండ్లు

లోకల్ X సెటిలర్స్

సాక్షి, సిటీబ్యూరో: అధికార బీఆర్ఎస్ సస్పెన్స్‌లో ఉంచిన గోషామహల్ టికెట్ కోసం ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేది మళ్లీ తానేనని రాజాసింగ్ పునరుద్ఘాటించడంతో అధికార బీఆర్ఎస్ టికెట్ ఎవరికి కేటాయించనుందనే ఉత్కంఠను రేపుతోంది. లోకల్, సెటిలర్స్ (ఇక్కడే వ్యాపారాల్లో స్థిరపడిన నార్త్ ఇండియన్స్) వర్గాలుగా టికెట్ తమకంటే తమకివ్వాలని డిమాండ్లు పెరుగుతున్నాయి. మరోవైపు, సెటిలర్స్ అయిన నార్త్ ఇండియన్లలోనూ రెండు వర్గాలు వేటికవిగా తమ వర్గానికి టికెట్ కేటాయించాలని కోరుతున్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్‌కు టికెట్ ఖాయమైనట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సెటిలర్లకు కాకుండా స్థానికులమైన తమకు కేటాయించాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, ఆశిష్‌కుమార్ యాదవ్ తదితరులు కోరుతున్నారు. మరోవైపు, నార్త్ ఇండియన్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో వారికిస్తేనే గెలుస్తారనే అభిప్రాయాలున్నప్పటికీ, వారిలోనూ మార్వాడీలకు బదులుగా తమ వర్గానికి టికెట్లివ్వాల్సిందిగా మరాఠీలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో రెండు పర్యాయాలు మార్వాడీలకిచ్చినా గెలవకపోవడాన్ని వారీ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. మార్వాడీ వర్గాలు కూడా తమకే టికెట్ ఇవ్వాలని, గతంలో ఓడినా ఈసారి సత్తా చూపుతామంటున్నాయి.

మరాఠీలకివ్వాలి

టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌గా మారి జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేందుకు కృషి చేస్తున్న తరుణంలో మరాఠీలకు తగిన ప్రాధాన్యమిస్తే రాష్ట్రంలో, దేశంలో రెండు విధాలా ప్రయోజనముంటుందని మరాఠీ నేతలు చెబుతున్నారు. ఎంతో కాలంగా ఇక్కడే స్థిరపడి వ్యాపారాల నిర్వహణతో పాటు రాజకీయాల్లోనూ చురుగ్గా ఉన్న తమ వారికి టికెట్ ఇస్తే పార్టీ గెలుస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తమ సామాజికవర్గానికి చెందిన దిలీప్ ఘనాటేకు ఇవ్వాలంటూ మరాఠీ సంఘాల నేతలు ఆయన సుదీర్ఘ రాజకీయ నేపథ్యాన్ని వివరిస్తూ బీఆర్ఎస్ ముఖ్యులను, కొందరు మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశారు. గోషామహల్‌గా మారక ముందు మహరాజ్‌గంజ్ నియోజకవర్గంగా ఉన్నప్పుడు 1989లో అసెంబ్లీ ఎన్నికల్లో ప్రముఖ నేతలు బండారు దత్తాత్రేయ, ముఖేశ్‌గౌడ్‌లపై పోటీ చేసిన చరిత్ర ఆయనకు ఉందని చెబుతున్నారు. మార్వాడీ సామాజిక వర్గానికి చెందిన నందకిశోర్‌వ్యాస్‌ను దృష్టిలో ఉంచుకొని వారు తమ ప్రయత్నాలు చేస్తున్నారు.

13 నియోజకవర్గాలపై ప్రభావం

- రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మరాఠీలకు కనీసం ఒక్క సీటు కేటాయించినా అది ఎంతో ప్రభావం చూపుతుందని వివరిస్తున్నారు. గోషామహల్ నియోజకవర్గంలో వారి ఓట్లు ఎక్కువగా ఉన్నందున ఆ నియోజకవర్గాన్ని కేటాయించాలంటున్నారు. మరాఠీలు అధిక సంఖ్యలో ఉన్న రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లోని 13 నియోజక వర్గాలతో పాటు మహారాష్ట్రలో కూడా పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఆదిలాబాద్, బోధన్, నిర్మల్, ముథోల్, బాన్సువాడ, జుక్కల్, బోథ్, నారాయణ్ ఖేడ్, ఆందోల్, జహీరాబాద్ లతో పాటు తాండూరు, కొడంగల్ నారాయణ్‌పేట నియోజకవర్గాల్లో మరాఠీ మాట్లాడే వారు ఎక్కువగా ఉన్నారంటున్నారు.
- నగరంలో నిజాం కాలం నుంచీ ఉన్న మహారాష్ట్రకు చెందిన మరాఠీల ఓట్లు గోషామహల్ నియోజకవర్గంలో 25వేలకు పైగా ఉన్నాయని, గత అసెంబ్లీ ఎన్నికల్లో రాజాసింగ్ గెలుపులోనూ అవి కీలక పాత్ర పోషించాయని చెబుతున్నారు. తమ వారు లేనందున మహారాష్ట్రీయులు యూపీకి చెందిన రాజాసింగ్‌కు ఓట్లేశారని పేర్కొంటున్నారు. గతంలో మహరాజ్‌గంజ్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన గడ్డం రామస్వామి తమవాడేనంటున్నారు. ఇలా నేటివ్స్, సెటిలర్స్‌గా.. సెటిలర్స్‌లో మార్వాడీలు, మరాఠీలుగా ఎవరికి వారు తమకే టికెట్ కావాలని కోరుతున్నారు. మహారాష్ట్రలో విస్తరించేందుకు కృషి చేస్తున్న బీఆర్ఎస్ ఇక్కడి మరాఠీలకు టిక్కెట్ ఇస్తే.. మహారాష్ట్రలోనూ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామంటున్నారు. అక్కడ ఎదగాలనుకుంటున్న పార్టీ ఇక్కడ కూడా తమకు తగిన గుర్తింపు ఇవ్వాల్సిందిగా పార్టీనేతలకు విజ్ఞప్తులు చేస్తున్నారు. ఇంతకీ.. బీఆర్ఎస్ మదిలో ఏముందో, ఎవరికి టిక్కెట్ కేటాయించనుందో తెలిసేందుకు సమయం పట్టనుంది.

తప్పని పడిగాపులు

- ఎల్ఆర్ఎస్‌లో కనిపించని పురోగతి
- సిబ్బంది కొరతతో ముందుకు సాగని దరఖాస్తుల పరిశీలన
- పెండింగ్‌లో 3 లక్షలకుపైగా అర్జీలు
- అక్టోబర్ నాటికి కదలిక వచ్చే అవకాశం



సాక్షి, సిటీబ్యూరో: అక్రమ స్థలాల క్రమబద్ధీకరణపై ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేకుండాపోయింది. లక్షలాది మంది దరఖాస్తుదారులు తమ స్థలాల క్రమబద్ధీకరణ కోసం పడిగాపులు కాస్తున్నారు. హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగంలో సిబ్బంది కొరత కారణంగా దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియల్లో తీవ్రమైన జాప్యం చోటుచేసుకుంటోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్థలాలను కొనుగోలు చేసిన వారు ఎల్ఆర్ఎస్ పొందేందుకు ప్రభుత్వం మూడేళ్ల క్రితం అవకాశం కల్పించింది. దీంతో సుమారు 3 లక్షల మందికిపైగా స్థలాల యజమానులు 2020లో రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో ఎల్ఆర్ఎస్ జారీ అధికారాన్ని ప్రభుత్వం హెచ్ఎండీఏ నుంచి కలెక్టర్లకు అప్పగించింది. కానీ వివిధ కారణాలతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇటీవల ఎల్ఆర్ఎస్ జారీ అధికారాన్ని ప్రభుత్వం కలెక్టర్ల నుంచి తిరిగి హెచ్ఎండీఏకు అప్పగించింది. అంతేకుండా అప్పట్లో దరఖాస్తు చేసుకున్నవారికి ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ పథకం కింద రెగ్యులరైజ్ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అప్పట్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ నుంచి హెచ్ఎండీఏకు దరఖాస్తులు, సాంకేతిక వ్యవస్థ బదిలీ అయ్యాయి.హెచ్ఎండీఏ పరిధిలోని ఘట్కేసర్, మేడ్చల్, శంషాబాద్, శంకర్‌పల్లి జోన్‌లకు చెందిన దరఖాస్తులను పరిశీలించి నిబంధనలకనుగుణంగా ఎల్ఆర్ఎస్ అందజేయాల్సి ఉండగా హెచ్ఎండీఏ ప్రణాళికా విభాగంలో సిబ్బంది కొరత కారణంగా ఇప్పట్లో రెగ్యులరైజ్ చేయడం సాధ్యం కాకపోవచ్చని అధికారులు చెబుతున్నారు.

గుట్టలుగా ఫైళ్లు..

- హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగంలో ఫైళ్ల గుట్టలు కొద్దీ పేరుకుపోతున్నాయి. సకాలంలో పరిష్కారానికి నోచుకోవడం లేదు.ఈ క్రమంలో అదనంగా వచ్చిపడిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు మరింత గుదిబండగా మారాయని ఒక అధికారి వివరించారు. సహాయ ప్లానింగ్ అధికారులు, జేపీఓలు, ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది తగిన సంఖ్యలో అందుబాటులో లేకపోవడంతో ఫైళ్లు ముందుకు సాగడం లేదని చెప్పారు. నాలుగు జోన్‌ల పరిధిలో కనీసం 100 మంది సిబ్బంది ఇప్పటికిప్పుడు అవసరం కాగా, ప్రస్తుతం కేవలం 20 మందే అన్ని జోన్‌లలో పని చేస్తున్నారు. దీంతో ఫైళ్ల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకుంటోంది.
- లక్షల్లో ఉన్న ఎల్ఆర్ఎస్ ఫైళ్లకు ఇది మరింత ఆటంకంగా మారింది. మొదటిదశలో ఎకరానికి పైగా ఉన్న వెంచర్‌లలో మిగిలిపోయిన ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో హెచ్ఎండీఏ పరిధిలోని మేడ్చల్, ఘట్‌కేసర్, శంషాబాద్, చేవెళ్ల జోన్ల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఎల్ఆర్ఎస్‌కు అయ్యే ఖర్చులను కూడా చెల్లించిన వందలాది మంది ప్రొసీడింగ్స్ కోసం ఎదురు చూస్తుండగా, చిన్న ప్లాట్ల క్రమబద్ధీకరణ మరింత ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. దీంతో లక్షలాది మంది దరఖాస్తుదారులు పడిగాపులు కాస్తున్నారు. త్వరలో న్యాక్ నుంచి 80 మంది సిబ్బందిని హెచ్ఎండీఏకు అప్పగించే అవకాశం ఉందని, వారంతా విధుల్లో చేరిన తర్వాత మాత్రమే ఎల్ఆర్ఎస్ పథకం ముందుకు కదులుతుందని ఒక అధికారి చెప్పారు. అందుకు అక్టోబర్ లేదా నవంబర్ వరకు సమయం పట్టవచ్చని పేర్కొన్నారు.

సరైన డాక్యుమెంట్లు లేవు...

అప్పట్లో దరఖాస్తు చేసుకున్న చాలా మంది సరైన డాక్యుమెంట్లను జత చేయకపోవడంతోనూ జాప్యం నెలకొంటోంది. ప్లాట్ రిజిస్ట్రేషన్ పత్రాల్లో కేవలం మొదటి పేజీని జత చేసి దరఖాస్తు చేశారు. మొత్తం డాక్యుమెంట్లు, లే అవుట్లు లేవు. దీంతో ఇప్పటి వరకు పరిశీలించిన దరఖాస్తులపై షార్ట్‌ఫాల్స్ ఇస్తున్నట్లు అధికారులు చెప్పారు. సంబంధిత ప్లాట్ యజమానులు సరైన డాక్యుమెంట్లతో అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



కాచిగూడ: ఓటరుగా పేరు నమోదు చేసుకోవడం, ఓటుహక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. 'మేరా బూత్, సబ్‌సే మజ్‌బూత్'లో భాగంగా ఆదివారం కాచిగూడ డివిజన్ భూమన్నలేన్‌లోని పోలింగ్‌బూత్‌లో 'ఓటరు వెరిఫికేషన్ అండ్ ఎన్‌రోల్‌మెంట్'లో కిషన్‌రెడ్డి పాల్గొని స్థానిక ఓటర్లకు ఎన్‌రోల్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకుని దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసేందుకు యువత ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదుకు సంబంధిత దరఖాస్తు ఫారాలు, అడ్రస్ మార్పు, యువ ఓటర్ల నమోదు తదితర సేవలను వినియోగించుకోవచ్చన్నారు. ఓటరు నమోదు పూర్తయిన తర్వాత వివరాలు సరిగా ఉన్నాయో లేదో ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలని సూచించారు. ఓటరు పరిశీలన పక్కాగా ఉండాలని ఆయన అధికారులకు సూచించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కన్నెరమేష్‌యాదవ్, ఎ.సూర్యప్రకాష్‌సింగ్, ఎస్.అరవింద్, సుభాష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లో 16 చెట్లు కూలాయి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కురిసిన వర్షానికి వివిధ ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. నీటి నిల్వలు చేరాయి. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు 16 ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. మరో 16 ప్రాంతాల్లో నీటి నిల్వలు చేరి రాకపోకలకు అంతరాయం కలిగింది. వీటితో పాటు రెండు అగ్ని ప్రమాదాలు కూడా జరిగినట్లు జీహెచ్ఎంసీ ఈవీడీఎం ఆర్‌డీఎఫ్ విభాగానికి ఫిర్యాదులందడంతో ఒక్క చోట నీటి నిల్వ తప్ప మిగతావన్నీ పరిష్కరించినట్లు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

నవ్యాలోచనే నాందిగా..

- డబుల్ బెడ్రూం ఇళ్ల 'డ్రా పద్ధతి'పై హైదరాబాద్ కలెక్టర్ ముద్ర
- ర్యాండమైజేషన్ 'సాఫ్ట్‌వేర్' రూపకర్త అనుదీప్ దురిశెట్టి
- లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల కేటాయింపు సైతం ఈ పద్ధతిలోనే..



సాక్షి, సిటీబ్యూరో: డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, కేటాయింపు 'డ్రా పద్ధతి'పై హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనదైన శైలిలో ప్రత్యేకతను ప్రదర్శించారు. దేశంలోనే తొలిసారిగా సరికొత్త ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ విధానం ద్వారా లబ్ధిదారుల ఎంపిక, కేటాయింపు ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు. రాజస్థాన్ బిట్స్ పిలానీ ఐఐటీ, సివిల్స్ టాపర్ అయిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ అధికారుల సహకారంతో ఆధునిక సాంకేతికతతో కూడిన ప్రత్యేక ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఈ విధానాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. హైదరాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఆమోదం లభించింది.

ప్రత్యేక డిస్‌ప్లే స్క్రీన్ ద్వారా..

గత నెల 24న హైదరాబాద్ కలెక్టరేట్‌లో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్ రాస్, మేడ్చల్ కలెక్టర్ అమయ్‌కుమార్ సమక్షంలో ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ పద్ధతిలో జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రత్యేక ఆన్‌లైన్ డిస్‌ప్లే స్క్రీన్ ద్వారా అర్హత సాధించిన దరఖాస్తుల జాబితా, ఆ తర్వాత ర్యాండమైజేషన్ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక నిర్వహించి తుది జాబితా ప్రదర్శించారు. లబ్ధిదారు పేరు, ఆధార్, ఫోన్ నంబర్లు ప్రదర్శించేలా పారదర్శకత పాటించారు. కేవలం 30 నిమిషాల్లోనే లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. హైదరాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా లబ్ధిదారుల ఎంపిక విజయవంతం కావడంతో ఆ తర్వాత మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలో సైతం ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ పద్ధతిలోనే లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేశారు.

ఇళ్ల కేటాయింపు సైతం

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు చెందిన 24 అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన లబ్ధిదారులకు ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ పద్ధతిలోనే ఎంపికైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. నగర శివారులోని ఎనిమిది ప్రదేశాల్లో నిర్మించిన డబుల్‌బెడ్రూం నివాస సముదాయాల్లో సుమారు 11,700 మంది లబ్ధిదారులకు ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ పద్ధతిలో ఇళ్లను కేటాయించారు. డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా, సునాయాసంగా జరిగేలా ఆధునిక సాంకేతికతతో కూడిన ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిన హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మంత్రులు, ఎమ్మెల్యేలు అభినందించారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఉదయం దుబాయ్ నుంచి ఇండిగో విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడి కదలికలను అనుమానించి అతడి లగేజీని తనిఖీ చేశారు. అందులో ఉన్న మిక్సర్ విప్పి చూడగా 819 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ రూ.49.79 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సీడ్ గణపతికి జై
కేపీహెచ్‌బీ ఫేజ్- 6లోని నెక్సెస్ హైదరాబాద్ మాల్‌లో ఆదివారం 'గ్రీన్ ఇండియా చాలెంజ్' ఆధ్వర్యంలో చిన్నారులకు ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ 'సీడ్ గణేష్ ప్రతిమలను' అందించారు.

వృద్ధురాలి మెడలో గొలుసు స్నాచింగ్

సైదాబాద్: రహదారి పక్కన నిలబడి కారు కోసం ఎదురు చూస్తున్న వృద్ధురాలి మెడలోనుంచి గుర్తు తెలియని వ్యక్తి గొలుసు లాక్కెళ్లిన సంఘటన సైదాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బ్రహ్మానందం కాలనీకి చెందిన కుసుమ హస్తినాపురంలో ఉంటున్న బంధువుల ఫంక్షన్‌కు వెళ్లేందుకు శనివారం స్థానిక మినర్వా ఫంక్షన్‌హాల్ వద్ద నిలబడి కారు కోసం ఎదురు చూస్తోంది. అదే సమయంలో హెల్మెట్ ధరించి రాంగ్ రూట్‌లో బైక్‌పై వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని 5 తులాల బంగారు గొలుసు లాక్కుని సాగర్ రోడ్డు వైపు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య

ఉప్పల్: కుటుంబ సమస్యల కారణంగా ఓ లారీ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకానగర్ ప్రాంతానికి చెందిన గొల్ల కుమార స్వామి(45) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన అతను భార్యతో గొడవ పడ్డాడు. ఆ తర్వాత అతను గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. దీంతో అనుమానం వచ్చిన అతడి భార్య కిటికీలో నుంచి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో అతడిని కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుక్షణం..అప్రమత్తం..

- గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు
- 18న వినాయకచవితి, 28న నిమజ్జనం
- ఇన్సిడెంట్ ఫ్రీగా వేడుకలను జరుపుకోవాలి
- బందోబస్తుపై సైబరాబాద్ సీపీ సమీక్ష





సమావేశానికి హాజరైన అధికారులు, మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లపై ఆదివారం సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు అన్ని మతాలకు చెందిన పండుగలు, వేడుకలు ఇతర కార్యక్రమాలు సాఫీగా జరిగాయన్నారు. ఈ సారి గణేష్ నిమజ్జనం 28న జరగనుందని, అయితే అదే రోజు (28, 29) మిలాద్- ఉన్-నబీ వేడుకలు జరగనున్నందున ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంవత్సరంలో జరుపుకునే అతి పెద్దదైన గణేష్ వేడుకలను 'ఇన్సిడెంట్ ఫ్రీగా' నిర్వహించాలన్నారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన విషయంలో నిర్వాహకులతో ఇన్‌స్పెక్టర్లు ముందుగానే సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని పౌర విభాగాలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణ, భద్రతపై వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వదంతులను ప్రజలు నమ్మవద్దన్నారు. సోషల్ మీడియా పోస్టులపై నిఘా ఉంచామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనానికి వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలన్నారు. సీసీటీవీలను నిరంతరం పర్యవేక్షించాలని, విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు., సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలన్నారు. మండపాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేను ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. నిబంధనలపై మండపం నిర్వాహకులు, కమిటీలకు ఎస్‌హెచ్‌ఓలు వివరించి చెప్పాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు, కమిటీ వివరాలు, మండపాల బాధ్యుల ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండపం వద్ద విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద సమస్యలు, ఘర్షణలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని, సమస్యాత్మక ప్రాంతాలను పోలీసు అధికారులు సందర్శించడంతో పాటు ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేయాలన్నారు. గణేష్ శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు, స్విమ్మర్స్, క్రేన్లు, లైటింగ్, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుపై సంబంధిత శాఖల సమన్వయం చేసుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా జీహెచ్‌ఎంసీ అధికారులు ముందుగానే చెరువులు, బేబీ పాండ్స్‌లను సిద్ధం చేయాలన్నారు. రహదారుల మరమ్మతుకు రోడ్లు భవనాల శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం గణేష్ నిమజ్జనం జరిగే చెరువుల వద్ద టెంట్లు, విద్యుత్ లైట్లను, బారికేడ్లను నిర్మించాలని, మంచి నీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్లు, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సైబరాబాబాద్ జాయింట్ సీపీ నారాయణనాయక్, డీసీపీలు కల్మేశ్వర్‌సింగెన్వర్, హర్షవర్ధన్, రితిరాజ్, సందీప్, నారాయణరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరావు, షబ్బరీష్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సంపులో పడి బాలుడి మృతి



సాయిచరణ్ (ఫైల్)



సాయిచరణ్ మృతదేహం

జవహర్‌నగర్: సంపులో పడి ఓ బాలుడు (11 నెలలు) మృతి చెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్ బీరప్పగడ్డలో నివసించే హుసెనప్ప, శ్రీదేవి దంపతులు కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఓ కుమారుడు సాయిచరణ్ (11 నెలలు). ఆదివారం ఉదయం చిన్నారి ఆడుకుంటూ ఇంటి ముందు ఉన్న నీటి సంపులో పడిపోయాడు. మధ్యాహ్నం అతడి తల్లి కుమారుడు కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో గాలించగా నీటి సంపులో పడి చిన్నారిని గుర్తించి బయటికి తీయగా అప్పటికే అతను మృతి చెంది ఉన్నాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

ఎక్స్‌ప్రెస్‌వేపై రోడ్డు ప్రమాదం

- యువకుడి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో శివ మృతదేహం

రాజేంద్రనగర్: పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంనగర్ గుండు ప్రాంతానికి చెందిన పి.శివ(25) డీజే ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితుడు మహేష్(33)తో కలిసి బైక్‌పై శంషాబాద్ ప్రాంతానికి వచ్చిన అతను ఆదివారం ఉదయం నగరానికి బయలు దేరాడు. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పైనుంచి వెళ్లేందుకు బైక్‌లకు అనుమతి లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా వారిద్దరూ ఎక్స్‌ప్రెస్‌వేపై మీదుగా వెళ్తుండగా పిల్లర్ 215 వద్ద గుర్తుతెలియని కారు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎగిరి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలైన శివ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మహేష్‌ను వాహనదారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అంబులెన్స్‌లో అతడిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా గత నాలుగు నెలలుగా ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. త్వరగా వెళ్లాలన్న ఆలోచనతో కొందరు వ్యక్తులు ద్విచక్ర వాహనాలకు ఎక్స్‌ప్రెస్‌వేపై అనుమతి లేకపోయినా ఈ మార్గంలో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

లారీకి ముందు కారులో పైలెటింగ్

లారీ క్యాబిన్‌లో 208 కేజీల గంజాయి అక్రమ రవాణా

- రహస్య అరలో దాచి తెస్తున్న ముంబై ముఠా
- ఈ వాహనానికి ముందు పైలెటింగ్ ఏర్పాటు
- నిఘా ఉంచి పట్టుకున్న టీఎస్-నాబ్ టీమ్
- ఐదుగురు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ డి.సునీతారెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి అక్రమ రవాణా కోసం లారీ ట్రక్కు భాగంలో మార్పుచేర్పులు చేసిన ముఠాలు గతంలో అనేకం పోలీసులకు చిక్కాయి. అయితే నిఘాను తప్పించుకోవడానికి క్యాబిన్‌లోనే రహస్య అరను ఏర్పాటు చేసుకున్న మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌కు చెందిన గ్యాంగ్ తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు (టీఎస్-నాబ్) పట్టుబడింది. ఈ లారీకి ముందు ఓ కారులో ముఠా సభ్యులు అడ్వాన్స్ పైలెటింగ్ చేస్తున్నట్లు గుర్తించామని ఎస్పీ డి.సునీతారెడ్డి ఆదివారం వెల్లడించారు. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు.

బంధుగణంతో ముఠా కట్టి...

ఉస్మానాబాద్‌కు చెందిన హసన్ గంజాయి వ్యాపారంలో దిట్ట. ఆంధ్రా-ఒడిస్సా బోర్డర్ నుంచి భారీగా సరుకు తీసుకువచ్చి పుణేలో తనకు అప్పగిస్తే రూ.2 లక్షలు కమీషన్‌గా ఇస్తానంటూ అదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ రాజు అంబదాస్ షిండేకు ఆఫర్ ఇచ్చాడు. ఇందుకు అంగీకరించిన అతను తన బంధువులైన బాలాజీ అర్జున్ కాలే, నితిన్ నందకుమార్ గవాలీ, మధుకర్ అర్జున్ కాలే, సంజయ్ రవీంద్ర చౌహాన్‌లతో ముఠా ఏర్పాటు చేశాడు. తన స్నేహితుల నుంచి ఓ లారీ, కారు తీసుకున్నాడు. లారీ క్యాబిన్ లోపల, పై భాగంలో 250 కేజీల గంజాయి పట్టేలా ఓ రహస్య అర ఏర్పాటు చేయించాడు. రాజు, బాలాజీ, నిఖిల్ కారులో, మధుకర్, సంజయ్ లారీలో బయలుదేరి పార్వతీపురం ప్రాంతానికి చేరుకున్నారు.

ఆ రెండింటి మధ్య 30 కిమీ దూరం...

అక్కడ కొందరి నుంచి 104 ప్యాకెట్లు (ఒక్కోటి రెండు కేజీలు) గంజాయి ఖరీదు చేశారు. ఇందులో 200 కేజీల లారీలో, 8 కేజీలో కారులో తీసుకుని బయలుదేరారు. లారీ ముందు అడ్వాన్స్ పైలెటింగ్ చేస్తున్న కారు 30 కిమీ ముందు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. వాట్సాప్ కాల్, వాట్సాప్ లైవ్ లొకేషన్ ద్వారా ఒకరితో ఒకరు నిర్విరామంగా టచ్‌లోనే ఉండేవారు. ఆ మార్గంలో ఎక్కడైనా పోలీసు తనిఖీలు ఉంటే ఆ విషయాన్ని కారులోని వారు వెంటనే లారీలో వారికి సమాచారం అందించేవారు. ఈ ముఠా ముందుగా వేసుకున్న పథకం ప్రకారం పార్వతీపురం నుంచి విశాఖ-విజయవాడ-సూర్యాపేట-హైదరాబాద్ ఓఆర్ఆర్ మీదుగా పుణే చేరుకోవాలి. అయితే ఆఖరి నిమిషంలో తమ రూటును విజమవాడ నుంచి గుంటూరు-మాచర్ల-జడ్చర్ల-మహబూబ్‌నగర్ మీదుగా మార్చారు.

ఎన్సీబీతో కలిసి ఆపరేషన్...

ఈ ముఠా కదలికలపై టీఎస్-నాబ్‌కు సమాచారం అందడంతో ఏసీపీ కె.నర్సింగ్‌రావు నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు పి.రాజేష్, జీఎస్ డానియేల్, బి.విజయ్ భాస్కర్‌రెడ్డి తమ బృందాలతో రంగంలోకి దిగారు. ఆ రెండు వాహనాల్లో ఏ ఒక్కదాన్ని పట్టుకున్నా.. రెండో వాహనంలోని వారు పరారవుతారని భావించిన అధికారులు రెండు బృందాలుగా ఏర్పడ్డారు. రెండు వాహనాలను గుర్తించిన ఈ బృందాలు దాదాపు 208 కిలోమీటర్ల దూరం వెంబడించి ఏకకాలంలో అడ్డగించి పట్టుకున్నాయి. మొత్తం ఐదుగురిని అరెస్టు చేసిన అధికారులు 208 కేజీల గంజాయి, లారీ, కారు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు విచారణకు సహకరించట్లేదని, పోలీసు కస్టడీలోకి తీసుకున్న తర్వాత పూర్తి వివరాలు సేకరిస్తామని ఎస్పీ సునీతారెడ్డి పేర్కొన్నారు. టీఎస్-నాబ్ తరఫున ప్రతి జిల్లాకు ఓ డీఎస్పీ పని చేస్తున్నారని, డ్రగ్స్ వ్యవహారాలపై 8712671111కు సమాచారం ఇవ్వాలని కోరారు. 'క్లిష్టమైన భూభాగం కలిగిన ఏపీ ఏజెన్సీల్లో ఒకప్పుడు 50 వేల ఎకరాల్లో గంజాయి సాగు చేసేవారు, అక్కడి పోలీసులు తీసుకున్న చర్యలతో ఇది 10 వేల ఎకరాలకు తగ్గింది' అని ఆమె పేర్కొన్నారు.

ఉద్యోగాల పేరుతో వల

- రూ. 2 కోట్లు వసూలు
- నిందితుడు ప్రేమ్ ప్రకాశ్ అరెస్ట్

మాదాపూర్: ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసం చేసి రూ. 2 కోట్లు వసూలు చేసిన ఓ సంస్థ నిర్వాహకుడిని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ తిరుపతి కథనం మేరకు వివరాలా ఉన్నాయి. కడప జిల్లా , పొద్దుటూరు పట్టణానికి చెందిన బిజినేపల్లి ప్రేమ్ ప్రకాశ్ సనత్‌నగర్‌లో ఉంటూ మాదాపూర్ హైటెక్‌సిటీలోని గూగుల్ కార్యాలయం వద్ద 'సంత్ సూ ఇన్నోవేషన్స్' పేరుతో సంస్థను ఏర్పా టు చేశాడు. నిరుద్యోగులకు ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలను ఇప్పిస్తానని నమ్మించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురి నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేశాడు.శిక్షణ సమయంలో స్టైఫండ్ కూడా ఇస్తానని ప్రచారం చేసుకున్నాడు. అయితే గత రెండు నెలలుగా జీతాలు చెల్లించక పోవడంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రేయసిని దూరం చేశాడనే..

కత్తులతో దాడి ఘటనలో నిందితుల అరెస్ట్



నిందితులు సంజీవ్, ధన్‌కుమార్ బారం, మహేశ్వర్

బంజారాహిల్స్: తన ప్రేయసిని దూరం చేయడమే కాకుండా మరొకరికి ఇచ్చి పెళ్లి చేశాడని కక్ష పెంచుకున్న ఓ యువకుడు తన అనుచరులతో కలిసి ఓ యువకుడిపై కత్తులతో దాడి చేసిన ఘటనలో జూబ్లీహిల్స్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శ్రీరాంగోపి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన జబాన్ రాహుల్ వెంకటగిరిలో నివాసం ఉంటూ సమీపంలోని సాంక్చువరీ బార్ అండ్ కిచెన్‌లో చెఫ్‌గా పని చేస్తున్నాడు. ఏడాది క్రితం అదే ప్రాంతానికి చెందిన రేఖారాణి అనే యువతి అదే ప్రాంతంలో అద్దెకు ఉంటున్న సంజీవ్ అనే యువకుడిని ప్రేమించింది. అయితే వారి మధ్య విభేదాలు రావడంతో ఆమె కేశవ్ అనే మరో యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుని ఒడిశాకు వెళ్లిపోయింది. వీరి పెళ్లికి రాహుల్ సహకారం అందించాడు. అప్పటి నుంచే రాహుల్‌పై కక్ష పెంచుకున్న సంజీవ్ అతడిపై దాడికి పథకం వేశాడు. నాలుగు రోజుల క్రితం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న రాహుల్‌ను సంజీవ్‌తో పాటు అతడి అనుచరులు ధన్‌కుమార్ బారం, మహేశ్వర్ అడ్డగించి కత్తితో దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. వీరి సెల్‌ఫోన్ నెంబర్ల ఆధారంగా పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అతడిది నేరచరితే.. !

- ప్రియురాలిపై దాడి, యువతి తమ్ముడి హత్య
- నాలుగేళ్ల క్రితం తండ్రిని హతమార్చిన శివకుమార్
- తాజా ఘటనతో చర్చనీయాంశం



నిందితుడు శివకుమార్

షాద్‌నగర్/ కొందుర్గు: మానవత్వాన్ని మరిచి మృగాడిలా వ్యవహరించాడు.. నాలుగేళ్ల క్రితం కన్న తండ్రిని సుత్తెతో కొట్టి హతమార్చాడు.. ఆదివారం ప్రియురాలిపై హత్యాయత్నానికి పాల్పడటమే కాకుండా ఆమె తమ్ముడిని దారుణంగా హతమార్చాడు. సీరియల్స్‌లో నటుడిగా పనిచేస్తున్న ఫరూఖ్‌నగర్ మండలం, నేరేళ్ల చెరువుకు చెందిన శివకుమార్ వ్యవహార శైలి ఇదీ. కొందుర్గుకు చెందిన ఇందిర, సురేందర్‌గౌడ్ దంపతులకు కూతురు సంఘవి కుమారులు పృథ్వీ(23), రోహిత్ ఉన్నారు. సంఘవి తమ్ముడు పృథ్వీతో కలిసి ఎల్బీనగర్ ప్రాంతంలో ఉంటూ హోమియోపతి వైద్యవిద్యలో నాలుగో సంవత్సరం చదువుతోంది. కొంత కాలంగా శివకుమార్ ప్రేమపేరుతో ఆమె వెంట పడుతున్నట్లు సమాచారం. పెళ్లి చేసుకోవాలని సంఘవిపై ఒత్తిడి చేయడంతో వారి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో శివకుమార్ ఆదివారం సాయంత్రం ఎల్బీ నగర్‌లో ఉంటున్న సంఘవి ఇంటికి వెళ్లి ఆమెపై కత్తితో దాడి చేశాడు. అడ్డుకోబోయిన తమ్ముడు పృథ్వీపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా గత కొంత కాలంగా శివకుమార్ సైకోలా వ్యవహరిస్తున్నట్లు సమాచారం . కుటుంబ కలహాల నేపథ్యంలో నాలుగేళ్ల క్రితం తన తండ్రి శంకరయ్యను సుత్తెతో తలపై మోది హత్య చేశాడు. తాజా ఘటనతో శివకుమార్ వ్యవహారం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

కొందుర్గులో విషాదఛాయలు

మూడు రోజుల క్రితమే రాఖీ పండుగ నేపథ్యంలో స్వగ్రామానికి వచ్చిన సంఘవి, పృథ్వీ శనివారం తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. ఆదివారం దాడి ఘటన విషయం తెలుసుకున్న వారి తల్లిదండ్రులు హుటాహుటిన హైదరాబాద్ వెళ్లారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మహిళల ఉసురు తగలడం ఖాయం

- రూ.4500 కోట్లు వడ్డీలేని రుణాలను మంజూరు చేస్తే కేసీఆర్ ప్రభుత్వం అమలు చేయడం లేదు
- రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ధ్వజం



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్, చిత్రంలో బండారు విజయలక్ష్మి

చిక్కడపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మహిళాభ్యుదయమే ధ్యేయంగా పనిచేస్తుండగా, తెలంగాణ రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కేంద్రానికి చెడ్డపేరు తీసుకు వచ్చేలా ప్రవర్తిస్తోందని బీజేపీ పార్లమెంట్ బోర్డు సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం రాత్రి గాంధీనగర్ డివిజన్, టీఆర్టీ క్వార్టర్స్ కమ్యూనిటీ హాల్‌లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లకు చెందిన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు వివిధ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం రూ.4500 కోట్లు వడ్డీ లేని రుణాలను మంజూరు చేసినా కేసీఆర్ ప్రభుత్వం వాటిని అర్హులకు అందజేయలేదన్నారు. ప్రభుత్వానికి మహిళల ఉసురు తగలడం ఖాయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా పీఎం విశ్వకర్మ పథకం పేరిట ఓబీసీ వర్గాల కోసం ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. గ్యాస్ ధరను స్థిరీకరించేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గ్యాస్ ధరను రూ.200 తగ్గిస్తూ సాహసోపేత నిర్ణయం తీసుకుందన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో మహిళలకోసం మరో కీలక పథకాన్ని ప్రధాని ప్రభుత్వం ప్రకటించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, కార్పొరేటర్లు రచనశ్రీ, సుప్రియ నవీన్‌గౌడ్, మహిళామోర్చా కన్వీనర్ మాధవి, నాయకులు రత్నసాయిచంద్, అరుణ్‌కుమార్, రవికుమార్, బద్రినారాయణ, ఆర్.నరేష్, మహేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరామర్శ



ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: హిమాయత్‌నగర్‌లో శనివారం చెట్టుకూలి ఆటోమీదపడిన ఘటనలో ఎంఎస్ మక్తాకు చెందిన ఆటో డ్రైవర్ గౌస్‌పాషా మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్ రెడ్డి పరామర్శించారు. వారికి ఆర్థిక సాయంతో పాటు పిల్లల చదువులకు అయ్యే పూర్తి ఖర్చు బాధ్యతను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తక్షణం స్పందించి గౌస్‌పాషా కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వాలని ఆయన భార్యకు ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని మంత్రి కేటీఆర్‌ను కోరారు.

బీసీ కుల సంఘాల ఐక్యవేదిక సమరభేరి

బంజారాహిల్స్: బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని బంజారా ఫంక్షన్ హాల్‌లో రాజ్యాధికారం కోసం బహుజనుల సమరభేరి పేరుతో సదస్సు నిర్వహించారు. రాష్ట్రానికి చెందిన పలువురు బీసీ నాయకులు సదస్సులో పాల్గొని బీసీ కుల సంఘాల ఐక్యతపై ప్రసంగించారు. బీసీ రాజ్యాధికారం సాధించాలంటే అందరం ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో నేతలు బూర నర్సయ్యగౌడ్, పల్లపు గోవర్దన్, రామణ్‌గౌడ్, బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు కేంద్రాలకు విశేష స్పందన



రహమత్‌నగర్: రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో ఆదివారం ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలకు విశేష స్పందన లభించింది. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు.. చిరునామా మార్పు, ఇతర సవరింపుల కోసం కేంద్రాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. బూత్ లెవల్ అఫీసర్ (బీఎల్‌ఓ) ఆయా కేంద్రాల వద్ద సేవలందించారు. పబ్లిక్, ప్రైవేటు పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లలో ఆయా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

శ్రీరాంనగర్‌లో 'ఆప్' నేతల పాదయాత్ర

రహమత్‌నగర్: శ్రీరాంనగర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్ రాష్ట్ర అధికార ప్రతినిధి, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కో కన్వీనర్ మహమూద్ అలీ మాట్లాడుతూ... సమాజంలో అవినీతి నిర్మూలన, సమర్థ పాలన ఆమ్ ఆద్మీ పార్టీతోనే సాధ్యమన్నారు. శ్రీరాంనగర్ బస్తీలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆప్ పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ పాదయాత్రలు చేపట్టామని ఆయన వెల్లడించారు.

షేక్‌పేటలో మాజీ ఎమ్మెల్యే విష్ణు పాదయాత్ర



శ్రీనగర్‌కాలనీ: రానున్న ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి తెలియజేశారు. ఆదివారం ఆయన షేక్‌పేట డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలనుద్దేశించిన విష్ణు మాట్లాడుతూ... తాను అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు నారాంరెడ్డి తదితరులు విష్ణు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు డి.సత్యనారాయణ, జి.రవి, సిహెచ్.రమేష్, జి.కన్నా, నవీన్, జ్యోతి, గీత, జయమ్మ, సత్యనారాయణ, నరేష్, రాజేష్, విక్టరీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన పార్కు ప్రహరీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్-10 గౌరీశంకర్‌కాలనీని ఆనుకొని ఉన్న పార్కు ప్రహరీ ఆదివారం సాయంత్రం కుప్పకూలింది. సుమారు 25 అడుగుల ఎత్తు, 50 అడుగుల మేర పొడవుతో ఉన్న ప్రహరీ కూలిపోవడంతో పక్కనే ఉన్న నాలుగు నివాసాలు దెబ్బతిన్నాయి. పార్కు పక్కనే ఉన్న ఓ నివాసితుడు భారీగా వ్యర్థాలను డంపింగ్ చేయడం.. జీహెచ్‌ఎంసీ అధికారులు మొక్కలు నాటడంతో ప్రహరీ దెబ్బతినిందని స్థానికులు పేర్కొంటున్నారు. దీనికితోడు ఆదివారం తెల్లవారుఝామును కురిసిన భారీ వర్షానికి ప్రహరీ నాని కూలింది. ప్రహరీ కూలిన ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఈ పాపం ఎవరిది?

అధికారుల నిర్లక్ష్యం... పాలకుల అలసత్వం ఓ అమాయకుడి ప్రాణాలు పోయేందుకు కారణమైంది. ఎంతో మందికి నీడనిచ్చే భారీ వృక్షానికి జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం చుక్క నీరు పీల్చే అవకాశం ఇవ్వకుండా మొదళ్లల్లో కాంక్రీట్‌తో కప్పేశారు. మరో పక్క బిల్డింగ్ యజమాని బిల్డింగ్ మరమ్మతుల సమయంలో ఈ భారీ వృక్షాన్ని కూల్చేందుకు విశ్వప్రయత్నాలు చేసిన విషయాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. బిల్డింగ్ యజమాని, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం, హార్టికల్చర్‌ల నిర్లక్ష్యమే భారీ వృక్షం కుప్పకూలడానికి.. ఆటోడ్రైవర్ మహ్మద్ గౌస్ మరణానికి కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కాంక్రీట్‌తో మొదళ్లను కప్పేసిన జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం



కుప్పకూలడంతో వేర్లు ఎండిపోయినట్లు స్పష్టంగా కనిపిస్తున్న దృశ్యం

- చెట్టు కూలేందుకు అధికారుల నిర్లక్షమే కారణమా...
- మూడేళ్ల క్రితం చెట్టు వద్ద టైల్స్ వేసిన బిల్డింగ్ యజమాని
- ఏడాది క్రితం ఫుటపాత్ నిర్మించిన జీహెచ్‌ఎంసీ
- చుక్క నీరు భూమిలోకి వెళ్లకే ఎండి కూలిన చెట్టు

హిమాయత్‌నగర్: హైదర్‌గూడ సిగ్నల్ వద్ద శనివారం భారీ వృక్షం కూలడంతో ఒక్కసారిగా వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందారు. చెట్టు కూలిన ప్రాంతంలో ఉన్న బిల్డింగ్ మూడేళ్ల క్రితం మరమ్మతులు చేశారు. అప్పట్లోనే ఈ చెట్టును ఇక్కడ నుంచి తరలించేందుకు కాంట్రాక్టర్ స్థానిక రాజకీయ నేతలతో కలసి విశ్వప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. గత ఏడాది ఫుట్‌పాత్ నిర్మాణాల్లో భాగంగా సర్కిల్-16కు సంబంధించిన ఇంజనీరింగ్ విభాగం హిమాయత్‌నగర్ వైజంక్షన్ నుంచి హైదర్‌గూడ చెట్టు కూలిన ప్రాంతం వరకు ఫుట్‌పాత్‌లను నిర్మించారు. కాసులకు కక్కుర్తి పడ్డ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం బిల్డింగ్ యజమానుల మాటలు విని చెట్టు మొదళ్లల్లో మొత్తం కాంక్రీట్ వేసి పూడ్చేశారు. ఒక్క చుక్క నీరు చెట్టు వేర్లుకు తగలకుండా చేశారు. దీనికారణంగా ఏడాదికి పైగా ఒక్క బొట్టు నీటిని పీల్చుకోని ఆ చెట్టు శనివారం ఒక్కసారిగా కుప్పకూలింది. ఇదే కోవలో మరిన్ని చెట్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయనడం ఏమాత్రం సందేహం లేదు. శనివారం కూలిన చెట్టుపక్కనే మరో చెట్టును కూడా కాంక్రీట్‌తో కూల్చేయడం జరిగింది. దీనితో పాటు మరికొన్ని చెట్లు ఇదేతరహాలో ఉన్నాయి.

మొద్దునిద్రలో హార్టికల్చర్ విభాగం...

చెట్లను సంరక్షించాల్సిన హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. బిల్డింగ్ నిర్మాణాలకు భారీ వృక్షాలు అడ్డు వస్తున్న తరుణంలో కాంట్రాక్టర్లు ఇచ్చే డబ్బుకు దాసోహం అవుతున్న హార్టికల్చర్ ఆయా ప్రాంతాల్లోని చెట్లను కూల్చేస్తున్నారు. సీసీ పుటేజీలకు చెట్ల కొమ్మలు అడ్డొస్తున్నాయి. ట్రాఫిక్‌కు విఘాతం కలిగే వాటిని తొలగించాలంటూ పలుమార్లు నారాయణగూడ ట్రాఫిక్ పోలీసులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పట్టించుకునే నాథుడు హార్టికల్చర్ శాఖలో లేకపోవడం గమనార్హం.

ఆటో డ్రైవర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

లిబర్టీ: చెట్టు కూలిన ఘటనలో మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ అనుబంధ విభాగం ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రాక్ష మల్లేష్ కోరారు. మృత్యువు అనుకోని విధంగా చెట్టు రూపలో వచ్చి ఆటోపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందారన్నారు. ఆదివారం లిబర్టీ కూడలి వద్ద ఉన్న యూనియన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మహ్మద్ అలీ ఆటో నడుపుతూ తన కటుంబాన్ని పోషించుకుంటున్నాడన్నారు. బషీర్‌బాగ్ వెళ్తున్న మహ్మద్ అలీ ఓల్డ్ ఎమ్మెల్యే కోటర్స్ సిగ్నల్ వద్ద ఆగగా ఒక్కసారిగా చెట్టు విరిగి ఆటోపై పడిందన్నారు. ఈ ఘటనలో ఆయన మృతి చెందారన్నారు. దీంతో ఆయన కుటుంబ పోషణ తీవ్ర దయనీయంగా మారిందన్నారు. డ్రైవర్ కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఆటో డ్రైవర్ల కుటుంబాన్ని ఆదుకోవడానికి జీవిత భీమాను ఆటో డ్రైవర్లకు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

గౌస్ కుటుంబాన్ని ఆదుకోవాలి...



ఇంతపెద్ద ప్రమాదం జరిగి మనిషి చనిపోతే ఇంతవరకు మంత్రి కేటీఆర్, జీహెచ్‌ఎంసీ విభాగం స్పందించకపోవడం విచారకరం. చెట్లను కాంక్రీట్‌తో పూడ్చమనేది ముమ్మాటికి తప్పు. నగరంలో ఇలా ఉన్నవాటిపై దృష్టిసారించి వాటిని తొలగించాలి. చనిపోయిన గౌస్ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.
– ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- ప్రతి ఒక్కరి సహకారం అవసరం
- టీం ఇండియా మాజీ సారథి మహమ్మద్ అజహరుద్దీన్



మాట్లాడుతున్న అజహరుద్దీన్

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చి కాంగ్రెస్ జెండాను రెపరెపలాడిస్తామని మాజీ ఎంపీ, టీం ఇండియా మాజీ సారథి మహ్మద్ అజహరుద్దీన్ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని టీ-హోప్ కార్యాలయంలో ఆదివారం అజహరుద్దీన్ ఆ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అజహరుద్దీన్ మాట్లాడుతూ... స్థానికంగా ఉపేందర్‌రెడ్డి ఇప్పటికే ఎన్నోమార్లు పర్యటించి సమస్యలను తెలుసుకున్నారని, ప్రజాభిమానాన్ని చూరగొన్నారని అన్నారు. అలాంటి నాయకుడు తమకు సహకారం అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపితే ఇక్కడ కాంగ్రెస్ విజయం తథ్యమవుతుందని అజహరుద్దీన్ స్పష్టం చేశారు. ఉపేందర్‌రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందించదగ్గవని ఆయన పేర్కొన్నారు. ఇక్కడకు వచ్చిన మహిళల ఉత్సాహాన్ని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందని, ఇక కాంగ్రెస్ తిరుగులేదని అనిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రజలందరికీ మంచి జరగాలని తపన పడుతున్న ఆయనకు భవిష్యత్‌లో మంచే జరుగుతుందన్నారు. టికెట్ అనేది త్వరలోనే తెలుస్తుందని, అయితే ప్రతి ఒక్కరూ కలిసి పార్టీకి విజయం చేకూర్చాలనే తాను ఇక్కడికి వచ్చానన్నారు. ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ... టీ-హోప్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు తెలుసుకుని కాంగ్రెస్ నాయకులందరూ ఇక్కడకు రావడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకుడు భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలకు వ్యతిరేకం: దళిత బహుజన పార్టీ

లిబర్టీ: వన్ నేషన్ ఎలక్షన్‌కు తాము వ్యతిరేకమని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్ అన్నారు. అధికారం నుంచి దిగిపోతామనే ఆందోళనతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ జమిలి ఎన్నికలను సిద్ధమవుతున్నారని ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగ, ఫెడరల్ వ్యవస్థలను ప్రధానమంత్రి విధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చి జమిలి ఎన్నికల పేరిట తిరిగి అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ కుయుక్తులు పన్నుతున్నదని విమర్శించారు. తమకు అనుకూలంగా ఉన్న వారిని ఒక కమిటీ వేసిందని విమర్శించారు. ప్రజా సమస్యలను ప్రస్తావించని పార్లమెంటు మరో ఐదు రోజులు సమావేశం చేయడానికి ఎవరి ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని మండిపడ్డారు. జమిలి ఎన్నికలకు మద్దతిస్తూ 2018వ సంవత్సరంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా లేఖ రాశారని ఆరోపించారు. ప్రధానమంత్రి వ్యవస్థను మంత్రి మండలి దెబ్బతీసి రాష్ట్రపతి తరహా పాలన సాగించేందుకు పెద్ద ఎత్తున కుట్రలు సాగుతున్నాయని విమర్శించారు. సమావేశంలో నేతలు దేవునూరి శ్రీనివాస్, వీరం సతీష్‌కుమార్, ఇటికాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో యువత చేరిక



పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే దానం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బీజేఆర్ నగర్‌బస్తీకి చెందిన ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డేవిడ్, మహేష్, చింటూ తో పాటు 40 మంది యువకులు పార్టీలో చేరగా వీరందరికీ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరడంతోనే సరిపెట్టుకోకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి చేర్చడంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. అలాగే అర్హులైన యువకులు దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు పథకాలు సాధించుకొని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు, అప్పు, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్లు: స్తంభించిన ట్రాఫిక్



కూలిన చెట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేదీప్య తదితరులు



శ్రీకృష్ణానగర్‌లో వరద నీరు

వెంగళరావునగర్: ఆదివారం తెల్లవారుజామున కురిసిన అకాల వానకు మధురానగర్, సిద్ధార్థనగర్ సమీపంలోని పరిసర ప్రాంతాల్లో అనేక చెట్లు కూలిపోయాయి. చెట్ల కొమ్మలు అనేక ప్రాంతాల్లో విద్యుత్ వైర్ల మీద పడి విరిగిపోయాయి. చెట్ల కూలి రోడ్లమీద పడటంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయి రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ ఆయా ప్రాంతాలను సందర్శించారు. జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ సిబ్బందిని పిలిపించి రోడ్లకు అడ్డంగా పడిపోయిన చెట్లను కట్ చేసి తొలగింపజేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్ మరోసారి కృష్ణానదిని తలపించింది. దాదాపు రెండు గంటల పాటు వరద ఉధృతి తగ్గలేదు. దాంతో అటు వాహనాలు, ఇటు చెత్త డబ్బాలు, కొన్ని వస్తువులు ఒక ప్రాంతం నుంచి మరో చోటుకు కొట్టుకుపోయాయి.

కాఫీ స్టోర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: తగినంత పార్కింగ్ సౌకర్యం లేకుండా కాఫీషాప్ నడిపిస్తూ ఇక్కడికి వచ్చే కస్టమర్ల వాహనాలు రోడ్డుపక్కనే అక్రమంగా పార్కింగ్ చేయిస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయని పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నట్లు గుర్తించిన జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు రోడ్ నెం. 45లోని ట్రూ బ్లాక్ కాఫీ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులు ట్రూ బ్లాక్ కాఫీ స్టోర్‌పై ఐపీసీ సెక్షన్ 341 కింద కేసు నమోదు చేశారు. శనివారం ఈ రోడ్డంతా ట్రాఫిక్ జామ్ కావడంతో పరిశీలించేందుకు ఇక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కిషోర్‌రాజు రోడ్డుపై తిరుగుతుండగా ట్రూ బ్లాక్ కాఫీ ముందు పెద్ద ఎత్తున అక్రమ పార్కింగ్‌లు కనిపించాయి. ఈ పార్కింగ్ వల్లనే ట్రాఫిక్ ఫ్రీ ఫ్లోకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్థలంలోకి అక్రమంగా ప్రవేశించిన వ్యక్తులపై ఫిర్యాదు

ఫిలింనగర్: తన స్థలంలోకి అక్రమంగా ప్రవేశించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు ఇద్దరిపై భూకబ్జా కేసు నమోదు చేశారు. వివరాలివీ... షేక్‌పేట మండలం పరిధిలోని ఓయూ కాలనీ పక్కన సక్కుబాయి సొసైటీని ఆనుకొని సర్వే నెంబర్ 327(పైకి)లో వి. చిన్నాజీకి 30 ఎకరాల స్థలం ఉండగా అందులో 5.05 ఎకరాల స్థలంలోకి ఇటీవల ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో పాటు తన సోదరి అమ్మాజి పేరుతో ఎస్ఎస్. మ్యూచవల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నామని ఆమె తెలిపారు. తన స్థలంలోకి అక్రమంగా ప్రవేశిస్తూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. శనివారం సాయంత్రం ఇదే ప్రాంతానికి చెందిన టి. నర్సింగరావు, సాయినాథ్ యాదవ్ ఇద్దరూ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా ఇక్కడ పని చేస్తున్న వర్కర్లను బెదిరింపులకు గురిచేశారని ఇక్కడి నుంచి వెళ్ళకపోతే చంపేస్తామంటూ హెచ్చరించారని ఆరోపించారు. తాము స్థలం చుట్టూ కాపాడుకునేందుకు ప్రహరీ నిర్మించడం జరుగుతున్నదన్నారు. నిర్మాణాలు జరపకుండా స్థలంలోకి అక్రమంగా ప్రవేశిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న వీరిపై చర్యలు తీసుకోవాలని చిన్నాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నర్సింగరావు, సాయినాథ్ యాదవ్‌లపై ఐపీసీ సెక్షన్ 341, 447, 506 రెడ్ విత్ 34 కింద క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌరసరఫరాల శాఖలో అవినీతిపై ఫిర్యాదు

పంజగుట్ట: పౌరసరఫరాల శాఖలో ఎంతో అవినీతి జరుగుతున్నదని, అక్రమంగా రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నారని వీటిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత షెడ్యూల్ కులాల షెడ్యూల్ తెగల సమాఖ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి పేషీలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు కె.మహేశ్వర రాజ్ మాట్లాడుతూ... కొంతమంది అధికారుల సాయంతో చాలా రేషన్‌షాపుల నిర్వాహకులు చనిపోగా వారి డెత్ సర్టిఫికెట్లు ఫేక్‌వి సృష్టించి అక్రమంగా రేషన్ షాపులు మంజూరు చేయించుకుంటున్నారని ఆరోపించారు. నకిలీ స్కూల్ సర్టిఫికెట్‌లు, తప్పుడు ఆధార్ కార్డులు సృష్టించి షాపులు తీసుకుంటున్నారని వీటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారమన్నారు. ఫిర్యాదుతోపాటు పలు ఆధారాలు జతచేసి పెట్టినట్లు ముఖ్యమంత్రి పేషీలో అధికారులు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బంజారాహిల్స్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో భద్రత ఇతరత్రా అంశాలను పరిశీలిస్తున్నారు. అందులోభాగంగా ఆదివారం జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో వసతులను నమోదు చేసుకున్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ తీరు, సమస్యలు, పరిష్కార మార్గాలు ఇతరత్రా వాటిని పరిశీలించారు.



వచ్చే ఎన్నికల్లో బీసీలకు 61 స్థానాలు కేటాయిస్తాం

తెలంగాణ సమాజ్ కాంగ్రెస్ పార్టీ



ఫిలింనగర్: బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడిన తెలంగాణ సమాజ్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పుంజాల వినయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి దీనికి చైర్మన్‌గా వినయ్‌కుమార్‌ను, వైస్ చైర్మన్‌గా వడ్డెపల్లి రామకృష్ణ, కన్వీనర్‌గా పాండు యాదవ్‌ను ఎన్నుకున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 61 స్థానాలు, ఎస్సీలకు 22, ఎస్టీలకు 10, ముస్లింలకు నాలుగు స్థానాలు కేటాయిస్తామని తీర్మానాలు ఆమోదించారు.

స్పా, బ్యూటీ పార్లర్ల నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న స్పా, బ్యూటీ పార్లర్లపై జూబ్లీహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించి నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాకేష్ సమాచారం మేరకు... జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లోని ప్లాట్ నెం. 270లో హర్షిత్ సెలూన్ పేరుతో జె. శ్రీనివాస్ అనే వ్యక్తి కొంత కాలంగా స్పా నిర్వహిస్తున్నాడు. అయితే నియమ నిబంధనలు ఉల్లంఘిస్తూ భద్రతాపరమైన చర్యలు తీసుకోకుండా ఈ మసాజ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు.



షాదన్ కాలేజీ వద్ద...



ఖైరతాబాద్ బడా గణేష్ వద్ద...



నీట మునిగిన ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్...

దంచి కొట్టిన వాన



ఖైరతాబాద్ చౌరస్తాలో...

లోతట్టుప్రాంతాలు జలమయం

వెంకటేశ్వరకాలనీ: ఆదివారం తెల్లవారుజామున గంటపాటు కురిసిన భారీ వర్షానికి ఖైరతాబాద్, సోమాజిగూడ ప్రాంతాల్లో జలమయం అయ్యాయి. ఖైరతాబాద్ చౌరస్తాతో పాటు రైల్వే గేట్ లైన్, ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో భారీగా వరద నీరు చేరడంతో సహాయక బృందాలు స్పందించి వరద నీటిని బయటికి పంపేందుకు చర్యలు తీసుకున్నాయి.

బోరబండలో కొట్టుకుపోయిన వాహనాలు

రహమత్‌నగర్: బోరబండ డివిజన్‌లో ఆదివారం తెల్లవారుఝామున కురిసిన భారీ వర్షం బీభత్సాన్ని సృష్టించింది. పలు ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ఉన్న కార్లు, ద్విచక్ర వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. నాలాలు నిండి నివాసాల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజ్‌నగర్‌లో వాహనాలు కొన్ని మీటర్ల వరకు కొట్టుకుపోయాయి. రహమత్‌నగర్ డివిజన్ కేసీఆర్‌నగర్‌లోని ఓ ఇంటి గోడ కూలిపోయింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి బస్తీలో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. తెల్లవారుఝాము దాదాపు రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షంతో వీధులన్నీ వరదమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జీహెచ్‌ఎంసీ బృందాలు బస్తీల్లో సహాయక చర్యలు చేపట్టాయి. బీజేపీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ నాయకులతో కలిసి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.





ఖైరతాబాద్ రైల్వే గేట్ వద్ద...



కేసీఆర్‌నగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

పురాతన ఆలయాలకు 'శ్రీవాణి' వైభవం

ఏపీలో 176 పురాతన ఆలయాల పునరుద్ధరణ

తిరుమల: పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం, హిందూ ధార్మిక ప్రచార, సేవా కార్యక్రమాలే లక్ష్యంగా శ్రీవాణి ట్రస్టు ముందుకు దూసుకుపోతోంది. భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఏపీలో 176 పురాతన ఆలయాలను పునరుద్ధరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 2,273 నూతన ఆలయాలు నిర్మించి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అలాగే 501 ఆలయాలకు ధూపదీప నైవేద్యం కింద ప్రతి నెల రూ.5 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో పెద్ద ఎత్తున హిందూ ధార్మిక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

2019లో ట్రస్ట్ విధివిధానాలు ఖరారు: నూతన ఆలయాల నిర్మాణం, పురాతన ఆలయాల పునరుద్ధరణ కోసం టీటీడీ శ్రీవాణి ట్రస్ట్‌ను ప్రారంభించింది. 2018 ఆగస్టు 18వ తేదీనే ట్రస్ట్‌ను అప్పటి ప్రభుత్వం ప్రారంభించినా విధివిధానాలు మాత్రం 2019 సెప్టెంబర్ 23వ తేదీ ఖరారు చేశారు. అప్పటి వరకు కూడా టీటీడీ ట్రస్ట్‌లకు సంబంధించి లక్ష రూపాయలపైగా ఇచ్చిన దాతలకు మాత్రమే దర్శన సౌలభ్యం కల్పించేది. మొదటిసారి రూ.10 వేలను శ్రీవాణి ట్రస్ట్‌కు విరాళంగా అందించిన భక్తులకు ఎలాంటి సిఫార్సు లేఖలు లేకుండా ప్రోటోకాల్ బ్రేక్ దర్శన సౌకర్యం కల్పించే విధానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో శ్రీవాణి ట్రస్ట్‌కు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.

సెప్టెంబర్‌లో తిరుమలలో విశేష పర్వదినాలు



తిరుమల: కలియుగ వైకుంఠమైన తిరుమలలో సెప్టెంబర్‌లో విశేష పర్వదినాలను ఆదివారం టీటీడీ పీఆర్వో విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబర్ 7న గోకులాష్టమి, 8న ఉట్లోత్సవం, 17న బలరామ జయంతి, వరాహ జయంతి, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 18న వినాయక చవితి, ధ్వజారోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం, 22న శ్రీవారి గరుడసేవ, 23న శ్రీవారి స్వర్ణరథోత్సవం, 25న రథోత్సవం, 26న శ్రీవారి చక్రస్నానం, ధ్వజావరోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమాప్తం, 27న శ్రీవారి బాగ్ సవారి ఉత్సవం, 28న అనంత పద్మనాభ వ్రతం జరగనున్నట్లు వెల్లడించింది.

పేదల ఇళ్లూ లూటీ!

- నిరుపేదల ఈడబ్ల్యూఎస్ గృహాలనూ వదలని చంద్రబాబు
- రూ.8,000 కోట్ల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టు షాపూర్జీ పల్లోంజీకి
- దుబాయ్ దినార్‌ల రూపంలో ముడుపులతో దొరికిపోయిన బాబు
- వినయ్ నంగాలియా, విక్కీజైన్, అంకిత్ బలదూత కీలక పాత్ర
- షాపూర్జీ పల్లోంజీ నుంచి దొంగ ఇన్‌వాయిస్‌లతో నగదును బాబు పీఏకు చేరవేసిన ఆ ముగ్గురూ
- ఐటీ శాఖ నోటీసుల్లో వెలుగులోకి చంద్రబాబు నిర్వాకాలు
- రూ.118 కోట్లకు మినహా మిగిలిన వాటికి బాబు లేఖలు
- దీటుగా సెక్షన్లతో తిప్పికొడుతూ తాజాగా 153 సీ కింద ఐటీశాఖ నోటీసులు జారీ



చంద్రబాబుకు వివిధ మార్గాల్లో అందించిన రూ.కోట్లను కోడ్ భాషలో స్టీల్ టన్నులుగా పేర్కొంటూ మెయిల్‌లో దాచుకున్న షాపూర్జీ పల్లోంజీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని అమరావతి ముసుగులో తాత్కాలిక భవనాల నిర్మాణాల్లో అడ్డంగా దోచేసిన మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పేదల ఇళ్ల నిర్మాణాన్ని సైతం వదల్లేదు! రూ.వేల కోట్ల విలువైన కాంట్రాక్టులను ఒకే నిర్మాణ రంగ సంస్థకు అప్పగించి భారీ మొత్తంలో దోపిడీకి వేసిన పథకం ఆదాయపు పన్ను శాఖ తాజాగా జారీ చేసిన 46 పేజీల సుదీర్ఘ నోటీసుల్లో బయటపడింది. తాత్కాలిక భవన నిర్మాణాల్లో డొల్ల కంపెనీల పేరుతో రూ.వందల కోట్లు స్వాహా చేసి పక్కా ఆధారాలతో దొరికిపోయిన చంద్రబాబు 'ఈడబ్ల్యూఎస్'పథకం కింద పేదల ఇంటి నిర్మాణాల్లో ముడుపులు కొట్టేసేందుకు ప్రణాళిక వేశారు. ఇదే విషయాన్ని షాపూర్జీ పల్లోంజీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని 2019 నవంబర్ 5న ముంబైలో ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో వెల్లడించాడు. తాత్కాలిక సచివాలయం భవనాలే కాకుండా రాష్ట్రంలో వివిధ నిర్మాణాలకు సంబంధించి 2018 డిసెంబర్ నాటికి సుమారు రూ.8,000 కోట్ల విలువైన కాంట్రాక్టులను షాపూర్జీ పల్లోంజీకి చంద్రబాబు అప్పగించినట్లు మనోజ్ వాసుదేవ్ తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఇందులో ఈడబ్ల్యూఎస్ హౌసింగ్ ప్రాజెక్టు కింద సుమారు రూ.7,000 కోట్ల విలువైనవి కర్నూలు, గుంటూరు, అనంతపురం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉన్నట్లు తెలిపాడు. అమరావతిలో రూ.700 కోట్ల హౌసింగ్ ప్రాజెక్టును 2019 ఫిబ్రవరిలో కేటాయించారని, దీని తర్వాతే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తనను ఇంటికి పిలిచి ఆయన పీఏ శ్రీనివాస్‌తో టచ్‌లో ఉండాలని చెప్పారని, అంతేకాకుండా పార్టీ ఫండ్ రూపంలో కాకుండా డొల్ల కంపెనీల ద్వారా తనకు నగదు ఇవ్వాలని కోరినట్లు వాంగూల్మంలో స్పష్టంగా పేర్కొన్నాడు. 2017లో షాపూర్జీ పల్లోంజీ 1.40 లక్షల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును దక్కించుకోగా 2019 మార్చి నాటికి కేవలం 23 వేల ఇళ్ల నిర్మాణాన్నే పూర్తి చేసింది.

నగదు బదిలీలో ఆ ముగ్గురు.. కోడ్ భాషలో

సబ్ కాంట్రాక్టుల ముసుగులో డొల్ల కంపెనీలు హయగ్రీవా, అన్నై, షలఖ కంపెనీల ద్వారా అక్రమంగా నగదును చంద్రబాబు నాయుడుకు తరలించడంలో వినయ్ నంగాలియా, విక్కీ జైన్, అంకిత్ బలదూత కీలకపాత్ర పోషించినట్లు మనోజ్ వాసుదేవ్ పార్థసాని తన వాంగ్మూలంలో వెల్లడించినట్లు ఐటీశాఖ నోటీసుల్లో పేర్కొంది. వీరంతా బోగస్ కాంట్రాక్టుల ద్వారా నగదును చంద్రబాబు నాయుడు పీఏ శ్రీనివాస్‌కు చేరవేసినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు దుబాయ్‌లో దినార్‌ల రూపంలో చెల్లించినట్లు మనోజ్ వాసుదేవ్ అంగీకరించాడు. ఈ చెల్లింపులకు సంబంధించిన ఎక్సెల్ షీట్‌ను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నగదు బదిలీకి కోడ్ భాషలో హెచ్‌వైడీ అని అందులో ఉంది. విజయవాడకు విజయ్ అని, విశాఖపట్నంకు విష్ అని, బెంగళూరుకు బాంగ్ అని కోడ్ భాషల్లో నమోదు చేసుకున్న వివరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అడ్డగోలు వాదన ఆపి జవాబు చెప్పు!!

చంద్రబాబు అసంబద్ధ వాదనలను కట్టిపెట్టి ముడుపుల రూపంలో తీసుకున్న రూ.118 కోట్లకు సంబంధించి లెక్కలు చెప్పి తీరాల్సిందేనని ఐటీ శాఖ తేల్చి చెప్పింది! ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ తన రాజగురువు రామోజీ తరహాలో ఏదో ఒక అభ్యంతరాన్ని తెరపైకి తీసుకొస్తూ దర్యాప్తు ముందుకు కదలకుండా చంద్రబాబు అడ్డుకుంటున్నారు. చంద్రబాబు ప్రతిసారీ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను ఐటీ శాఖ తోసిపుచ్చుతూ సహనంగా సమాధానాలిస్తోంది. ముందుగా రూ.118 కోట్లకు లెక్కలు చెప్పాలంటూ పూర్తి సాక్ష్యాధారాలతో మరోసారి సెక్షన్ 153 సీ కింద నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులతో పాటు మనోజ్ వాసుదేవ్ పార్థసాని (ఎంవీపీ), చంద్రబాబు పీఏ పెండ్యాల శ్రీనివాస్‌లపై ఐటీ దాడుల సందర్భంగా స్వాధీనం చేసుకున్న ఎక్సెల్ షీట్లు, వాట్సాప్ మెస్సేజ్‌లు, ఈ మెయిల్స్, బ్యాంకు లావాదేవీల వివరాలతో పాటు వారు విచారణ సందర్భంగా ఆ నగదును చంద్రబాబుకు ఏ విధంగా చేర్చారో వెల్లడిస్తూ వివరాలను పొందుపరిచింది.

తప్పించుకుని తిరుగుతూ..

చంద్రబాబు స్క్రూటినీ కేసును హైదరాబాద్ ఇన్‌కమ్ ట్యాక్స్–4 ప్రిన్సిపల్ కమిషనర్ గతేడాది సెక్షన్ 127 కింద హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్–2(4)కు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసి సెక్షన్ 153 సీ, 143(2)/142(1) కింద విచారణకు సంబంధించి నోటీసులు జారీ చేశారు. దీనిపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ 2022 అక్టోబర్ 10, అక్టోబర్ 27, ఈ ఏడాది జనవరి 31, జూన్ 20న చంద్రబాబు నాలుగు లేఖలు రాశారు. అసలు సెంట్రల్ సర్కిల్ కార్యాలయానికి సెక్షన్ 153 సీ కింద తనకు నోటీసులిచ్చే అధికారం లేదని వాదించగా దీన్ని తోసిపుచ్చింది. దీంతో చంద్రబాబు వెంటనే సెక్షన్ 127 కింద కేసు బదిలీ కాకుండానే సెంట్రల్ సర్కిల్ ఆఫీసు తనకు నోటీసులు ఇచ్చిందంటూ వాదించగా దానికి కూడా స్పష్టమైన ఆధారాలతో వివరణ ఇచ్చింది. దర్యాప్తులో సీజ్ చేసిన వివరాలను తనకు పూర్తిగా తెలియచేయలేదని ఒకసారి పేర్కొనగా అందులో తన పేరు ఎక్కడా లేదు కాబట్టి తనకు నోటీసులు వర్తించవంటూ మరోసారి చంద్రబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఐటీ శాఖ స్పందిస్తూ మనోజ్ వాసుదేవ్ పార్థసాని వద్ద సోదాల్లో సీజ్ చేసిన వస్తువుల వివరాలన్నీ మీకు (చంద్రబాబుకు) తెలియచేశామని, సీఎం హోదాలో కేటాయించిన కాంట్రాక్టుల నుంచి సబ్ కాంట్రాక్టుల రూపంలో ఎటువంటి పనులు చేయకుండానే నగదు చంద్రబాబుకు చేరినట్లు బలమైన ఆధారాలను సేకరించడంతో మీ అభ్యంతరాలను కొట్టి వేస్తున్నామని, పూర్తి వివరాలను మరోసారి అందచేస్తున్నామని, దర్యాప్తునకు సహకరించాల్సిందేనంటూ తాజా నోటీసుల్లో స్పష్టం చేసింది.

స్వైన్ 'ఫ్లో'



- వేగంగా విస్తరిస్తున్న వైరస్
- పదేళ్లలో దేశవ్యాప్తంగా 8,064 మంది మృతి.. 1.47లక్షల మందికి సోకిన వైరస్
- స్వైన్‌ఫ్లూపై తాజాగా నివేదిక విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- చలికాలం వరకు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా స్వైన్‌ఫ్లూ కేసులు నమోదవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా స్వైన్‌ఫ్లూపై ఓ నివేదిక విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం 2014 సంవత్సరం నుంచి ఈ ఏడాది జూలై వరకు అంటే దాదాపు పదేళ్లలో దేశవ్యాప్తంగా 1.47 లక్షల మందికి స్వైన్‌ఫ్లూ వైరస్ సోకింది. అందులో 8,064 మంది చనిపోయినట్టు కేంద్ర నివేదిక వెల్లడించింది. ఆ వివరాలను తెలంగాణ వైద్యారోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. 2015 సంవత్సరంలో అత్యధికంగా దేశంలో 42,592 మందికి స్వైన్‌ఫ్లూ సోకగా, అందులో ఏకంగా 2,990 మంది చనిపోయారు. ఆ తర్వాత అత్యధికంగా 2017లో 38,811 మందికి స్వైన్‌ఫ్లూ వైరస్ సోకగా, అందులో 2,270 మంది చనిపోయినట్టు కేంద్ర నివేదిక తెలిపింది. 2014లో మాత్రం 937 మందికి స్వైన్‌ఫ్లూ రాగా, 218 మంది చనిపోయారు. దేశంలో వాతావరణ పరిస్థితులు, తీసుకునే జాగ్రత్తలపైనే దాని విస్తరణ, మరణాలు ఆధారపడి ఉన్నాయని ఆ నివేదిక వెల్లడించింది.

ఈ ఏడు నెలల్లోనే 2,783 కేసులు

దేశవ్యాప్తంగా ఈ ఏడాదిలో ఈ ఏడు నెలల కాలంలో 2,783 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదు కాగా, 52 మంది చనిపోయారు. గతేడాది దేశంలో 13,202 మందికి సోకగా, 410 మంది చనిపోయారు. ఇవిగాక కొందరు రోగులు నేరుగా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడంతో అవి రికార్డుల్లోకి ఎక్కడంలేదని అంటున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులు స్వైన్‌ఫ్లూ భయం పెట్టి వేలకు వేలు గుంజుతున్నాయి. చివరకు అక్కడ తగ్గకపోవడంతో కొన్ని కేసులు ప్రైవేటు నుంచి ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నట్టు వైద్యాధికారులు చెబుతున్నారు. స్వైన్‌ఫ్లూపై నిరంతర అవగాహన కల్పించడం, నియంత్రణ చర్యలు తీసుకోవడమే పరిష్కారమని నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్ మాదల చెబుతున్నారు.

తెలంగాణలో 8,561 కేసులు

సంవత్సరం	స్వైన్‌ఫ్లూ కేసులు	మరణాలు
2014	78	08
2015	2,956	100
2016	166	10
2017	2,165	21
2018	1007	28
2019	1388	22
2020	446	05
2021	09	-
2022	343	-
2023 జూలైదాకా	03	-

(తెలంగాణవ్యాప్తంగా ఈ పదేళ్లకాలంలో 8,561 మందికి స్వైన్‌ఫ్లూ సోకగా, 194 మంది మృతి చెందారని కేంద్ర నివేదిక తెలిపింది.)

జాగ్రత్తలే శ్రీరామరక్ష...

- గుంపులున్న చోట తిరగకుండా చూసుకోవాలి. గుంపుల్లో తిరిగితే ఒకరి నుంచి మరొకరికి స్వైన్‌ఫ్లూ వైరస్ సోకే ప్రమాదముంది.
- ఎప్పటికప్పుడు చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి. అవకాశముంటే రక్షణ కవచంగా గ్లౌవ్స్ తొడుక్కోవాలి.
- దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, అధిక జ్వరం ఉండి, స్వైన్‌ఫ్లూ అనుమానం వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
- బీపీ, స్థూలకాయం, షుగర్, ఊపిరితిత్తుల సమస్యలున్న వారికి స్వైన్‌ఫ్లూ త్వరగా సోకే అవకాశముంది. కాబట్టి వారు జాగ్రత్తలు తీసుకోవాలి.

స్వైన్‌ఫ్లూ లక్షణాలు...

- తీవ్రమైన జ్వరం వస్తుంది. దగ్గు, జలుబు, ఒళ్లనొప్పులు ఉంటాయి. జ్వరం ఒక్కోసారి అధికంగా ఉంటుంది. తలనొప్పి కూడా తీవ్రంగానే ఉంటుంది.
- పిల్లల్లో కొన్ని సందర్భాల్లో తీవ్రమైన శ్వాస సంబంధిత సమస్య ఎదురవుతుంది. ఒక్కోసారి చర్మం బ్లూ లేదా గ్రే కలర్‌లోకి మారుతుంది. దద్దుర్లు వస్తాయి. ఒక్కోసారి వాంతులు కూడా అవుతాయి. నడవడమూ కష్టంగానే ఉంటుంది.
- ఇక పెద్దల్లో అయితే కొన్ని సందర్భాల్లో శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ఛాతీనొప్పి, కడుపునొప్పి కూడా ఉంటుంది. నిరంతరాయంగా వాంతులు అవుతాయి.

నగర వార్తలు

జపాన్ కంపెనీతో 'హైకావ' ఒప్పందం



మాట్లాడుతున్న షంషుద్దీన్

బంజారాహిల్స్: జపాన్‌కు చెందిన ప్రఖ్యాత ఎయిర్‌కండీషన్ తయారీ సంస్థ హైకావ అప్లయెన్సెస్‌తో తమ ఒప్పందం కుదుర్చుకున్నామని హైదరాబాద్‌కు చెందిన ఎక్స్‌పర్ట్ ఏసీ సొల్యూషన్స్ నేషనల్ ఎయిర్‌కాన్ ఎండీ షంషుద్దీన్ తెలిపారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దక్షిణ భారతదేశంలోనే తాము సూపర్ స్టాకిస్ట్‌లుగా సర్వీస్ ప్రొవైడర్లుగా ఉత్పత్తులను పంపిణీ చేస్తున్నామన్నారు. జపాన్ హైకావాతో ఒప్పందం వల్ల మరింత నాణ్యమైన, మెరుగైన ఉత్పత్తులను అందజేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హైకావ సీఈవో మక్బూల్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

'కోట' కిటకిట



గోల్కొండ కోటలో పర్యాటకులు

గోల్కొండ: సెలవు రోజు కావడంతో పర్యాటక ప్రాంతాలు, పార్కులు కిటకిటలాడాయి. చారిత్రక ప్రాంతమైన గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడి పర్యాటక శోభను సంతరించుకుంది. ఉదయం 9 గంటల నుంచి కోటకు పర్యాటకులు తరలివచ్చారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు కోట అందాలను చూసి ముగ్ధులయ్యారు. కోటలోని సైనికుల గదులు, రాణిమహల్ ఫౌంటెన్ తదితర ప్రాంతాలలో పర్యాటకులు సెల్ఫీలు దిగి సంబరపడ్డారు. మరోవైపు కుతుబ్‌షాహి సమాధుల ప్రాంగణమైన సెవన్ టూంబ్స్ సైతం పర్యాటకులతో కిటకిటలాడింది. ఖుతుబ్‌షాహి రాజుల సమాధుల అందాలను చూసి పలువురు పర్యాటకులు ఆశ్చర్యపోయారు. మరోవైపు గోల్కొండ డెక్కన్ పార్క్, మాసబ్ ట్యాంక్‌లోని చాచా నెహ్రూ పార్కులు సైతం పిల్లలు, మహిళలతో సందడిగా మారాయి.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఏపీ లోకాయుక్త చైర్మన్ జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి
- ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న దృశ్యం



ప్రాణదాత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ రాయలసీమ ఫోరం నాయకులు

కూకట్‌పల్లి: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తే ప్రాణదానంతో సమానమని... ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి హనుమంతరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీకాలనీ రమ్యా గ్రౌండ్స్‌లో గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ క్యాంప్‌నకు పరిసర ప్రాంతాల ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఫోరం ప్రధాన కార్యదర్శి రాఘవబాణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రాణదాత పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్, గైనకాలజీ, ఆర్థో, కార్డియాలజీ, కంటి, దంత తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం పలువురికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫోరం నాయకులు మాట్లాడుతూ... గ్రేటర్ హైదరాబాద్ రాయలసీమ ఫోరం తెలంగాణ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నగరంలో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి అతిథులుగా 'సాక్షి' ఫైనాన్స్ డైరెక్టర్ వై.ఈశ్వర ప్రసాద్‌రెడ్డి, మంజీరా మాల్ కన్‌స్ట్రక్షన్స్ సీఎండీ గజ్జల యోగానంద్, సీనియర్ జర్నలిస్టు ఎం.ఇ.వి. ప్రసాద్ రెడ్డి, కిన్నెర వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ నాగచంద్రికా దేవి, శ్యామలా రెడ్డి, రాంరెడ్డి, రమణారెడ్డి, లయన్ మధు, సుబ్బారెడ్డి, బద్రీనాథ్, బండి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కృషి జ్యోతి, నిరంజన్ దేశాయ్, ప్రవీణ్ రెడ్డి, రాజా మోహన్ రెడ్డి, అంజన్‌కుమార్‌యాదవ్, నాగేశ్వర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రాజేష్, భరత్‌కుమార్ రెడ్డి, సాయికుమార్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఐస్‌క్రీమ్ వెంకట్‌రెడ్డి, మధుసూదన్ చౌదరి, పద్మ, తనూజ, వాసంతి, చిదానంద, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి నేడు



పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ద్వంద్వవైఖరి ప్రదర్శిస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. సాధ్యంకాని వర్గీకరణ కోసం అన్నదమ్ముల్లాంటి మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టేందుకు చూస్తున్నారని ధ్వజమెత్తారు. కిషన్‌రెడ్డి చర్యలకు వ్యతిరేకంగా సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆదివారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ... పలు బిల్లులు ఆమోదం తెలిపేందుకు బీజేపీ ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఒత్తిళ్లకు తలొగ్గి వర్గీకరణ బిల్లు తీసుకొస్తే బీజేపీకి రాష్ట్రంలో పుట్టగతులు లేకుండా చేస్తామని హెచ్చరించారు. వర్గీకరణ సాధ్యం కాదని, పార్లమెంట్ సాక్షిగా కేంద్ర సామాజిక సాధికారత మంత్రులు పార్లమెంట్‌లో ప్రకటించినా, దేశంలో మెజారిటీ రాష్ట్రాలు వర్గీకరణకు ఒప్పుకోకపోయినా ఇది జాతీయ సమస్య అని ప్రకటించినా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టేందుకు కొన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఆర్‌పీఎస్ నాయకునివలే వ్యవహరిస్తున్నారని.. కేంద్ర మంత్రిగా ఉండి ఒకవర్గానికి కొమ్ముకాస్తున్న కిషన్‌రెడ్డిని పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో ఆయన ఎక్కడనుండి పోటీ చేసినా తప్పక మాల అభ్యర్థులను అక్కడ పోటీలో దింపి ఓడిస్తామని హెచ్చరించారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు జరిగే సమయంలో మాల మహానాడు ఆధ్వర్యంలో ఢిల్లీకి వెళ్లి అక్కడ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన, పలు పార్టీల అధ్యక్షులు, నాయకులను కలిసి వినతిపత్రాలు ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శ్రీధర్, నగర అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గోకుల కళ్యాణ్ పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

తెలంగాణ రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్స్ వర్కర్స్ ఫెడరేషన్

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు ట్రాన్స్‌పోర్ట్స్ వర్కర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రోడ్ ట్రాన్స్‌పోర్ట్స్ వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాములు కోరారు. కాటేదాన్‌లోని కార్యాలయంలో తెలంగాణ రోడ్ ట్రాన్స్‌పోర్ట్స్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాములు మాట్లాడుతూ... గత ఎన్నికలప్పుడు రవాణా రంగానికి సంబంధించిన కొన్ని టాక్స్‌లను రద్దు చేస్తామని, రవాణా రంగ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్స్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆమిన్, కార్యదర్శి రుద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు దేవేందర్, శ్రీనివాస్, సర్దార్ భాయ్, ఎండీ మహమ్మదీన్, జహంగీర్, సలీం, నరేష్, వెంకటేష్‌గౌడ్, రాజేంద్రనగర్ సీఐటీయూ సీనియర్ నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి వెంకటయ్య పాల్గొన్నారు.

టెలివిజన్ కార్మికులకు ప్రభుత్వం అండ

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

వెంగళరావునగర్: టెలివిజన్‌లోని అన్ని రంగాల్లో విధులు నిర్వహించే కార్మికులందరికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లో ఏర్పాటు చేసిన తెలుగు టెలివిజన్, డిజిటల్ మీడియా టెక్నీషియన్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యాలయాన్ని మంత్రి తలసాని, బీఆర్‌ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌లు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ... కార్మికులకు ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా తనకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ... టీవీ కార్మికుల 24 క్రాఫ్ట్‌ల యూనియన్లు అన్నీ ఒకే చోట ఒకే భవనంలో కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడానికి 1500 గజాల స్థలం ఉంటే చెప్పాలని, ప్రభుత్వంతో మాట్లాడి దానిని మీకు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. తాను కూడా గతంలో సినిమాకు చెందిన వ్యక్తినేనని అందువల్ల కార్మికుల కష్టాలు తనకు తెలుసన్నారు. తెలుగు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కూర్మాచలం, కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, టీవీ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాకేష్, పి.విజయ్‌కుమార్, కోశాధికారి నరేందర్ రెడ్డి, టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపకులు నాగబాల సురేష్‌కుమార్, నిర్మాతల మండలి అధ్యక్షులు ఎ.ప్రసాదరావు, ఫెడరేషన్ వైస్ చైర్మన్ మురళీమోహన్‌రాజ్, ఈశ్వర్, రాజు, ఖుద్దూస్, రమేష్, సంపత్, మహిపాల్, దేవి, గండు మూర్తి పాల్గొన్నారు.

అనువాదకుల సంఖ్యను పెంచాలి

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్
- రవీంద్రభారతిలో 'ఎలనాగ' పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో/గన్‌ఫౌండ్రీ: తెలుగు నుంచి ఆంగ్లానికి అనువాదం చేసే అనువాదకుల సంఖ్యను విస్తృతంగా పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. హైస్కూలు స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు వేల సంఖ్యలో ఆంగ్లంపై పట్టు సాధించిన అధ్యాపకులున్నారని చెప్పారు. ప్రముఖ విమర్శకులు, కవి, ఎలనాగ రచించిన 4 పుస్తకాలను ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో ఆవిష్కరించారు. ఎలనాగ రచనలు 'ఉద్రూత' కవితా సంపుటిని అమ్మంగి వేణుగోపాల్, 'శవాలను మోసేవాడి కథ' అనువాద నవలను డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, 'జాజ్జ్‌లర్స్' ఆంగ్ల మినీ కవితా సంపుటిని ప్రొఫెసర్ సి.లక్ష్మీనారాయణ, 'ఆత్మగానం' కవితా సంపుటిని ప్రొఫెసర్ జి.చెన్నకేశవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన గౌరీశంకర్ మాట్లాడుతూ... మనకున్న ఆంగ్ల బోధకుల ప్రతిభ అసమాన్యమైనదని, వారిలోంచి వందల సంఖ్యలో సృజనాత్మక అనువాద రచయితలుగా మలచుకుని తీర్చిదిద్దుకోవచ్చన్నారు. 'ఎలనాగ' వంటి కవి, అనువాద రచయితలుండటం తెలంగాణకు గర్వకారణమన్నారు. 'ఎలనాగ' సృజనాత్మకత ఉట్టిపడేలా కవిత్వం రాయగలరని శక్తివంతంగా అనువాద రచనలు చేయగలరని వివరించారు. ఇప్పటి వరకు 37 గ్రంథాలను వెలువరించారని తెలిపారు. తెలుగు నుంచి ఆంగ్లానికి అనువాదాలు చేసే పనిలో సాహిత్య అకాడమీ తన వంతు పాత్ర పోషిస్తుందన్నారు. అమ్మంగి వేణుగోపాల్ అధ్యక్షత వహించగా గౌరవ అతిథిగా విచ్చేసిన ఒడిశా ఐఏఎస్ అధికారి, ప్రముఖ ఒడియా కవి ప్రదీప్ బిస్వాల్, ప్రముఖ కవులు ప్రొ.పి.లక్ష్మీనారాయణ, అనువాదకుడు, రచయిత, కవి 'ఎలనాగ' తదితరులు మాట్లాడారు.

సుస్థిరాభివృద్ధిలో వ్యవసాయ రంగానిది ప్రధాన భూమిక

- నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు
- ఘనంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం



మాట్లాడుతున్న నల్సార్ యూనివర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవరావు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 9వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు స్మారకోపన్యాసం చేశారు. సుస్థిరాభివృద్ధి–వ్యవసాయం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఇటీవల తమ విశ్వవిద్యాలయం రైతుల కోసం అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్స్ పేరిట కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని సూమారు 50 ఏళ్ల క్రితమే సుస్థిరాభివృద్ధి భావనపై చర్చ మొదలైందన్నారు. మానవాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలను విడదీయలేమన్నారు. సహజ వనరులను పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడమనేది మన ముందున్న సవాలు అని ఆయన అభిప్రాయపడ్డారు. సుస్థిరాభివృద్ధిలో వ్యవసాయ రంగానిది ప్రధాన భూమిక అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, ఐకార్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఇ.ఎ.సిద్ధిఖీకి పీజేటీఎస్‌ఏయూ జీవిత కాల పురస్కారాన్ని ప్రదానం చేశారు. అత్యుత్తమ పనితీరు కనపర్చిన బోధన పరిశోధన, బోధనేతర సిబ్బందికి, ఉత్తమ రైతులకు పురస్కారాలను అందజేశారు.



జీవిత కాల పురస్కారాన్ని అందుకుంటున్న ఐకార్ మాజీ డైరెక్టర్ జనరల్ సిద్ధిఖీ

మంచిమాట

మెట్ట వేదాంతం..?



వేదాంతం అనే మాట తెలుసు అందరికీ, అర్థం సరిగ్గా తెలిసినా లేకపోయినా. ఇంతకీ ఈ మెట్టవేదాంతం ఏమిటి? కాని, ఈ మాటని చాలామంది పెద్దవాళ్ళు వాడుతూ ఉంటారు. మాగాణి వేదాంతం మరొకటి ఉందా? దీనికీ, దానికీ తామరకి, మెట్టతామరకి మధ్య ఉన్నంత తేడా ఉంటుందా? తామర, మెట్టతామర రెండూ పూలు. అంతే వాటి సంబంధం. ఒకటి నీళ్ళలో, మరొకటి నేల మీద పెరుగుతాయి. కాని, వేదాంతానికి మెట్ట వేదాంతానికి ఉన్నది మరొక రకమైన సంబంధం.

వేదాంతం ఒక శాస్త్రం. అన్ని వేదాలు క్షుణ్ణంగా చదివిన తరువాత గురువు సమీపంలో కూర్చుని వేదాలలోని మర్మాలు తెలుసుకుంటాడు శిష్యుడు. ప్రశ్నోత్తరాల రూపంలో ఉన్న ఆ సంభాషణలని ఉపనిషత్తులు అని అంటారు. వేదాధ్యయనం అయిన తరువాత తెలుసుకునే భాగాలు కనుక వేదాంతంగా పరిగణించబడినాయి. సమస్తం భగవంతుడి స్వరూపంగా భావించ గలగటం అప్పటికి అభ్యాసం అయి ఉంటుంది. అందువల్ల వేదాంతం వంట పట్టిన వారు సామాన్య భక్తులలాగా పూజాదికాలకి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వరు. నిరంతరం సర్వవ్యాపి అయిన పరబ్రహ్మతత్త్వాన్ని ధ్యానం చేస్తూ, వివేచన చేస్తూ, అనుభూతి చెందటానికి ప్రయత్నం చేస్తూ ఉంటారు.

అటువంటి వారు చెప్పే మాటలని పూర్తిగా అర్థం చేసుకోకుండా కేవలం ఒకటి, రెండు మాటలని పట్టుకుని తమకి అనుకూలంగా వాడుకుంటారు కొంతమంది. కొంతమంది తెలియక కూడా ఆ విధంగా చేస్తారు. అంటే వేదాంత పరిభాషని తన ప్రవర్తనని సమర్థించుకునేందుకు చేసే ప్రయత్నం అని చెప్పవచ్చు. ఇటువంటి సందర్భాలు మనకి అడుగడుగునా, కోకొల్లలుగా కనిపిస్తూ ఉంటాయి. ''అన్నమైతేనేమిరా? మరి, సున్నమైతే నేమిరా?'' అని అన్నానికి సున్నానికి తేడా లేదని అంతా సమానమేనని ఇంటిముందు అడుక్కునేందుకు వచ్చిన సన్న్యాసి పాడుతాడు. 'అబ్బా ఎంత వైరాగ్యం!' అని అనుకుంటూ ఉంటే ఇట్లా కొనసాగిస్తాడు – ''అందుకే ఈ పాడు పొట్టకి అన్నమే వేదాము రా! పప్పన్నమే వేదాము రా! నెయ్యన్నమే వేదాముర! పెరుగన్నమే వేదాము రా!'' అంటాడు.

అంతటితో ఆగడు. ''చీరలైతేనేమిరా? మరి, నారలైతే నేమిరా? అందుకే ఈ పాడు ఒంటికి చీరలే కడదామురా! పట్టుచీరలే కడదామురా!'' ఇట్లా కొనసాగుతూ ఉంటుంది ఆ పాట. ఇటువంటి వాటిని తత్త్వాలు అంటారు. తన శక్తి మేరకు పనిచేసి ఫలితం ఏమైనా పట్టించుకోకపోవటం వేదాంతి అయిన వాడు చేసే పని. కాని, వేదాంత ప్రసంగాలు విని, విని కొన్ని ఊతపదాలు మనకి అలవాటై పోయాయి.

''మన చేతుల్లో ఏముంది?'', ''ఎట్లా రాసి ఉంటే అట్లా జరుగుతుంది'' అంటూ చేతులు ముడుచుకుని కూర్చునేవారు, తమ బద్ధకానికి, చేతకానితనానికి వేదాంతపు ముసుగు వేసుకున్నారు అని అర్థం చేసుకోవాలి.

> **అన్నానికి సున్నానికి తేడా లేదనటం వేదాంతం. అందుకని రకరకాల అన్నాలు వేద్దామనే నిర్ణయానికి రావటం మెట్టవేదాంతం. ఈ రెండింటికి తేడా లేదని చెప్పటం దంతవేదాంతం. ఆచరణలో చూపటం అసలైన వేదాంతం. రుచికరమైన ఆహారం తినకూడదని కాదు దీని అర్థం. అది కావాలని కోరకూడదు. దొరికినది ఏది అయినా ఒకే భావనతో తినగలగాలి. అట్లాగే ఎట్లాగైనా ఉండగలగాలి. అంటే పట్టుపరుపులైనా, నేలమీదైనా ఒకే రకం గా నిద్రించటం వేదాంతి లక్షణం అయితే, రెండూ ఒకటే కనుక పట్టుపరుపులే కావాలనుకోవటం మెట్టవేదాంతం.**

ఇటువంటి వారి వల్లనే మన ధర్మానికి, వేదాలకి, వేదాంతానికి చెడ్డపేరు వస్తోంది. మనం మెట్టవేదాంతులం కాకుండా ఉంటే చాలు. అటువంటి వారి నుండి దూరంగా ఉండటం మంచిది.

– డా.ఎన్. అనంతలక్ష్మి


బౌద్ధవాణి

చిత్తశుద్ధితో చిత్త ఏకాగ్రత

పూర్వం మునులు, తాపసులు, యోగులు, రుషులు, భిక్షువులు, బైరాగులు, శ్రమణులు అనే రకరకాల ముని సంప్రదాయాలు పాటించేవారు ఉండేవారు. భీషణ తాపసులు, కఠోరయోగసాధకులూ ఉండేవారు. లౌకిక సుఖాల్ని వదిలి, మోక్షమార్గం కోసం అన్వేషించే వీరందరూ తమ తమ సాధనలో లీనమైపోయేవారు.

బుద్ధుడు కూడా, శరీరాన్ని ఎండకట్టుకుని, ఆహారం మాని, ఎముకల గూడులా మారాడు. శక్తి హీనుడై నీరసించి పడిపోయాడు. మోక్షసాధనకు ఇలాంటి కఠోరసాధన సరైన మార్గం కాదని గ్రహించి, ధ్యానం అనే నూతన విధానాన్ని ఆవిష్కరించాడు. శరీరాన్ని అటు పూర్తిగా సుఖాల్లో ముంచి తేల్చకుండా, ఇటు కఠోరంగా శిక్షించి ఎండకట్టుకోకుండా ఉద్యమ మార్గంలో సాధన సాగించాడు. ఎరుకలో ఉంటూ, ఏకాగ్రతను సాధించే గొప్ప సాధన ఇది.

రకరకాలుగా సాగే సాధనల్లో ఎవరు నమ్మిన మార్గంలో వారు సాధన సాగించేవారు. ఇలాంటి సాధకులంటే కొందరికి తగని కోపం. వారి ఏకాగ్రతని చెడగొట్టాలని, మోక్షమార్గాన్ని వారికి అందకుండా చేయాలని తీవ్రంగా ప్రయత్నించే వారు. కొందరు సాధకులు ఆ ప్రలోభంలో పడి దొంగ జపాలు చేయడం మొదలుపెట్టారు. కేవలం కదలకుండా కూర్చుని కళ్ళు మూసుకుని ఉండేవారు. చిత్తాన్ని మాత్రం స్థిరంగా ఉంచేవారు కాదు. చిత్తం చంచలమై ఉంటే... దేహం, వేషం మాత్రం ధ్యానంలో ఉన్నట్లు నటించేవారు. దీనితో కొందరు... నదీతీరంలో చేపల్ని పట్టడం కోసం ఒంటి కాలి మీద కొంగలా జపం చేసేవారు. ఇంకొందరు కొమ్మమీద కదలకుండా కూర్చొని, సగం కన్నులు మూసి ఎలుక కోసం చూసే గుడ్లగూబలా ధ్యానించేవారు.



మరికొందరు... పేడపోగుల వద్ద బొమ్మలా కదలక మెదలక కూర్చుండి ఎలుకల కోసం పొంచి చూసే పిల్లుల్లా యోగసాధన నటించేవారు. ఇంకొందరు.. బరువులు దించాక చెట్టు నీడకు చేరి, కళ్ల మూసుకుని శిలాప్రతిమలా నిలబడిపోయే గాడిదలా ఉండేవారు. అలా ఉండి గౌరవాన్ని పొందుతూ ఉండేవారు. ఏ మోక్షం కోసం ఏ ఏకాగ్రత కోసం, ఏ చిత్తాన్ని మలిన రహితం చేయడం కోసం సాధన సాగించారో దాన్ని మరచేవారు. అకుశల కర్మల్ని నమ్మినివారు, వాటిని దూరంగా పెట్టిన వారు మాత్రం నిగ్రహులై నిర్మల చిత్తులై... నిర్వాణ మార్గాన్ని పొందగలిగారు.

బుద్ధుడు చెప్పిన ఈ కంటకులు ఎవరంటే... మనసులోని దోషభావాలే. తప్పుడు ఆలోచనలే అకుశల కర్మలే! వీటికి లొంగిన వారు దొంగ సాధకులై తమ సాధనని ముక్తికి మార్గంగా, వ్యాపారంగా మార్చుకుని అనైతికంగా జీవిస్తారు. ఈ విషయం గురించి భిక్షువులకు బోధిస్తూ...

''భిక్షువులారా! కోర్కెలు మనవెంట పడవు. మనమే వాటివెంట పడతాం. నేను మూర్ఖుణ్ణి దహిస్తాను. దహించాలి అని అగ్ని అనుకోదు. మూర్ఖుడే మండే అగ్నిని తాకి తనకు తాను కాల్చుకుంటాడు. కాబట్టి మీరు మీ చిత్తాన్ని మరల్చకండి. స్థిరంగా, బలంగా మార్చుకోండి. అప్పుడు దోషాలు మన దరికే చేరవు.'' అని చెప్పాడు. చిత్తశుద్ధితో చిత్త ఏకాగ్రత సాధించాలి అని భిక్షువులు గ్రహించారు.

– డా. బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

కళలు వర్షించాలి

అన్నార్భవంతు భూతాని... అసలు ప్రాణుల పుట్టుకకు, మనుగడకు అన్నం కావాలి. అన్నం దొరకాలంటే భూమికి ఆర్ద్రత ఉండాలి. ఆకాశంలో నుంచి పడిన వర్షంతో భూమి అంతా చెమ్మగిల్లి మొక్కలు పుట్టినట్లు, ఒక దేశసంస్కృతి నిలబడాలంటే కళలు.. అనే వర్షం కావాలి. కళల ద్వారా సంస్కృతి పెరుగుతుంది. సంస్కృతి పెరిగితే ప్రజల ఆచార వ్యవహారాలు, జీవనశైలి, నడవడిక, ఆ దేశపు కీర్తిప్రతిష్ఠలు నిర్ణయింప బడతాయి. కళలు... అంటే కవిత్వం, శిల్పం, నృత్యం, వాద్యం.. ఎప్పుడూ అవతలివారికి సంస్కృతిని కల్పించేవి అయి ఉంటాయి. ఇవన్నీ కళలు కాబట్టి ఇవి వర్షం లాంటివి. అవి సంస్కృతిని మొలకెత్తించడానికి కారణం కావాలి.

మన దేశానికి ఇన్ని కీర్తిప్రతిష్ఠలు రావడానికి కారణం ఏమిటి? భగవద్గీత పుట్టిన భూమి. రామాయణం, భారతం, భాగవతం వంటివి పుట్టిన భూమి. గంగానది ప్రవహిస్తున్న భూమి. ఒకనాడు తాళంకప్ప అవసరం తెలియని భూమి. సంస్కృత భాషలో తాళంకప్ప అన్నదానికి పదం లేదు.. ఆ అవసరం రాలేదు. కారణం – పరద్రవ్యాణి లోష్ఠవత్... రహదారిమీద రాయి దొరికితే నాది కాదు అని ఎలా అంటామో అలాగే నాది కానిదేదీ, పరవాడివస్తువు ఏదయినా నాకు దొరికితే నాది కాదు కాబట్టి అది నాకు రాయితో సమానమే... అన్న భావన. అదీ ఈ దేశ సంస్కృతి. ఇది ఎక్కడినుంచి వచ్చింది? రామాయణంలోనుంచి, భారతంలోంచి.. వచ్చింది. నీదికానిది నీవు కోరుకుంటే .. పతనమయిపోతావన్న హెచ్చరిక... దాని జోలికి వెళ్ళనీయదు.



కళలు ఈ దేశపు సంస్కృతిని ప్రతిబింబించేవి అయి ఉంటాయి. మీరు ఏది వింటున్నా, ఏది చూస్తున్నా, మన శ్శాంతికి కారకమైన భగవంతుని తత్త్వాన్ని ఆవిష్కరింప చేసేవిగా ఉంటాయి. ఒక నృత్యం జరుగుతోంది. 'కస్తూరీ తిలకం లలాటఫలకే వక్షస్థలే కౌస్తుభమ్ నాసాగ్రే నవ మౌక్తికమ్...' అంటూ సాగుతున్న కీర్తనకు నర్తకి అభినయిస్తుంటే నర్తకి క్రమేణా కనుమరుగై కృష్ణపరమాత్మ కనబడడం మొదలవుతుంది. పాట అభినయంగా మీకు శ్రీకృష్ణ దర్శనం చేయించి, మీ ఉద్వేగాలను శాంతపరుస్తుంది. పాలగిన్నె కింద అగ్నిహోత్రం పెడితే పాలు పొంగుతాయి. నీళ్ళు చల్లితే పొంగు చల్లారుతుంది.

అలా మనదేశంలో ఉన్న కళలు మన భావోద్వేగాలను అణచి ప్రశాంతతను, మనశ్శాంతిని కల్పించడానికి ఉపయుక్తమయ్యాయి. అందుకే ప్రపంచ వ్యాప్తంగా కీర్తిని, ఆదరణనూ పొందాయి. ఈ కళలన్నీ శాంతిని ప్రసాదించగల దివ్యత్వాన్ని సంతరించుకున్నాయి. ఇవన్నీ కూడా వేదాలకు ఉపవేదాలయినటువంటి వాటినుండీ వచ్చాయి. సామవేదానికి గాంధర్వ వేదం ఉపవేదం. మిగిలినవి ఇతర వేదాలకు ఉపవేదాలు. వేదానాం సామవేదోస్మి... అన్నాడాయన. ఎందుకు అంతస్థాయిని పొందింది? అంటే తినడం ఒక్కటే కాదు, శరీరం పెరగడం ఒక్కటే కాదు ప్రధానం, అది ఎంత అవసరమో, మనసు సంస్కారవంతంగా తయారు కావడం కూడా అంతే ప్రధానం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా రీల్స్

నీటిలో డిష్యుం డిష్యుం



● ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్–డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న సినిమా 'దేవర'. ఈ సినిమాలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయి. అందులో భాగంగా ఇప్పటికే తొలి షెడ్యూల్‌లో షిప్‌లో ఓ పోరాట సన్నివేశాన్ని చిత్రీకరించారు కొరటాల శివ. తాజాగా 'దేవర'లో కీలకంగా ఉండే మరో భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని ఆరంభించారని టాక్. పూర్తిగా నీటిలో సాగే ఈ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలైట్‌గా ఉంటుందని భోగట్టా. దాదాపు 20 రోజుల పాటు ఈ ఫైట్‌ని చిత్రీకరించనున్నారట మేకర్స్. ఈ యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా వచ్చేందుకు ఎన్టీఆర్ మూడు రోజులు ప్రత్యేక శిక్షణ తీసుకున్నారట. ఫైట్ మాస్టర్ కింగ్ సోలొమన్ ఈ సీక్వెన్స్‌ని డిజైన్ చేసినట్లు సమాచారం. ఇక ఈ చిత్రం ద్వారా నటి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ తెలుగు చిత్ర పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయమవుతున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర చేస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది.

నవంబర్‌లో సలార్?

ప్రభాస్ హీరోగా నటించిన తాజా పాన్ ఇండియా ఫిల్మ్ 'సలార్'. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకురానుంది. తొలి భాగం'సలార్: పార్ట్ 1–సీజ్‌ఫైర్' ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్లు తొలుత మేకర్స్ ప్రకటించారు. అయితే గ్రాఫిక్స్ ఇంకా పూర్తి కాకపోవడంతో చిత్రం విడుదలని వాయిదా వేయాలనుకుంటున్నారని టాక్. ఈ నేపథ్యంలో క్రిస్మస్ కానుకగా డిసెంబరులో అని, సంక్రాంతి సందర్భంగా జనవరిలో రిలీజ్ చేస్తారంటూ వార్తలు వినిపిస్తున్నాయి. దాంతో అసలు 'సలార్'ను ఎప్పుడు రిలీజ్ చేస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం ఈ సినిమాని నవంబర్‌లో విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'సలార్'లో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించగా, జగపతిబాబు, పృధ్వీరాజ్ కీలక పాత్రలు చేశారు.



● ప్రభాస్

గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌కి ఇదో వేదిక

''సౌత్‌లోని అన్ని చిత్రపరిశ్రమలూ కలిసి జరుపుకునే వేడుక సైమా. పదకొండేళ్లుగా నేనీ వేడుకల్లో భాగమవుతున్నాను. గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌కి చేరుకోవడానికి ఇదొక గొప్ప వేదిక. దుబాయ్‌లో కలుద్దాం'' అన్నారు రానా.

– రానా

'సైమా' (సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) 2023 అవార్డ్స్ వేడుక ఈ నెల 15, 16 తేదీల్లో దుబాయ్‌లో జరగనుంది. ఈ వేడుక విశేషాలు తెలియజేయడానికి ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రానా పాల్గొన్నారు.



● శశాంక్ శ్రీవాత్సవ్, నిధీ అగర్వాల్, బృందా ప్రసాద్, రానా, మీనాక్షి

''సైమా వేడుక అన్ని చిత్ర పరిశ్రమలకు ఒక రీ యూనియన్ లాంటిది'' అన్నారు సైమా చైర్ పర్సన్ బృందా ప్రసాద్. ''సైమా వేడుకల్లో ఇదివరకు పాల్గొన్నాను. మళ్లీ ఈ వేదిక పంచుకోవడం ఆనందంగా ఉంది'' అన్నారు నిధీ అగర్వాల్. ''తొలిసారి సైమా వేడుకల్లో పాల్గొనబోతున్నాను'' అన్నారు మీనాక్షీ చౌదరి. ఈ సమావేశంలో శశాంక్ శ్రీవాస్తవ్ పాల్గొన్నారు.

రాజాధి రాజ.. రాజ గంభీర

'రాజాధి రాజ.. రాజ గంభీర.. రాజ మార్తాండ.. రాజ కుల తిలక.. వేట్టయ రాజు వేంచేయనున్నారు' అంటూ 'చంద్రముఖి 2' సినిమా ట్రైలర్ విడుదలైంది. రాఘవ లారెన్స్, కంగనా రనౌత్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'చంద్రముఖి 2'. రజనీకాంత్ హీరోగా నటించిన 'చంద్రముఖి' (2005) సినిమాకి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం ఇది. తొలి భాగానికి దర్శకత్వం వహించిన పి. వాసునే రెండో భాగాన్ని తెరకెక్కించారు. లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం వినాయక చవితి సందర్భంగా ఈ నెల 15న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. తెలుగులో రాధాకృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై వెంకట్ ఉప్పుటూరి, వెంకట రత్నం శాఖమూరి రిలీజ్ చేస్తున్నారు. 'చంద్రముఖి 2' ట్రైలర్‌ని ఆదివారం విడుదల చేశారు. ట్రైలర్‌లో హారర్, థ్రిల్లింగ్, కామెడీ అంశాలను చూపించారు. ఈ చిత్రంలో వేట్టయ రాజుగా, మరో పాత్రలో లారెన్స్ కనిపిస్తారు. చంద్రముఖిగా కంగనా నటించారు. వడివేలు, లక్ష్మీ మీనన్, మహిమా నంబియార్, రాధికా శరత్ కుమార్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి.



● రాఘవ లారెన్స్

నటుడు త్రిగుణ్ (అరుణ్ ఆదిత్) ఓ ఇంటివాడయ్యారు. నివేదితతో ఆయన ఏడడుగులు వేశారు. తమిళనాడులోని తిరుపూరులో ఆదివారం తెల్లవారుజామున 5.45 గంటలకు వీరి వివాహం జరిగింది. ఇరు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో జరిగిన ఈ వివాహానికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. కాగా 'పీఎస్‌వీ గరుడ వేగ, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ, డియర్ మేఘ, కొండా, చీకటి గదిలో చితక్కొట్టుడు, ప్రేమదేశం, 24 కిస్సెస్, కథ కంచికి.. మనం ఇంటికి, తుంగభద్ర..' వంటి పలు తెలుగు చిత్రాల్లో నటించారు త్రిగుణ్.



మధ్య తరగతి కుర్రాడి కథ

గౌతం కృష్ణ హీరోగా, శ్వేత అవస్థి, రమ్య పసుపులేటి హీరోయిన్లుగా పి. నవీన్‌కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్‌పై సెవెన్ హిల్స్ సతీష్‌కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా మూడు షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా పి. నవీన్ కుమార్ మాట్లాడుతూ– ''ఒక స్టూడెంట్ నుంచి కార్పొరేట్ స్థాయికి ఎదిగిన మధ్య తరగతి కుర్రాడి కథతో ఈ సినిమా రూపొందుతోంది. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ని మా సినిమా అలరిస్తుంది'' అన్నారు. ''త్వరలో మా సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేస్తాం'' అన్నారు సెవెన్ హిల్స్ సతీష్ కుమార్. పోసాని కృష్ణమురళి, అనితా చౌదరి, షఫీ, ఆర్కే మామ, ఆనంద్ చక్రపాణి తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: త్రిలోక్ సిద్ధు, సంగీతం: జుడా శాండీ.



● పోసాని కృష్ణ మురళి, గౌతం కృష్ణ, శ్వేత

బాసూ రెడీయా...

'ఏం బాసూ రెడీయా.. వెల్ కమ్ టు ది వరల్డ్ ఆఫ్ మార్క్ ఆంటోని' అనే డైలాగ్స్‌తో 'మార్క్ ఆంటోని' ట్రైలర్ ఆరంభం అయింది. విశాల్ పలు షేడ్స్‌లో టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం ఇది. పాన్ ఇండియా మూవీగా ఈ చిత్రాన్ని అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఎస్. వినోద్ కుమార్ నిర్మించారు. ఈ నెల 15న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఆదివారం ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో రానా విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ – ''ఈ చిత్రంలో మంచివాడిగా, విలన్‌గా, గుండుతో స్టైలిష్‌గా, తండ్రిని కాపాడుకోవాలనుకునే వ్యక్తిగా... ఇలా పలు షేడ్స్‌లో విశాల్ కనిపిస్తారు. ఓ టైమ్ మిషన్ కాకుండా ఓ ఫోన్ హీరోని గతానికి తీసుకెళ్తే తనేం చేశాడనే కథాంశంతో 'మార్క్ ఆంటోని'ని రూపొందించాం'' అన్నారు. ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, సునీల్, సెల్వ రాఘవన్, రీతూ వర్మ తదితరులు కీలక పాత్రలు చేశారు.



● విశాల్

తారంగ హిట్టవ్వాలి


– ఎంపీ దయాకర్



● సంపత్, నవీన్, దయాకర్

''తారంగ' ట్రైలర్ చూస్తుంటే బలమైన కథతో దర్శకుడు చక్కగా తీశాడనిపిస్తోంది. చిన్న సినిమాగా తెరకెక్కిన 'సారంగ' హిట్టయి, పెద్ద సినిమా అవ్వాలి'' అన్నారు వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్. కట్ల ఇమ్మోర్టల్, కట్ల డాండి, పూజ నాగేశ్వర్ కీలక పాత్రల్లో సంపత్ కుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'తారంగ'. శ్రీనివాస రెడ్డి కర్రి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ను పసునూరి దయాకర్, గ్లింప్స్‌ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన నవీన్ యాదవ్ విడుదల చేశారు. నిర్మాత టి. రామ సత్యనారాయణ, దర్శకుడు శివ నాగు, నైజాం డిస్ట్రిబ్యూటర్ రాజేంద్ర ప్రసాద్ ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''సస్పెన్స్ థ్రిల్లర్ లవ్‌స్టోరీగా మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం సాగుతుంది'' అన్నారు సంపత్ కుమార్, శ్రీనివాస రెడ్డి కర్రి.

ఆప్యాయనురాగాలతో..



● మంజునాథ, మహేశ్, శివరామ్

పులివెందుల మహేశ్, ప్రియా పాల్ జంటగా శివరామ్ తేజ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి సిన్మా'. జి. మంజునాథ్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా నవంబరులో విడుదల కానుంది. ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో పీపుల్ మీడియా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కానుల రామకృష్ణ (శ్రీధర్), నటులు నాగమహేశ్, 'బలగం' సంజయ్ అతిథులుగా పాల్గొన్నారు. ''ఇంత మంచి సినిమాను నిర్మించడానికి సహకరించినవారికి థ్యాంక్స్'' అన్నారు జి. మంజునాథ రెడ్డి. ''యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అన్నారు శివరామ్ తేజ. ''తండ్రీకొడుకుల అనురాగం, బావా–మరదళ్ల ఆప్యాయతతో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు పులివెందుల మహేశ్.

ప్లాంట్ మాన్ ప్రయోగం



● ప్లాంట్ మాన్ పోస్టర్

'కాలింగ్ బెల్, రాక్షసి' వంటి హారర్ చిత్రాలు తెరకెక్కించిన దర్శకుడు పన్నా రాయల్ దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందిన చిత్రం 'ప్లాంట్ మాన్'. డీఎం యూనివర్సల్ స్టూడియోస్ స్థాపించి కె. సంతోష్‌బాబుని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని నిర్మించారు పన్నా రాయల్. ''సైంటిఫిక్ కామెడీ మూవీగా ఈ చిత్రాన్ని నిర్మించాం. ఒక కొత్త తరహా ప్రయోగంతో పూర్తి వినోద ప్రధానంగా రూపొందించాం'' అన్నారు పన్నా రాయల్. ఇక ప్రస్తుతం పన్నా రాయల్ దర్శకత్వంలో రూపొందిన 'ఇంటి నెం.13' చిత్రం త్వరలో విడుదల కానుంది.



భారత్ నుంచి హర్మన్‌ప్రీత్ మాత్రమే...

ఆస్ట్రేలియాలో జరిగే మహిళల బిగ్‌బాష్ లీగ్ టి20 టోర్నీకి సంబంధించి ఆదివారం విదేశీ క్రికెటర్ల డ్రాఫ్ట్ కార్యక్రమం జరిగింది. ఇందులో మొత్తం 116 మంది విదేశీ క్రికెటర్లు తమ పేర్లను నమోదు చేసుకోగా... ఎనిమిది ఫ్రాంచైజీలు 17 మందిని ఎంపిక చేసుకున్నాయి. భారత్ నుంచి 18 మంది క్రికెటర్లు తుది జాబితాలో ఉండగా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు మాత్రమే అవకాశం దక్కింది. మెల్‌బోర్న్ రెనెగెడ్స్ జట్టు హర్మన్‌ప్రీత్‌ను ఎంపిక చేసుకుంది. 2021-2022 సీజన్‌లో హర్మన్‌ప్రీత్ మెల్‌బోర్న్ తరఫున ఆడి 406 పరుగులు చేయడంతోపాటు 15 వికెట్లు కూడా తీసింది.

మెరిసిన హెడ్... ఆసీస్ క్లీన్‌స్వీప్

దక్షిణాఫ్రికాతో మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. డర్బన్‌లో మూడో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఐదు వికెట్లతో గెలిచింది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 191 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 17.5 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ ట్రావిస్ హెడ్ (48 బంతుల్లో 91; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) అదరగొట్టాడు. అంతకుముందు దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 190 పరుగులు చేసింది.



క్వార్టర్స్‌లో ముకోవా



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో పదో సీడ్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 10వ ర్యాంకర్ ముకోవా 2 గంటల 34 నిమిషాల్లో 6-3, 5-7, 6-1తో జిన్‌యు వాంగ్ (చైనా)పై గెలిచింది. రెండో సీడ్ సబలెంకా (బెలారస్), మూడో సీడ్ పెగూలా (అమెరికా), ఐదో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) 6-2, 6-3, 4-6, 6-3తో ఇవాన్స్ (బ్రిటన్)పై... మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6-2, 6-2, 7-6 (8/6)తో బేజ్ (అర్జెంటీనా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరారు. పురుషుల డబుల్స్ మూడో రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6-4, 6-7 (5/7), 7-6 (10/6)తో జూలియన్ క్యాష్-హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్) ద్వయంపై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరింది.

వరుణుడు కరుణిస్తే!

- నేడు నేపాల్‌తో తొలిసారి భారత్ ‘ఢీ’
- ఈ మ్యాచ్‌కూ వాన ముప్పు
- రద్దయినా భారత్ ముందుకు
- మధ్యాహ్నం గం. 3 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

పల్లెకెలె: ఆసియా కప్‌లో టీమిండియా నేడు క్రికెట్ కూన నేపాల్‌తో ఏకపక్ష పోటీకి సిద్ధమైంది. ఏ ఫార్మాట్‌లోనైనా నేపాల్ జట్టుతో భారత్‌కిది తొలి మ్యాచ్ కానుంది. భారత్‌లాంటి మేటి జట్టుకు ఈ మ్యాచ్ ఓ లెక్కేకాదు. అయితే ఎవరెంతగా చెలరేగుతారనేదే ఇక్కడ ఆసక్తికరం. కానీ ఇదంతా కూడా మ్యాచ్ జరిగితేనే! ఎందుకంటే వరుసగా భారత్ ఆడే ఈ రెండో మ్యాచ్‌పై కూడా వరుణ ప్రతాపం ఉంది. సోమవారం రోజు కూడా వర్షం పడే అవకాశాలే ఎక్కువని వాతావరణ కేంద్రం సమాచారమిచ్చింది. ఈ ఆసియా కప్‌కే హైలైట్‌గా నిలవాల్సిన భారత్, పాక్ మ్యాచ్ వర్షార్పణమైంది. దాయాదుల మధ్య ‘ప్రి ప్రపంచకప్’ హోరాహోరీని వీకెండ్‌లో ఆస్వాదించకుండా వరుణుడు అడ్డుపడ్డాడు. ఇప్పుడు భారత ఆటగాళ్లకు ధనాధన్ ప్రాక్టీస్‌ను ఇచ్చే నేపాల్‌తో మ్యాచ్‌కు ఇదే పునరావృతమైతే భారత అభిమానులకు నిరాశ తప్పదు.

బుమ్రా స్వదేశానికి...

వరుణుడు కరుణించి మ్యాచ్ జరిగితే మాత్రం భారత్ ప్రధాన బలగం బరిలోకి దిగుతుంది. టీమిండియా స్థాయికి సరిపోని ప్రత్యర్థి ఎదురవుతున్నప్పటికీ ఇన్నాళ్లు విశ్రాంతిలో ఉన్న ఆటగాళ్లు తప్పకుండా మ్యాచ్ ప్రాక్టీస్ కోసం ఆడతారు. పైగా గత మ్యాచ్‌లో రోహిత్, శుబ్‌మన్, కోహ్లిలతో కూడిన టాపార్డర్ క్లీన్‌బౌల్డయ్యింది. ఇప్పుడు ఏ చాన్స్ తీసుకోకుండా స్టార్ ఆటగాళ్లంతా నేపాల్‌తో ఆడతారని జట్టు వర్గాల ద్వారా తెలిసింది. తన భార్య సంజన ప్రసవ తేదీ దగ్గరకు రావడంతో పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా స్వదేశానికి చేరుకున్నాడు. భారత్ సూపర్-4 మ్యాచ్‌లకల్లా బుమ్రా తిరిగి లంక చేరుకుంటాడు.


రద్దయినా నష్టం లేదు

గ్రూప్ ‘ఎ’లో నేపాల్‌పై గెలిచిన పాక్... భారత్‌తో మ్యాచ్ రద్దవడంతో వచ్చిన ఒక పాయింట్‌తో ఇదివరకే సూపర్-4కు అర్హత సాధించింది. పాక్ ఖాతాలో 3 పాయింట్లున్నాయి. అయితే 1 పాయింట్ మాత్రమే ఉన్న టీమిండియా లాంఛనమైన మ్యాచ్ జరిగితే గెలుస్తుంది. తదుపరి దశకు అర్హత సాధిస్తుంది. ఒకవేళ ఇదీ రద్దయినా భారత్ 2 పాయింట్లతో రెండో స్థానంతో సూపర్-4 ఎంచక్కా వెళుతుంది. దాంతో వర్షంవల్ల మ్యాచ్ జరగకపోతే టీమిండియాకు పెద్దగా నష్టమైతే లేదు.



వారెవ్వా వెర్‌స్టాపెన్

ఫార్ములావన్‌లో వరుసగా 10 విజయాలతో ప్రపంచ రికార్డు



మోంజా (ఇటలీ): అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. ఫార్ములావన్ (ఎఫ్1) చరిత్రలో ఒకే సీజన్‌లో అత్యధికంగా 10 వరుస విజయాలు సాధించిన డ్రైవర్‌గా వెర్‌స్టాపెన్ గుర్తింపు పొందాడు. ఆదివారం జరిగిన ఇటలీ గ్రాండ్‌ప్రిలో రెండో స్థానం నుంచి రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 51 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంట 13 నిమిషాల 41.143 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానం దక్కించుకున్నాడు. పెరెజ్ రెండో స్థానంలో, సెయింజ్ మూడో స్థానంలో నిలిచారు. ఫెరారీ డ్రైవర్ కార్లోస్ సెయింజ్ ‘పోల్ పొజిషన్’తో రేసును మొదలుపెట్టగా... 15వ ల్యాప్‌లో సెయింజ్‌ను వెర్‌స్టాపెన్ ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత వెర్‌స్టాపెన్‌ను ఎవరూ అందుకోలేకపోయారు. దాంతో వెర్‌స్టాపెన్ ఖాతాలో ఈ సీజన్‌లో ఓవరాల్‌గా 12వ విజయం... వరుసగా 10వ విజయంతో కొత్త చరిత్ర నమోదైంది. 2013లో సెబాస్టియన్ వెటెల్ వరుసగా 9 రేసుల్లో గెలిచాడు. వెటెల్ రికార్డును 25 ఏళ్ల వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. అంతేకాకుండా ఈ సీజన్‌లో జరిగిన 14 రేసుల్లోనూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్లే గెలుపొందడం విశేషం. వెర్‌స్టాపెన్ 12 రేసుల్లో నెగ్గగా... రెడ్‌బుల్ జట్టుకే చెందిన మరో డ్రైవర్ సెర్జియో పెరెజ్ రెండు రేసుల్లో గెలిచాడు. 22 రేసుల ఈ సీజన్‌లో ప్రస్తుతం వెర్‌స్టాపెన్ 364 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. తదుపరి రేసు సింగపూర్ గ్రాండ్‌ప్రి ఈనెల 17న జరుగుతుంది.



మిరాజ్

గెలిచి నిలిచిన బంగ్లాదేశ్

- ‘శత’క్కొట్టిన మిరాజ్, నజ్ముల్
- అఫ్గానిస్తాన్‌పై 89 పరుగులతో గెలుపు
- ఆసియా కప్ టోర్నీ

లాహోర్: ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో బంగ్లాదేశ్ జట్టు ‘సూపర్-4’ రేసులో నిలిచింది. లంకతో జరిగిన గ్రూప్ ‘బి’ తొలి మ్యాచ్‌లో 160 పైచిలుకు పరుగులు చేసేందుకు ఇబ్బంది పడిన బంగ్లాదేశ్ అఫ్గానిస్తాన్‌పై మాత్రం చెలరేగి 89 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఓపెనర్ మెహదీ హసన్ మిరాజ్ (119 బంతుల్లో 112 రిటైర్డ్ హర్ట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), మిడిలార్డర్‌లో నజ్ముల్ హొసేన్ షాంతో (105 బంతుల్లో 104; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కారు. దాంతో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 334 పరుగులు చేసింది. వన్డేల్లో బంగ్లాదేశ్‌కిది మూడో అత్యధిక స్కోరు. ఓపెనర్ నయీమ్ (28), వన్‌డౌన్ బ్యాటర్ తౌహిద్ (0) నిరాశపరిచినప్పటికీ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మిరాజ్, నజ్ముల్ మూడో వికెట్‌కు 194 పరుగులు జోడించారు. అఫ్గాన్ బౌలర్లలో ముజీబ్, గుల్బదిన్ చెరో వికెట్ తీశారు. అనంతరం కష్టమైన లక్ష్యఛేదనకు దిగిన అఫ్గానిస్తాన్ 44.3 ఓవర్లలో 245 పరుగుల వద్ద ఆలౌటైంది. ఇబ్రహీం జద్రాన్ (74 బంతుల్లో 75; 10 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ హష్మతుల్లా (60 బంతుల్లో 51; 6 ఫోర్లు) రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో టస్కిన్ అహ్మద్ 4, షోరిఫుల్ ఇస్లామ్ 3 వికెట్లు తీశారు. మంగళవారం లాహోర్‌లో శ్రీలంకతో జరిగే మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ గెలిస్తే మాత్రం బంగ్లాదేశ్‌తో కలిసి ఈ మూడు జట్లు రెండు పాయింట్లతో సమఉజ్జీగా నిలుస్తాయి. మెరుగైన రన్‌రేట్ ఉన్న రెండు జట్లు ‘సూపర్-4’ దశకు అర్హత సాధిస్తాయి.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: నయీమ్ (బి) ముజీబ్ 28; మెహదీ హసన్ మిరాజ్ (రిటైర్డ్‌హర్ట్) 112; తౌహిద్ (సి)జద్రాన్ (బి) గుల్బదిన్ 0; నజ్ముల్ (రనౌట్) 104; ముష్ఫికర్ (రనౌట్) 25; షకీబ్ (నాటౌట్) 32; షమీమ్ (రనౌట్) 11; ఆఫిఫ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 334. వికెట్ల పతనం:** 1-60, 2-63, 2-257 (మిరాజ్ రిటైర్డ్), 3-278, 4-294, 5-324. **బౌలింగ్:** ఫరూఖి 6-1-53-0, ముజీబ్ 10-0-62-1, గుల్బదిన్ 8-0-58-1, కరీమ్ 6-0-39-0, నబీ 10-0-50-0, రషీద్ ఖాన్ 10-1-66-0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షోరిఫుల్ 1; జద్రాన్ (సి) ముష్ఫికర్ (బి) హసన్ 75; రహ్మత్ (బి) టస్కిన్ అహ్మద్ 33; హష్మతుల్లా (సి) హసన్ (బి) షోరిఫుల్ 51; నజీబుల్లా (బి) మిరాజ్ 17; నబీ (సి) ఆఫిఫ్ (బి) టస్కిన్ అహ్మద్ 3; గుల్బదిన్ (బి) షోరిఫుల్ 15; కరీమ్ (రనౌట్) 1; రషీద్ ఖాన్ (సి) షకీబ్ (బి) టస్కిన్ అహ్మద్ 24; ముజీబ్ (హిట్‌వికెట్) (బి) టస్కిన్ అహ్మద్ 4; ఫరూఖి (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (44.3 ఓవర్లలో ఆలౌట్) 245. వికెట్ల పతనం:** 1-1, 2-79, 3-131, 4-193, 5-196, 6-212, 7-214, 8-221, 9-244, 10-245. **బౌలింగ్:** టస్కిన్ 8.3-0-44-4, షోరిఫుల్ 9-1-36-3, హసన్ 9-1-61-1, షకీబ్ 8-0-44-0, అఫిఫ్ 1-0-6-0, మిరాజ్ 8-0-41-1, షమీమ్ 1-0-10-0.

సంయుక్త ఆధిక్యంలో హారిక



కోల్‌కతా: టాటా స్టీల్ ఇండియా చెస్ బ్లిట్జ్ టోర్నీలో తొమ్మిది రౌండ్లు ముగిశాక భారత గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక, జు వెన్‌జున్ (చైనా) 6.5 పాయింట్లతో సంయుక్తంగా ఆధిక్యంలో ఉన్నారు. భారత స్టార్ హంపి, ర్యాపిడ్ ఫార్మాట్ టోర్నీ విజేత దివ్య ఐదు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు.

డ్యూరాండ్ కప్ టోర్నీ విజేత మోహన్ బగాన్

కోల్‌కతా: ఆసియాలోనే అతి పురాతనమైన ఫుట్‌బాల్ టోర్నమెంట్ డ్యూరాండ్ కప్‌ను మోహన్ బగాన్ సూపర్ జెయింట్ క్లబ్ జట్టు రికార్డుస్థాయిలో 17వ సారి సొంతం చేసుకుంది. ఫైనల్లో మోహన్ బగాన్ క్లబ్ 1-0తో ఈస్ట్ బెంగాల్ క్లబ్‌ను ఓడించి 23 ఏళ్ల తర్వాత ఈ టోర్నీలో మళ్లీ చాంపియన్‌గా నిలిచింది. ఆట 71వ నిమిషంలో పెట్రాటోస్ చేసిన గోల్‌తో మోహన్ బగాన్ క్లబ్ గెలిచింది. 135 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్ జట్లు 16 సార్లు చొప్పున విజేతగా నిలిచి అత్యధిక సార్లు టైటిల్ నెగ్గిన జట్టుగా సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. అయితే తాజా టైటిల్‌తో మోహన్ బగాన్ టాప్ ర్యాంక్‌లోకి వచ్చింది.

జింబాబ్వే మాజీ కెప్టెన్ హీత్ స్ట్రీక్ కన్నుమూత



హరారే: జింబాబ్వే క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ హీత్ స్ట్రీక్ కన్నుమూశాడు. 49 ఏళ్ల ఆల్‌రౌండర్ క్యాన్సర్‌తో మృతి చెందినట్లు అతని భార్య నదిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. స్ట్రీక్ అంతర్జాతీయ కెరీర్‌లో 65 టెస్టులాడి 1990 పరుగులు చేశాడు. 216 వికెట్లు తీశాడు. 189 వన్డేల్లో 2943 పరుగులు సాధించి 239 వికెట్లు తీశాడు. భారత్‌తో 2005లో చివరి టెస్టు, అదే ఏడాది కివీస్‌తో చివరి వన్డే ఆడాడు. రిటైర్మెంట్ అనంతరం బంగ్లాదేశ్ జట్టుకు కోచ్‌గా పనిచేశాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్, గుజరాత్ లయన్స్ (ఇప్పుడు లేదు) జట్లకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. అయితే అంతర్జాతీయ మ్యాచ్‌ల సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్, తుది జట్టు కూర్పు సమాచారాన్ని, గోప్యత పాటించాల్సిన అంతర్గత విషయాలను బుకీలతో పంచుకున్నట్లు తేలడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 2021 ఏప్రిల్‌లో హీత్ స్ట్రీక్‌పై 8 ఏళ్ల నిషేధం విధించింది.

అలెన్ అదరహో

మూడో టి20లో కివీస్ గెలుపు



బర్మింగ్‌హమ్: ఇంగ్లండ్ జట్టుతో ఆదివారం జరిగిన మూడో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 74 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 202 పరుగులు సాధించింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ ఫిన్ అలెన్ (53 బంతుల్లో 83; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు), గ్లెన్ ఫిలిప్స్ (34 బంతుల్లో 69 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడి అర్ధ సెంచరీలు చేశారు. 203 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 18.3 ఓవర్లలో 128 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ జోస్ బట్లర్ (21 బంతుల్లో 40; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగతా వారు విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో కైల్ జేమీసన్ (3/23), ఇష్ సోధి (3/33) రాణించారు. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది. నాలుగో మ్యాచ్ మంగళవారం జరుగుతుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ సివిల్ సప్లైస్, బాపట్లలో 459 పోస్టులు

బాపట్లలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం.. బాపట్ల జిల్లాలో ధాన్య సేకరణకు సంబంధించి రెండు నెలల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 459
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్-153, డేటాఎంట్రీ ఆపరేటర్-153, హెల్పర్-153.

అర్హత

» **టెక్నికల్ అసిస్టెంట్:** బీఎస్సీ (అగ్రికల్చర్ /మైక్రోబయాలజీ /బయోకెమిస్ట్రీ /బయోటెక్నాలజీ)/ బీఎస్సీ(బీజెడ్‌సీ)/బీఎస్సీ(లైఫ్ సైన్సెస్)/డిప్లొమా(అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **డేటాఎంట్రీ ఆపరేటర్:** ఏదైనా డిగ్రీతో పాటు పీజీడీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **హెల్పర్:** 8, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** టీఏ/డీఈవో పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు,హెల్పర్‌కు 18నుంచి 35ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు (టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** నోటిఫికేషన్ ప్రకారం నిర్ణీత నమూనాలో ఆఫ్‌లైన్ దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా జాయింట్ కలెక్టర్ అండ్ ఈవోఈడీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం, కలెక్టరేట్ కాంపౌండ్, బాపట్ల చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.09.2023.
» **వెబ్‌సైట్:** bapatla.ap.gov.in

ఏపీ సివిల్ సప్లైస్, పశ్చిమ గోదావరి జిల్లాలో 942 పోస్టులు

భీమవరంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం.. పశ్చిమ గోదావరి జిల్లాలో ధాన్య సేకరణకు సంబంధించి రెండు నెలల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 942
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్-314, డేటా ఎంట్రీ ఆపరేటర్-314, హెల్పర్-314.

అర్హత

» **టెక్నికల్ అసిస్టెంట్:** బీఎస్సీ (అగ్రికల్చర్ /మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ /బయోటెక్నాలజీ)/ బీఎస్సీ(బీజెడ్‌సీ)/బీఎస్సీ(లైఫ్ సైన్సెస్)/డిప్లొమా(అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **డేటా ఎంట్రీ ఆపరేటర్:** ఏదైనా డిగ్రీతో పాటు పీజీడీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **హెల్పర్:** 8, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** టీఏ/డీఈవో పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు, హెల్పర్‌కు 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు (టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** నోటిఫికేషన్ ప్రకారం నిర్ణీత నమూనాలో ఆఫ్‌లైన్ దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా జిల్లా పౌర సరఫరాల మేనేజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, ఆర్‌కే కాంప్లెక్స్, నరసింహాపురం, భీమవరం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.09.2023.
» **వెబ్‌సైట్:** westgodavari.ap.gov.in

ఏపీ సివిల్ సప్లైస్, తూర్పు గోదావరి జిల్లాలో 717 పోస్టులు

రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం .. తూర్పు గోదావరి జిల్లాలో ధాన్య సేకరణకు సంబంధించి రెండు నెలల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 717
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్-239, డేటా ఎంట్రీ ఆపరేటర్-239, హెల్పర్-239.

అర్హత

» **టెక్నికల్ అసిస్టెంట్:** బీఎస్సీ (అగ్రికల్చర్/మైక్రోబయాలజీ /బయోకెమిస్ట్రీ/బయోటెక్నాలజీ)/ బీఎస్సీ(బీజెడ్‌సీ)/బీఎస్సీ(లైఫ్ సైన్సెస్)/డిప్లొమా(అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **డేటాఎంట్రీ ఆపరేటర్:** ఏదైనా డిగ్రీతోపాటు పీజీడీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **హెల్పర్:** 8, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** టీఏ/డీఈవో పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు, హెల్పర్‌కు 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు(టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** నోటిఫికేషన్ ప్రకారం నిర్ణీత నమూనాలో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా జాయింట్ కలెక్టర్ అండ్ ఈవోఈడీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం, కలెక్టరేట్ కాంపౌండ్, రాజమండ్రి చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.09.2023.
» **వెబ్‌సైట్:** eastgodavari.ap.gov.in

ట్రాన్స్‌లేటర్ కొలువు కొట్టేలా

» పలు శాఖలు విభాగాల్లో 307 పోస్టుల భర్తీకి ఎస్‌ఎస్‌సీ నోటిఫికేషన్
» హిందీ /ఇంగ్లిష్‌లో పీజీ ఉత్తీర్ణతతో దరఖాస్తుకు అవకాశం

హిందీ లేదా ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లలో..పీజీ పూర్తి చేశారా.. లేదా.. మరేదైనా పీజీలో..ఇంగ్లిష్/హిందీ సబ్జెక్ట్‌లను చదివారా.. అనువాదంలో అనుభవం ఉందా.. ఈ అర్హతలుంటే చాలు.. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ట్రాన్స్‌లేటర్ కొలువు సొంతం చేసుకోవచ్చు. ప్రారంభంలోనే ఆకర్షణీయ వేతనం అందుకోవచ్చు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్‌ఎస్‌సీ) తాజాగా జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్(జేహెచ్‌టీ), జూనియర్ ట్రాన్స్‌లేటర్(జేటీ), సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్(ఎస్‌హెచ్‌టీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఎస్‌ఎస్‌సీ.. జేహెచ్‌టీ, జేటీ, ఎస్‌హెచ్‌టీ ఎగ్జామ్ వివరాలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆయా ప్రభుత్వ శాఖల్లో విభిన్న హోదాలు, స్థాయిల్లో నియామకాలు చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖలు, విభాగాల్లో.. జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ ఉద్యోగాల భర్తీకి.. ఎంపిక ప్రక్రియ ప్రారంభించింది.

మొత్తం 307 పోస్టులు

ఎస్‌ఎస్‌సీ జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ ఎగ్జామ్ ద్వారా.. మొత్తం 307 పోస్టులను భర్తీ చేయనుంది. సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్ పోస్టులు కూడా అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి హిందీ/ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో డిగ్రీ, పీజీ, ట్రాన్స్‌లేషన్‌లో డిప్లొమా లేదా సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణత ఉండాలి. హిందీ-ఇంగ్లిష్ అనువాదంలో రెండేళ్ల పని అనుభవం తప్పనిసరి.
- **వయసు:** ఆగస్ట్ 1 నాటికి 18-30 ఏళ్ల ఉండాలి. ఎస్‌సీ/ఎస్‌టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

- ఆయా పోస్టులకు పే లెవల్ 6, 7లతో ప్రారంభ వేతనం అందిస్తారు.
- జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్ పోస్టులకు పే లెవల్-6లో వేతన శ్రేణి రూ.35,400- రూ.1,12,400 ఉంటుంది.
- సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టులకు పే లెవల్-7లో రూ.44,900 - రూ.1,42,400 వేతన శ్రేణి లభిస్తుంది.

ట్రాన్స్‌లేషన్‌లో సర్టిఫికెట్/డిప్లొమా

ఆయా విద్యార్హతలతోపాటు హిందీ నుంచి ఇంగ్లిష్‌లోకి; ఇంగ్లిష్ నుంచి హిందీలోకి ట్రాన్స్‌లేషన్‌లో డిప్లొమా లేదా సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. లేదా హిందీ-ఇంగ్లిష్ అనువాదంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

రాత పరీక్షలో ఆధారంగా

- హిందీ ట్రాన్స్‌లేషన్ విభాగంలో పోస్టుల భర్తీకి రాత పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ ఆధారంగా తుది నియామకాలు ఖరారు చేస్తారు. రాత పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. వివరాలు..
- పేపర్-1లో జనరల్ ఇంగ్లిష్, జనరల్ హిందీ 100 ప్రశ్నలు-100 మార్కులకు చొప్పున ఉంటాయి. పేపర్-2 ట్రాన్స్‌లేషన్ అండ్ ఎస్సే 200 మార్కులకు నిర్వహిస్తారు.
- పేపర్-1 పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు.



ఎస్‌ఎస్‌సీ జాబ్స్

పేపర్-2.. డిస్క్రిప్టివ్ టెస్ట్

- పేపర్-2ను డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో ట్రాన్స్‌లేషన్, ఎస్సే రైటింగ్ అంశాలు ఉంటాయి.
- ట్రాన్స్‌లేషన్‌కు సంబంధించి హిందీలో ఒక ప్యాసేజ్,ఇంగ్లిష్‌లో ఒక ప్యాసేజ్ ఇస్తారు. వీటిని ఇంగ్లిష్, హిందీలలోకి అనువదించాల్సి ఉంటుంది.
- అభ్యర్థులు ఏదైనా ఒక అంశంపై హిందీ, ఇంగ్లిష్‌ల్లో ఎస్సే రాయాల్సి ఉంటుంది.

పేపర్-1లో ప్రతిభ ఆధారంగా పేపర్-2

- పేపర్-1లో చూపిన ప్రతిభ ఆధారంగా పేపర్-2కు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పేపర్-1లో ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులతో, ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 25 శాతం మార్కులతో, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 20 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- అంతిమంగా పేపర్-1, పేపర్-2లలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది జాబితా రూపొందిస్తారు. రెండు పేపర్లకు నిర్దిష్ట కటాఫ్‌లను పాటిస్తారు. వాటికి అనుగుణంగా తుది జాబితా రూపొందించి.. అందులో చోటు సాధించిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

గ్రామర్, కాంప్రహెన్షన్ కీలకం

- పేపర్-1, పేపర్-2ల్లో విజయానికి హిందీ, ఇంగ్లిష్ గ్రామర్, కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. రెండు సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్ గ్రామర్ నైపుణ్యాలు, వాక్య నిర్మాణం, రీ రైటింగ్, జంబుల్డ్ సెంటెన్సెస్‌లపై పట్టు సాధించాలి.
- డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఎస్సే రైటింగ్, ట్రాన్స్‌లేషన్‌కు సంబంధించి కాంప్రహెన్షన్ నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. పీజీ స్థాయిలోని పుస్తకాలను చదవాలి. అదే విధంగా ఈ రెండు సబ్జెక్ట్‌లకు సంబంధించి ముఖ్యమైన సాహిత్యాలను అధ్యయనం చేయాలి. వాటిని అనువాదం చేయగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి. వీటితో పాటు ప్రెసిస్ రైటింగ్, సినాప్సిస్‌లపైనా దృష్టి పెట్టాలి. అదే విధంగా.. ప్రిపరేషన్ సమయంలో సమకాలీన అంశాలపై ప్రచురితమవుతున్న కథనాలను అనువాదం చేయడం, వాటిని సొంతంగా రాయడం కూడా మేలు చేస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** ఆగస్ట్ 22 - సెప్టెంబర్ 12, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** సెప్టెంబర్ 13, 14 తేదీలు.
- **పేపర్-1 పరీక్ష తేదీ:** అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in

బెంగళూరు బెల్‌లో 63 ఉద్యోగాలు

దేశ రక్షణకు అవసరమైన పరికరాలను తయారు చేసే బెంగళూరులోని నవరత్న సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతుంది. ఇందులో భాగంగా మొత్తం 63 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్, డిప్లొమా, ఐటీఐ, బీకాం, బీబీఎం, పదోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 63
- ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైయినీ(కంప్యూటర్ సైన్స్)-10, సివిల్-06, టెక్నీషియన్ సి(ఎలక్ట్రానిక్ మెకానిక్)-27, ఫిట్టర్-12, ఎలక్ట్రికల్-03, డ్రాఫ్ట్స్‌మ్యాన్(మెకానికల్)-02, జూనియర్ అసిస్టెంట్-03 పోస్టులున్నాయి.

అర్హతలు

ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైయినీ: ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు సంబంధిత విభాగాల్లో మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేయాలి. జనరల్/ఓబీసీ /ఈడబ్ల్యూస్ అభ్యర్థులు 60 శాతం మార్కులతో, ఎస్సీ, ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు 55 శాతం మార్కులతో డిప్లొమా పాసవ్వాలి. ఎంపికైన అభ్యర్థులకు 6 నెలల ట్రైనింగ్ ఉంటుంది. ఈ శిక్షణ కాలంలో నెలకు రూ.10వేలు స్టైపెండ్‌గా చెల్లిస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకుని.. గ్రేడేషన్ టెస్ట్ పాసైన వారికి రెగ్యులర్ పే స్కేల్‌తో ఉద్యోగంలోకి తీసుకుంటారు.

టెక్నీషియన్-సి: పదోతరగతితో పాటు ఐటీఐ పాసవ్వాలి. ఏడాది అప్రెంటిస్ ట్రెయినింగ్ పూర్తిచేయాలి. సంబంధిత విభాగంలో నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ ఉండాలి. లేదా పదోతరగతి ఉత్తీర్ణులై సంబంధిత విభాగంలో మూడేళ్ల నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసుకోవాలి. జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 60 శాతం మార్కులతో, ఎస్సీ, ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి.

జూనియర్ అసిస్టెంట్: మూడేళ్ల బీకామ్/బీబీఎం ఉత్తీర్ణులవ్వాలి. జనరల్/ఓబీసీ /ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 60శాతం మార్కులతో, ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు 55 శాతం మార్కులతో పాసవ్వాలి.

వయసు: అన్ని పోస్టులకు గరిష్ట వయసు 28 ఏళ్లు ఉండాలి. ఎస్సీ,ఎస్టీలకు -ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ఇలా: సంబంధిత పోస్టుల అర్హతలకు అనుగుణంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి.. రాత పరీక్షను ఎంపిక చేస్తారు.

ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 05.09.2023
- **వెబ్‌సైట్:** https://bel-india.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	556	65,387
నిఫ్టీ ▲	182	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	14,032	▽	3
డోజోన్స్	34,838	▲	116
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▽	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91


•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.01	106.40
€	యూరో	ఎస్‌బీఐ	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.21	62.17
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.62	23.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.35

'ఎఫ్‌డీ' నిచ్చెన ఎక్కుతారా..?

- వడ్డీ రేట్లు తగ్గుతాయా? పెరుగుతాయా? • అన్ని సందర్భాల్లో ఊహించడం కష్టం
- దీనికి పరిష్కారమే ఎఫ్‌డీ లాడార్ • వేర్వేరు మెచ్యూరిటీపై డిపాజిట్లు • అవసరాలకు నిధుల లభ్యత





డిపాజిట్లపై వడ్డీ రేటు 8 శాతానికి చేరుకోవడంతో ఈ సమయంలో ఎఫ్‌డీలలో ఇన్వెస్ట్ చేయాలా..? లేక మరికొన్ని రోజులు వేచి చూడాలా? అన్నది ఎంతో మంది ఎదుర్కొంటున్న సందేహం. నిజానికి ఇక్కడి నుంచి వడ్డీ రేట్లు ఇంకా పెరగొచ్చు. లేదంటే కొంత విరామం తర్వాత రేట్లు తగ్గొచ్చు. మరి ఈ సమయంలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. ఒకవేళ వడ్డీ రేట్లు పెరిగితే అదనపు రాబడి అవకాశాన్ని కోల్పోతామేమో..? అనుకునే వారు ఒక రకం అయితే.. ఈ రేట్లపై ఇన్వెస్ట్ చేయకపోతే, రానున్న రోజుల్లో ఆర్‌బీఐ రేట్లను తగ్గిస్తే అప్పుడు మెరుగైన రాబడి చాన్స్ మిస్ అవుతామేమో అనుకునే వారు ఇంకో రకం. ఇలాంటి అయోమయ వాతావరణాన్ని చూసి పెట్టుబడుల అవకాశాలను కోల్పోకూడదు. పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ, వాటికి తగినట్టు పెట్టుబడుల వ్యూహాలను అనుసరించడమే ఇన్వెస్టర్ల ముందున్న మెరుగైన మార్గం. ఇలాంటి తరుణంలో ఇన్వెస్టర్లు 'ఎఫ్‌డీ లాడరింగ్' (అంచెలంచెలుగా) విధానాన్ని అనుసరించొచ్చు. అంటే డిపాజిట్ మొత్తాన్ని ఒకేసారి గడువు తీరే విధంగా ఇన్వెస్ట్ చేసుకోకుండా ఉండడం. ముున్ముందు ఏం జరుగుతుందోనన్నది అన్ని సందర్భాల్లోనూ అంచనా వేయలేం. అటువంటప్పుడు వడ్డీ రేట్ల అస్థిరతలను అధిగమించేందుకు ఎఫ్‌డీ లాడార్ ఉపయోగపడుతుంది. మెరుగైన రాబడులకు మార్గం చూపుతుంది.

ఆర్‌బీఐ గడిచిన రెండు ద్రవ్య విధాన సమీక్షల్లో కీలకమైన రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ద్రవ్యోల్బణం ఇప్పటికీ ఆర్‌బీఐ నియంత్రిత లక్ష్యానికి ఎగువనే చలిస్తోంది. దీంతో వడ్డీ రేట్ల పెంపునకు ముగింపు పడిందా? అంటే అవునని చెప్పలేని పరిస్థితి. త్వరలో వెలువడనున్న ఆగస్టు ద్రవ్యోల్బణం తదుపరి ఆర్‌బీఐ ఎంపీసీ నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశం లేకపోలేదు. ద్రవ్యోల్బణం ఎగసి పడుతుండడంతో అదనపు సీఆర్‌ఆర్ రూపంలో బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ మరింత లిక్విడిటీని తీసుకునే నిర్ణయాన్ని గత సమీక్షలో ప్రకటించింది. మరోవైపు యూఎస్ ఫెడ్ రానున్న సమీక్షల్లో రేట్లను పెంచే అవకాశాలే ఉన్నట్టు సంకేతాలు తెలియజేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడులు పెట్టాలా? వేచి చూడాలా? అన్న సందిగ్ధత ఎదుర్కొనే వారు ఎఫ్‌డీ లాడార్‌ను అనుసరించొచ్చు.

కాలానుగుణంగా వడ్డీ రేట్ల మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు ఎఫ్‌డీ లాడార్ సాయపడుతుంది. ఈ విధానంలో పెట్టుబడి మొత్తాన్ని ఒకే కాల వ్యవధికి ఇన్వెస్ట్ చేయకుండా.. వివిధ కాల వ్యవధుల మధ్య భాగాలుగా చేసుకోవాలి. సాధారణంగా వడ్డీ రేట్లు పడిపోతున్న తరుణంలో ఇన్వెస్టర్లు దీర్ఘకాలానికి కాకుండా స్వల్ప కాలానికి ఎఫ్‌డీలు చేస్తుంటారు. ఒకవేళ వడ్డీ రేట్లు మళ్లీ పెరగడం మొదలు పెడితే.. స్వల్పకాలానికి చేసిన ఎఫ్‌డీ గడువు తీరి చేతికి వస్తుందని, ఆ మొత్తాన్ని మెరుగైన రేటుపై మళ్లీ ఎఫ్‌డీ చేసుకోవచ్చని అనుకుంటారు. అదే మాదిరిగా, వడ్డీ రేట్లు పెరుగుతూ వెళుతుంటే అప్పుడు దీర్ఘకాలానికి ఎఫ్‌డీలు చేస్తుంటారు. ఒకవేళ అక్కడి నుంచి వడ్డీ రేట్లు పడిపోవడం మొదలు పెడితే.. అధిక రేటుపై ఎఫ్‌డీ చేసుకున్నట్టు అవుతుందని భావిస్తుంటారు. కానీ, ఇది సరైన విధానం కాబోదు. వడ్డీ రేట్లు అస్థిరంగా ఉన్న సమయంలో పెట్టుబడినంతా ఒకే ఎఫ్‌డీగా మార్చుకోవడం సరైన నిర్ణయం అనిపించుకోదు.

వడ్డీ రేట్ల అస్థిరతలకు చెక్



"ఇన్వెస్టర్లు సాధారణంగా గరిష్ఠ రేటుపై ఎఫ్‌డీ చేసుకోవాలని చూస్తుంటారు. కానీ, ఆచరణలో ఇది చాలా కష్టం. భవిష్యత్ వడ్డీ రేట్ల గమనాన్ని అంచనా వేయడం రిస్క్‌తో కూడుకున్నదే అవుతుంది. దీనికి బదులు వడ్డీ రేట్ల చలనంతో వచ్చే రిస్క్‌ను తగ్గించుకునేందుకు ఎఫ్‌డీ లాడరింగ్ ఒక టెక్నిక్'' అని ముంబైకి చెందిన సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ అభిజిత్ తాలూక్‌దార్ సూచించారు. ''లాడరింగ్‌ను క్రమం తప్పకుండా అనుసరించినట్టయితే వడ్డీ రేట్ల మార్పిడికి భిన్నంగా లేకుండా ఉండొచ్చు. కొన్ని సందర్భాల్లో వడ్డీ రేట్లు కనిష్ఠ స్థాయిలో, కొన్ని సందర్భాల్లో వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయిలో ఉండొచ్చు. ఎఫ్‌డీలను తిరిగి రెన్యువల్ చేసుకునే సమయంలో అప్పటి వరకు ఉన్న రేటు కంటే మెరుగైన రేటు రావొచ్చు. లేదంటే తక్కువ రేటు ఉండొచ్చు. కాకపోతే మొత్తం మీద నా పెట్టుబడులపై రేటు సగటుగా ఉంటుంది. ఎఫ్‌డీ లాడరింగ్‌తో మెరుగైన రేటుపైనే ఇన్వెస్ట్ చేయాలన్న సందిగ్ధత, అయోమయం తొలగిపోతుంది'' అని 'ఇంటర్నేషనల్ మనీ మ్యాటర్స్' సంస్థ ఎండీ, సీఈవో లోవై నవలకి వివరించారు.

ఉదాహరణకు మీ వద్ద రూ.9 లక్షలు ఉన్నాయని అనుకుందాం. ఈ మొత్తాన్ని ఒకే ఎఫ్‌డీగా కాకుండా.. రూ.3 లక్షల చొప్పున మూడు భాగాలు చేసుకోవాలి. ఒక్కో భాగాన్ని వేర్వేరు కాల వ్యవధికి ఎఫ్‌డీగా మార్చుకోవాలి. ఏడాది, రెండేళ్లు, మూడేళ్లకు ఒకటి చొప్పున ఎఫ్‌డీగా మార్చుకోవాలి. మొదటి రూ.3 లక్షలు ఏడాదికి మెచ్యూరిటీ తీరి చేతికి వస్తుంది. ఈ మొత్తాన్ని తిరిగి మళ్లీ ఎఫ్‌డీ చేసుకోవాలి. వడ్డీ రేట్లు పెరుగుతూ వెళ్లే తరుణంలో అధిక రేటుపై ఎఫ్‌డీ చేసుకున్నట్టు అవుతుంది. అదే వడ్డీ రేట్లు క్షీణించే క్రమంలో అప్పటి వరకు చేసిన రేటు కంటే కొంచెం తక్కువకు ఎఫ్‌డీ చేసుకోవాల్సి వస్తుంది. కాకపోతే మిగిలి ఉన్న రెండు, మూడేళ్ల ఎఫ్‌డీలపై అధిక రేటు పొందినట్టు అవుతుంది. ఎఫ్‌డీ లాడార్ విధానం వల్ల ఇన్వెస్టర్ తన పెట్టుబడిపై పొందే రేటు సగటుగా మారుతుందని, మెరుగైన రాబడికి వీలు కలుగుతుందని అభిజిత్ తాలూక్‌దార్ వివరించారు.

ఉదాహరణకు రూ.9 లక్షలను రూ.3 లక్షల చొప్పున ఏడాది, రెండేళ్లు, మూడేళ్ల కాలానికి ఎఫ్‌డీ చేశారని అనుకుందాం. 2018 జనవరి నుంచి 2020 డిసెంబర్ మధ్య ఈ ఎఫ్‌డీలు మెచ్యూరిటీ తీరేట్టుగా డిపాజిట్ చేశారు. అప్పుడు వడ్డీ రేట్లు క్షీణ బాటలో ఉన్నాయి. కనుక 6.5 శాతం, 6 శాతం, 4.7 శాతంపై ఎఫ్‌డీ చేసినట్టు అయింది. 2020 డిసెంబర్ చివరికి మూడు ఎఫ్‌డీలపై కలిపి రూ.1,63,500 రాబడిగా వచ్చి ఉండేది. అలా కాకుండా మొత్తం రూ.9 లక్షలను 2018 జనవరిలో మూడేళ్ల కాలానికి (2020 డిసెంబర్‌లో గడువు తీరే విధంగా) ఎఫ్‌డీ చేసి ఉంటే, అప్పుడు రూ.1,75,500 రాబడిగా వచ్చి ఉండేది. మూడు భాగాలుగా చేయడం వల్ల (ఎఫ్‌డీ లాడరింగ్) ఈ ఉదాహరణలో (వడ్డీ రేట్లు పడిపోయే క్రమంలో) రూ.12,000 తక్కువ రాబడి పొందినట్టు తెలుస్తోంది. ఇప్పుడు మరో ఉదాహరణలో.. 2021 జనవరి నుంచి 2023 జూలై వరకు ఇంతే మొత్తాన్ని మూడు భాగాలుగా ఎఫ్‌డీ చేసుకుని ఉంటే (4.25 శాతం, 5.50 శాతం, 6.75 శాతం) మొత్తం మీద వడ్డీ రాబడి రెండున్నరేళ్లలో రూ.1,35,000 వచ్చి ఉండేది. అలా కాకుండా రూ.9 లక్షలను 2021 జనవరిలో ఒకే ఎఫ్‌డీగా చేసి ఉంటే, దీనిపై రాబడి రూ.1,14,750గా ఉండేది. ఎఫ్‌డీ లాడర్ కారణంగా రూ.20,300 అధిక రాబడి వచ్చినట్టు తెలుస్తోంది. ''క్షీణించే, పెరుగుతూ పోయే వడ్డీ రేట్ల సైకిల్‌ను పరిగణనలోకి తీసుకుని 2018–2023 కాలంలో ఎఫ్‌డీ లాడరింగ్ చేసి ఉంటే, ఈ మొత్తంపై రూ.8,250 అధిక రాబడికి అవకాశం లభించేది'' అని ముంబైకి చెందిన ఫిన్‌టెక్ సంస్థ 'స్ట్రాటజీ' ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ ప్రశాంత బర్వాలియా వెల్లడించారు.

రాబడి సగటుగా మారి..



నిజానికి వడ్డీ రేట్లు క్షీణించే క్రమంలో కంటే.. పెరుగుతున్న తరుణంలో, మిశ్రమంగా చలించే తరుణంలో ఎఫ్‌డీ లాడర్ ప్రయోజకరంగా ఉంటుంది. ఒక్క వడ్డీ రేట్లు క్షీణించే క్రమంలోనే ఎఫ్‌డీ లాడర్ వల్ల కొంత నష్టపోవాల్సి వస్తుంది. కానీ, ఇక్కడి నుంచి వడ్డీ రేట్లు పెరుగుతాయా? లేదంటే తగ్గుతాయా? వడ్డీ రేటు గరిష్ఠ స్థాయికి చేరినట్టు ధ్రువీకరించుకోగలరా..? సాధారణ ఇన్వెస్టర్లకు ఇది క్లిష్టమైన టాస్క్ అవుతుంది. వడ్డీ రేట్లు ఇక్కడి నుంచి కచ్చితంగా పెరుగుతాయని అనిపించినప్పుడే ఎఫ్‌డీ లాడర్ చేసుకోవచ్చు. అలా కాకుండా ఊహలు, అంచనాలపై ఆధారపడకుండా అన్ని కాలాల్లోనూ ఎఫ్‌డీ లాడార్ చేసుకోవడం అనుకూలమైన విధానం.

ఏమిటి మార్గం..?

ఎఫ్‌డీ లాడర్‌తో వడ్డీరేట్ల అస్థిరతలను అధిగమించడంతోపాటు, మరో ప్రయోజనం కూడా ఉంది. లిక్విడిటీ సమస్య ఉండబోదు. ఏడాదికోసారి లిక్విడిటీ చేతికి అందుతుంది. రిటైర్మెంట్ తీసుకున్న వారికి క్రమం తప్పకుండా ఆదాయం అవసరం పడుతుంది. అటువంటి వారు మూడు నెలలు, ఆరు నెలలు, తొమ్మిది నెలలు, పన్నెండు నెలల కాలానికి ఒక్కో భాగం చొప్పున ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ''ఎఫ్‌డీ లాడరింగ్ అనేది వడ్డీ రేటు, పెట్టుబడుల రిస్క్‌ను తగ్గిస్తుంది. దీనికితోడు వివిధ కాలాల్లో స్థిరమైన నగదు ప్రవాహాలకు అవకాశం కల్పిస్తుంది. కాకపోతే ఏడాదిలోపు కాల వ్యవధులకు చేసే మినీ లాడర్‌పై తక్కువ రాబడి వస్తుంది'' అని రాకెట్‌ఫోర్డ్ ఫిన్‌క్యాప్ వ్యవస్థాపకుడు వెంకట కృష్ణన్ శ్రీనివాసన్ సూచించారు. ఇక డిపాజిట్ చేసే ముందు అందుబాటులోని వివిధ బ్యాంకులు ఆఫర్ చేస్తున్న వడ్డీ రేట్లను పరిశీలించాలి. మెరుగైన రేటును ఆఫర్ చేసే బ్యాంక్‌లో ఎఫ్‌డీ చేసుకోవడం ద్వారా రాబడిని పెంచుకోవచ్చు. సాధారణంగా బ్యాంకుల్లో ఎఫ్‌డీల కాలవ్యవధి ఏడు రోజుల నుంచి పదేళ్ల వరకు ఉంటుంది. ప్రస్తుతం అయితే 7.5 శాతం వరకు వడ్డీ రేటు ఎఫ్‌డీలపై లభిస్తోంది. 60 ఏళ్లు నిండిన వారికి అర శాతం అదనపు రేటు లభిస్తుంది. ఎఫ్‌డీ లాడార్‌లో వడ్డీ రేట్లు క్షీణించే క్రమంలో రాబడి తగ్గుతుంది. అయినా కానీ, ఈ విధానంపై నమ్మకం ఉన్న వారే దీన్ని ఎంపిక చేసుకోవాలి. ముఖ్య విషయం ఏమిటంటే.. ఏదైనా ఒక బ్యాంకులో అన్ని డిపాజిట్లు కలిపి రూ.5 లక్షలు మించకుండా, వేర్వేరు బ్యాంకుల్లో డిపాజిట్లు చేసుకోవాలి. దురదృష్టవశాత్తూ ఏదైనా బ్యాంకు సంక్షోభంలో పడినా, రూ.5 లక్షల వరకు బీమా రూపంలో వెనక్కి వస్తుంది.



ఐసీఐసీఐ ప్రూ గిఫ్ట్ ప్రో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా గిఫ్ట్ ప్రో పేరుతో కొత్త ఇన్‌కం ప్లాన్‌ను పరిచయం చేసింది. ఇది వినియోగదారులకు సంవత్సరానికి పెరుగుతున్న ఆదాయాన్ని లేదా స్థిరమైన సాధారణ ఆదాయాన్ని 30 ఏళ్ల వరకు పొందే అవకాశాన్ని అందిస్తుంది. అదనంగా ఈ నాన్‌-పార్టిసిపేటింగ్ సేవింగ్స్ ఉత్పాదన అందించే జీవిత బీమాతో కుటుంబానికి ఆర్థిక భద్రతను కలిగి ఉండేలా చేస్తుంది.

హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ టెక్నాలజీ ఫండ్

సెప్టెంబర్ 5 వరకు అందుబాటులో



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ 'హెచ్‌డీఎఫ్‌సీ టెక్నాలజీ ఫండ్'ను ప్రారంభించింది. సెప్టెంబర్ 5 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. ఈ ఓపెన్ ఎండెడ్ పథకం టెక్నాలజీ, టెక్నాలజీ ఆధారిత కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. స్టాక్ ఎంపికకు బోటమ్ అప్ విధానాన్ని అనుసరిస్తుంది. అంటే విడిగా కంపెనీల ఆర్థిక మూలాలను పరిగణనలోకి తీసుకుని ఇన్వెస్ట్ చేస్తుంది. ఐటీ సర్వీసెస్, సాఫ్ట్‌వేర్, కన్సల్టింగ్, ఔట్‌సోర్సింగ్, ఐటీ ఉత్పత్తులు, హార్డ్‌వేర్, ఇంటర్నెట్ కంపెనీలు, ఇంటర్నెట్ ఆధారిత సేవలు అందించే కంపెనీలు, టెలికమ్యూనికేషన్స్, మీడియా, ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, డేటా, డేటా సొల్యూషన్స్ కంపెనీల్లో 80 శాతం వరకు ఇన్వెస్ట్ చేయనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

4-9-2023	
విశాఖ	485–00
చిత్తూరు	468–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	72.00
3-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	430–00
వరంగల్	432–00
రిటైల్ ధర	4.90

స్టాక్స్ వ్యూ

చోళ ఇన్వెస్ట్‌మెంట్ | ఆనంద్ రాఠి | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,129 టార్గెట్: రూ. 1,425

ఎందుకంటే: ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ డిజిటల్, ఎస్‌ఎంఈ, కన్జూమర్ ఫైనాన్స్ విభాగాలలో కార్యకలాపాలను మరింత పటిష్టపరచేందుకు చర్యలు చేపట్టింది. దీర్ఘకాలిక రిటర్న్ ఆన్ అసెట్స్(ఆర్‌వోఏ)ను పెంచుకునే బాటలో కంపెనీ వ్యవస్థాగత మార్పులకు తెరతీసింది. దీంతో కంపెనీ నిర్మాణాత్మక పునర్వ్యవస్థీకరణ బాటలో సాగుతోంది. ఈ ప్రణాళికల ప్రభావం 2024–25 నుంచి కనిపించనుంది. ప్రస్తుతం 20 శాతానికిపైగా నమోదవుతున్న కొత్త బిజినెస్‌లలో రుణ పంపిణీ మరింత మెరుగుపడనుంది. సంప్రదాయ బిజినెస్‌లతో పోలిస్తే అత్యధిక స్థాయిలో రిటర్న్ ఆన్ టోటల్ అసెట్స్(ఆర్‌వోటీఏ) సాధనకు కొత్త విభాగాలను రూపొందిస్తోంది. వెరసి గరిష్టస్థాయిలో రుణ వృద్ధి కొనసాగేందుకు వీలు చిక్కనుంది. కస్టమర్ కేంద్రంగా మూడు నియమాల(3సీ)తో రూపొందించిన ప్రణాళికలు కొత్త బిజినెస్ వృద్ధికి దోహదం చేయనున్నాయి. కంపెనీ విడుదల చేస్తున్న రుణాల్లో అత్యధిక శాతం సొంత బిజినెస్‌లు నిర్వహిస్తున్నవారు, వృత్తినిపుణుల(ఎస్‌ఈఎన్‌పీ) విభాగం ఆక్రమిస్తోంది. అండర్‌రైటింగ్ కార్యకలాపాల్లో నైపుణ్యం, వసూళ్ల(కలెక్షన్లు) ప్రాసెస్‌లో పటిష్ఠ నిర్వహణ వంటి అంశాలు కోవిడ్–19 పరిస్థితుల్లోనూ కంపెనీ కార్యకలాపాలకు అండగా నిలిచాయి. దీంతో కరోనా సవాళ్లలోనూ పటిష్ఠ పనితీరు చూపగలిగింది. ఇదేపద్ధతిలో కొత్త బిజినెస్‌లలోనూ విస్తరించనుంది. క్రెడిట్ అండర్‌రైటింగ్ ప్రమాణాలు, కలెక్షన్ ఫస్ట్ విధానాలు ఇందుకు సహకరించనున్నాయి. సుప్రసిద్ధ ప్రమోటర్ గ్రూప్, కంపెనీ అవలంబిస్తున్న పటిష్ఠ విధానాలు, వ్యవస్థలు షేరుకి మద్దతునిచ్చే అంశాలుగా పరిగణించవచ్చు.

శూల వైన్‌యార్డ్స్ | కీనోట్ క్యాపిటల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 493 టార్గెట్: రూ. 587

ఎందుకంటే: రాజీవ్ సామంత్ 1999లో ఏర్పాటు చేసిన శూల వైన్‌యార్డ్స్ దేశీయంగా వైన్ బిజినెస్‌లో పాగా వేసింది. కంపెనీ ఆదాయంలో వైన్లు 92 శాతం ఆక్రమిస్తుంటే.. వైన్ టూరిజం వాటా 8 శాతంగా నమోదుకావడం ఈ అంశాన్ని ప్రతిఫలిస్తోంది. వైనరీ విభాగం 56 సొంత బ్రాండ్ల పోర్ట్‌పోలియోతో పటిష్ఠతను సంతరించుకుంది. అంతేకాకుండా మరో 21 అంతర్జాతీయ వైన్, స్పిరిట్స్ (థర్డ్‌పార్టీ) బ్రాండ్లతో కంపెనీ కార్యకలాపాలు విస్తరించింది. 2023 మార్చికల్లా మహారాష్ట్ర, కర్ణాటకలలో ఆరు తయారీ ప్లాంట్లను కలిగి ఉంది. వీటి మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 16.7 మిలియన్ లీటర్లు కాగా.. 2,800 ఎకరాల ద్రాక్ష తోటల నుంచి 500 మందికిపైగా రైతుల ద్వారా ముడిసరుకు పొందుతోంది. 2022–23కల్లా అమ్మకాల పరిమాణం రీత్యా దేశీ అన్‌ఫోర్టిఫైడ్ మార్కెట్లో కంపెనీ 52 శాతం వాటాను కలిగి ఉంది. విలువరీత్యా అత్యంత ఖరీదైన, విలువైన వైన్ విభాగంలో 61 శాతం వాటాను ఆక్రమిస్తోంది. గత రెండేళ్ల (2021–23)లో వార్షిక ప్రాతిపదికన సొంత బ్రాండ్ల బిజినెస్ 13 శాతం, వైన్ టూరిజం 17 శాతం చొప్పున వృద్ధిని అందుకున్నాయి. దీంతో 2023 మార్చికల్లా ప్లాంట్ల తయారీ సామర్థ్యాన్ని వార్షికంగా 14 శాతంమేర పెంచింది. వెరసి 16.7 మిలియన్ లీటర్లకు చేర్చింది. ఇదేవిధంగా స్టోరేజీ అవసరాలకు రూముల సామర్థ్యాన్ని సైతం గత 15 నెలల్లో 49 శాతంమేర హెచ్చించింది. ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికాని(ఏప్రిల్–జూన్)కల్లా 100 రూములను మించి ఏర్పాటు చేసింది. ఈ ఏడాది వైన్ వినియోగం పరిమాణంలో 15 శాతం, ధరలు 4 శాతం చొప్పున పుంజుకునే వీలుంది. తద్వారా నాయకత్వస్థాయిని కొనసాగించే అవకాశముంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

జీఎంఆర్ పవర్‌కు భారీ ఆర్డరు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ పవర్ అనుబంధ సంస్థ జీఎంఆర్ స్మార్ట్ ఎలెక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ (జీఎస్‌ఈడీపీఎల్)కు పూర్వాంచల్ విద్యుత్ వితరణ్ నిగమ్ నుంచి రూ. 5,123 కోట్ల విలువ చేసే ఆర్డర్లు లభించాయి. వీటి కింద ఉత్తర్‌ప్రదేశ్‌లోని పూర్వాంచల్ (వారణాసి, ఆజమ్‌గఢ్ జోన్, ప్రయాగ్‌రాజ్, మీర్జాపూర్ జోన్)లో 50.17 లక్షల స్మార్ట్ మీటర్ల ఇన్‌స్టాలేషన్, నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుంది. ఇందులో ప్రయాగ్‌రాజ్–మీర్జాపూర్ జోన్ కాంట్రాక్టు విలువ రూ. 2,387 కోట్లుగాను, వారణాసి–ఆజమ్‌గఢ్ జోన్ కాంట్రాక్టు విలువ రూ. 2,736.65 కోట్లుగాను ఉంటుందని సంస్థ తెలిపింది. త్వరలోనే దక్షిణాంచల్ (ఆగ్రా, అలీగఢ్ జోన్)లో 25.52 లక్షల స్మార్ట్ మీటర్ల ప్రాజెక్టుకు సంబంధించి దక్షిణాంచల్ విద్యుత్ వితరణ్ నిగమ్ నుంచి కూడా కాంట్రాక్టు లభించే అవకాశం ఉందని పేర్కొంది.


ఎక్స్‌పర్ట్ ఏసీతో హైకావా అప్లయెన్సెస్ జట్టు



హైదరాబాద్: జపాన్‌కు చెందిన ఏసీలు, గృహోపకరణాల తయారీ దిగ్గజం హైకావా అప్లయెన్సెస్ తాజాగా నేషనల్ ఎయిర్‌కాన్ ఇండియాలో భాగమైన ఎక్స్‌పర్ట్ ఏసీ సొల్యూషన్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీనితో దక్షిణాదిలో హైకావా ఉత్పత్తులకు ఎక్స్‌పర్ట్ సొల్యూషన్స్ సూపర్ స్టాకిస్టుగాను, సర్వీస్ ప్రొవైడరుగాను ఉండనుంది. తద్వారా తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలకు కూడా తమ కార్యకలాపాలు విస్తరించగలమని హైకావా సీఈవో మక్బూల్ సూర్య తెలిపారు. తమ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల విస్తృత నెట్‌వర్క్ ద్వారా విక్రయాలను గణనీయంగా పెంచేందుకు కృషి చేయగలమని నేషనల్ ఎయిర్‌కాన్ ఎండీ షాముద్దీన్, ఎక్స్‌పర్ట్ ఏసీ డైరెక్టర్ జయిన్ పేర్కొన్నారు.

ఆరు నెలల కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

మూడు నుంచి ఆరు నెలల కాలానికి రూ.50వేలు ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. మెరుగైన రాబడుల కోసం ఈ మొత్తాన్ని ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?

– సంతోష్ కుమార్

పెట్టుబడులకు చాలా స్వల్పకాలం ఉంది. కనుక మెరుగైన రాబడుల కోసం పెట్టుబడిపై రిస్క్ తీసుకోవడం సరికాదు. పెట్టుబడికి భద్రత ఎక్కువ ఉండాలి. రాబడుల కంటే పెట్టుబడిని కాపాడుకునే విధంగా వ్యూహం ఉండాలి. కనుక ఈ మొత్తాన్ని మీరు బ్యాంకు ఖాతాలోనే ఉంచుకోవచ్చు. లేదంటే ఆరు నెలల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వీటిల్లో రాబడులు తక్కువే అయినా గ్యారంటీతో కూడినవి. పైగా పెట్టుబడికి భద్రత ఎక్కువ. బ్యాంకులో చేసే డిపాజిట్ రూ.5 లక్షల వరకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ నుంచి బీమా ఉంటుంది. అలాగే, లిక్విడ్ ఫండ్స్‌లోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇవి ట్రెజరీ బిల్లులు, ప్రభుత్వ సెక్యూరిటీలు, రెపో సర్టిఫికెట్లలో ఇన్వెస్ట్ చేస్తాయి. గరిష్ఠంగా 91 రోజుల కాల వ్యవధి కలిగిన సెక్యూరిటీల్లోనే లిక్విడ్ పథకాలు ఇన్వెస్ట్ చేస్తాయి. బ్యాంకు డిపాజిట్ల కంటే లిక్విడ్ ఫండ్స్‌లో కొంచెం అదనపు రాబడి వస్తుంది. కాకపోతే పెట్టుబడి భద్రతకు అవి హామీ ఇవ్వవు.

నేను యూఎస్ లేదా గ్లోబల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలని అనుకుంటున్నాను. ఇందుకోసం ఫండ్స్‌ను ఎలా ఎంపిక చేసుకోవాలి? వీటికి ఎంత మేర కేటాయింపులు చేసుకోవాలి?

– వరుణ్

దేశం వెలుపలి ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే పథకాలను ఇంటర్నేషనల్ ఫండ్స్ అని పిలుస్తారు. తమ పిల్లలను ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపించాలని కోరుకునే వారు ఇంటర్నేషనల్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. విదేశీ కరెన్సీలో అయ్యే వ్యయాలకు ముందు నుంచే ఈ రూపంలో ప్రణాళిక మేరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పిల్లలు స్కూల్‌లో చేరినప్పటి నుంచి వారి భవిష్యత్ విదేశీ విద్య కోసం ఇంటర్నేషనల్ ఫండ్స్‌లో సిప్ ద్వారా క్రమానుగతంగా ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లాలి. దేశీయంగా మెరుగైన రాబడులను ఇచ్చే పథకాలు ఎన్నో ఉన్నాయి. అయినప్పటికీ కరెన్సీ విలువల పరంగా ఉండే రిస్క్‌ను దృష్టిలో పెట్టుకుని కొంత మొత్తాన్ని మంచి రాబడినిచ్చే అంతర్జాతీయ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం మేలైన నిర్ణయం అవుతుంది. వివిధ రంగాల కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే వైవిధ్యంతో కూడిన ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవాలి. మనం భారత్‌లో నివసిస్తున్నప్పుడు, మన ఆదాయం, వ్యయాలు, ఆస్తులన్నీ ఇక్కడే ఉంటాయి. అంతర్జాతీయ పెట్టుబడులు అన్నవి మన మార్కెట్‌తో సంబంధం కలిగి ఉండవు. కాకపోతే ఈ మార్గం ద్వారా తగినంత వైవిధ్యాన్ని పాటించొచ్చు. అలాగే, కేవలం ఒకే రంగంలో పెట్టుబడులు పెట్టే ఇంటర్నేషనల్ ఫండ్స్‌కు దూరంగా ఉండాలి. ఇంటర్నేషనల్ ఫండ్స్ థీమ్యాటిక్ ఫండ్ లేదా కమోడిటీ ఫండ్ లేదా ఒకే దేశానికే సంబంధించి పెట్టుబడులతో కూడిన పథకాల్లో రిస్క్ ఉంటుంది. అప్పటి వరకు సానుకూలంగా ఉన్న రాబడులు ప్రతికూలంగా మారిపోవచ్చు. అందుకని వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోతో ఉన్న పథకాలను ఎంపిక చేసుకోవాలి.

అంతర్జాతీయ కరెన్సీ మార్కెట్లో డాలర్ విలువ ఏటేటా బలపడుతోంది. 2017లో యూఎస్ డాలర్ రూపాయితో 65 దగ్గర ఉంటే, ఇప్పుడు 83కు చేరింది. ఐదేళ్లలో ఏటా 4 శాతానికి పైనే డాలర్ బలపడింది. డాలర్ మారకంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఈ విధమైన కరెన్సీ ప్రయోజనాన్ని పొందొచ్చు. డాలర్ మారకంతో కూడిన ఇంటర్నేషనల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా క్షీణించే రూపాయి విలువ పరంగా రక్షణ ఉంటుంది. ఫలితంగా మెరుగైన రాబడి అందుకోవచ్చు. అలాగే, ఈక్విటీ పథకాల మాదిరే ఇంటర్నేషనల్ ఫండ్స్‌లోనూ దీర్ఘకాలం దృష్టితోనే పెట్టుబడులు పెట్టాలి. ఏడాది, మూడేళ్ల కాల పనితీరు చూసి పెట్టుబడులు పెట్టకూడదు. ఇంటర్నేషనల్ ఫండ్స్‌ను ఆదాయపన్ను చట్టం నాన్ ఈక్విటీ పథకాలుగా పరిగణిస్తుంది. కనుక డెట్ ఫండ్స్ మాదిరే పన్ను విధానం అమలవుతుంది.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.